www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
వరంగల్
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 130
గురువారం | 7-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి మ.2.28 తదుపరి చతుర్దశి; నక్షత్రం: పూర్వాషాఢ మ.2.01 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: రా.10.10-11.47; దుర్ముహూర్తం: ఉ.10.13-11.04, మ.3.18-4.09; అమృతఘడియలు: ఉ.9.00-10.40; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.59; సూర్యాస్తమయం: 6.41
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అశ్వదళంలో నారీ శక్తి

దేశంలోనే ఎంతో విశిష్టత కలిగిన హైదరాబాద్ మౌంటెడ్ పోలీసు విభాగం(అశ్వదళం)లో నారీశక్తి కూడా ఇప్పుడు భాగమైంది. ఇన్నాళ్లూ పురుషులు మాత్రమే ఉన్న ఈ అశ్వదళంలో ఇప్పుడు 10 మంది మహిళా పోలీసులు కూడా చేరారు. హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సూచనల మేరకు ఎంపిక చేసిన 10 మంది ఏఆర్ మహిళా కానిస్టేబుళ్లకు ఆరు నెలల పాటు గుర్రపు స్వారీపై అధికారులు శిక్షణ ఇచ్చారు. తెలంగాణ అశ్వదళంలోనే మొదటి మహిళా బ్యాచ్‌ను సిద్ధం చేశారు. ఈ మహిళా పోలీసులు శిక్షణలో భాగంగా ప్రతి శుక్రవారం మక్కామసీదు, చార్మినార్ వద్ద గుర్రాలపై స్వారీ చేస్తూ గస్తీ, బందోబస్తు నిర్వహించారు. అలాగే, నెక్లెస్ రోడ్డులోనూ విధులు నిర్వర్తించారు.

– హైదరాబాద్ సిటీ



రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులను అమెరికా కొన్ని రోజులుగా టార్గెట్ చేస్తోంది. ఈ అంశంపై మేం ఇప్పటికే మా వైఖరిని స్పష్టం చేశాం. 140 కోట్ల మంది దేశ ప్రజలకు ఇంధన భద్రత కోసం మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మా చమురు దిగుమతులు ఉన్నాయి. భారత్‌పై అదనపు సుంకాలు విధించాలని అమెరికా నిర్ణయించడం తీవ్ర దురదృష్టకరం. దీనిపై జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా అవసరమైన చర్యలను భారత్ చేపడుతుంది.

- భారత విదేశాంగ శాఖ

మరో 25% సుంకం

- భారత్‌పై ట్రంప్ సుంకాల బాంబు!.. ఇప్పటికే ప్రకటించిన 25 శాతానికి అదనం.. మొత్తంగా 50 శాతానికి పెంపు
- ప్రతీకార సుంకాలు విధిస్తే మరింతగా పెంచుతామని హెచ్చరికలు.. తొలి 25% టారిఫ్ నేటి నుంచే అమల్లోకి!
- అదనపు టారిఫ్ ఈ నెల 27వ తేదీ నుంచి.. వస్త్ర, ఆక్వా, పాదరక్షల పరిశ్రమలపై సుంకాల ప్రభావం
- ఉక్కు, అల్యూమినియం, ఫార్మా ఉత్పత్తులు సహా ఇప్పటికే ఉన్న మినహాయింపులు కొనసాగింపు
- అదనపు సుంకాలు అసమంజసం: భారత్.. మిత్రదేశం భారత్‌ను దూరం చేసుకోవద్దు: నిక్కీ హేలీ
- అదానీపై అమెరికాలో దర్యాప్తు.. అందువల్లే ట్రంప్ బెదిరింపులకు మోదీ దీటుగా స్పందించడం లేదు: రాహుల్



వాషింగ్టన్/ న్యూఢిల్లీ, ఆగస్టు 6: భారత్‌పై దిగుమతి సుంకాలను మరో 25% పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బుధవారం నిర్ణయం తీసుకున్నారు. మొత్తంగా భారత్‌పై సుంకాలను 50 శాతానికి పెంచారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లనుభారత్ కొనసాగిస్తున్నందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు. ఒకవేళ భారత్ ప్రతీకార సుంకాలేమైనా విధిస్తే... తమ టారిఫ్‌లను మరింతగా పెంచుతామని హెచ్చరించారు. '24 గంటల్లో భారత్‌పై సుంకాలు పెంచుతాన'ంటూ మంగళవారం ప్రకటించిన ట్రంప్.. అన్నట్టుగానే బుధవారం సుంకాల పెంపు ఉత్తర్వులపై సంతకం చేశారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే ఇప్పటికే విడిగా సుంకాలను నిర్ధారించిన ఉక్కు, అల్యూమినియం, ఫార్మా వంటి ఉత్పత్తులపై మినహాయింపులు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుండటంతో ఉక్రెయిన్‌పై యుద్ధం కోసం రష్యాకు నిధులు

మిగతా 2వ పేజీలో...

తడాఖా చూపిస్తాం!

బీసీల రిజర్వేషన్లకు ఆమోదం తెలపకపోతే ప్రధాని మోదీని గద్దె దింపుతాం

- కేంద్రం మెడలు వంచైనా రిజర్వేషన్లు సాధిస్తాం
- మోదీకి చిత్తశుద్ధి ఉంటే బిల్లును ఆమోదింపజేయాలి
- రాహుల్ ఆశయాలకు అడ్డు తగిలిన వారి అడ్రస్ గల్లంతే
- ఇక ఢిల్లీకి రాం.. గల్లీలోనే బీజేపీ నేతలను పట్టుకుంటాం
- కిషన్‌రెడ్డి, సంజయ్, రాంచందర్‌లకు బీసీలు అక్కర్లేదా?
- బీసీల రిజర్వేషన్లకు అడ్డుపడేది బీజేపీ నేతలు, కేసీఆరే
- తెలంగాణతో బీఆర్ఎస్ పేగుబంధం తెంచుకుందా?
- కులగణన చేసే అదృష్టం సీఎంగా నాకే దక్కింది
- ఢిల్లీలో పోరుబాట ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఢిల్లీలో పోరుబాట ధర్నాలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మహేశ్‌గౌడ్, అడ్లూరి, మీనాక్షి, పొన్నం, జీవన్‌రెడ్డి, సురేఖ

బీజేపీ నేతలు చేతగాని దద్దమ్మలు

- సీఎం రేవంత్ రెడ్డి మొనగాడు
- ఎస్సీ, ఎస్టీ, బీసీల మద్దతు లేకుండా కిషన్‌రెడ్డి నామినేషన్ వేయగలరా?
- బండి సంజయ్ సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు

13

పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

న్యూఢిల్లీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలుపకుంటే ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దింపుతామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య, ఉద్యోగ రంగాల్లో 42% రిజర్వేషన్లు సాధించి తీరతామని స్పష్టం చేశారు. "మోదీజీ బీసీ రిజర్వేషన్లు ఆమోదించండి. లేదంటే మిమ్మల్ని గద్దె దింపుతాం. గోద్రా అల్లర్ల సమయంలో రాజీనామా చేయమని అప్పటి ప్రధాని వాజపేయి అడిగినా మోదీ రాజీనామా చేయలేదు. ఇప్పుడు 75 ఏళ్ల నిండినందున పదవి నుంచి వైదొలగాలని ఆరెస్సెస్ చీఫ్ కోరుతున్నా మోదీ పట్టించుకోవడం లేదు. ఇక మోదీ లేకపోతే బీజేపీకి 150 సీట్లు కూడా రావని ఆయన భక్తుడు నిశికాంత్ దూబే అంటున్నారు. ఈసారి బీజేపీకి ఎట్టి పరిస్థితుల్లోనూ 150 సీట్లు దాటవని నేను చెబుతున్నా. రాసిపెట్టుకోండి. బీసీ రిజర్వేషన్లను మోదీ అడ్డుకుంటే ఆయన్ను గద్దె దించి, రాహుల్‌ని ప్రధానమంత్రిని చేసుకొని మా డిమాండ్‌ను నెరవేర్చుకుంటాం" అని రేవంత్ చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుల ఆమోదం కోరుతూ ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో బుధవారం నిర్వహించిన పోరుబాట ధర్నాలో సీఎం రేవంత్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం

మిగతా 13వ పేజీలో...

- రేవంత్ ప్రయత్నాలకు అండగా నిలుస్తాం: కనిమొళి
- అంబేడ్కర్, కరుణానిధి సరసన రేవంత్: సుప్రియసూలే
- బీసీల పోరు తెలంగాణకే పరిమితం కాదు ఇది భారతీయుల సమష్టి యుద్ధం.. 'ఎక్స్'లో రాహుల్ 13

ఎంఎస్ఎంఈ పార్కులకు నిధులివ్వండి

- కేంద్ర మంత్రి మాంఝీకి భట్టి విక్రమార్క విజ్ఞప్తి
- యూరియా కోటాను వెంటనే సరఫరా చేయండి 14
- కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, నిర్మలకు తుమ్మల విజ్ఞప్తి



హైకోర్టుల్లో ఏం జరుగుతోంది?

- సివిల్ కేసులో క్రిమినల్ విచారణను సమర్థిస్తారా?
- ఈ తరహా తీర్పులు బాహ్యప్రభావాల వల్ల వస్తున్నాయా? లేక అవగాహనలేమితోనా? అని ఆశ్చర్యం వేస్తుంటుంది
- అలహాబాద్ హైకోర్టు జడ్జి తీర్పుపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- ఆయన తన తీర్పుతో న్యాయవ్యవస్థను హేళన చేశారని, అది అత్యంత చెత్త, తప్పుడు తీర్పుల్లో ఒకటని వ్యాఖ్య
- పదవీ విరమణ చేసేదాకా ఆయనకు అసలు క్రిమినల్ కేసుల విచారణే అప్పగించొద్దంటూ అసాధారణ ఆదేశాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 6: సివిల్ వివాదాన్ని క్రిమినల్ కేసుగా పరిగణించి విచారణకు అనుమతిస్తూ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు తీవ్ర పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ తీర్పును అత్యంత చెత్త, తప్పుడు తీర్పుల్లో ఒకటిగా అభివర్ణించింది. "ఇలాంటి తీర్పులు బాహ్యప్రభావాల కారణంగా వస్తాయా లేక చట్టంపై అవగాహన లేకపోవడం వల్లా?' అని మాకు ఒక్కోసారి ఆశ్చర్యం వేస్తుంటుంది. కారణమేదైనాగానీ.. ఇలాంటి అసంబద్ధ, తప్పుడు ఆదేశాలివ్వడం క్షమించదగిన విషయం కాదు" అని మండిపడింది. ఈ తరహా తీర్పు ఇవ్వడం ద్వారా ఆ న్యాయమూర్తి తనను తాను తక్కువ చేసుకోవడమే కాక.. న్యాయవ్యవస్థను హేళన చేశారని

మిగతా 2వ పేజీలో...

ప్రకటనల్లో సీఎం ఫొటో తప్పేంకాదు!

- మీ రాజకీయాలకు కోర్టులను వాడొద్దు
- అన్నాడీఎంకే ఎంపీపై సుప్రీం సీరియస్
- 10 లక్షల జరిమానా విధించిన ధర్మాసనం
- మద్రాస్ హైకోర్టు ఆదేశాలు కొట్టివేత

2



మెడికల్ కాలేజీలపై జరిమానా విధించే అధికారం మీకుందా?

- కాళోజీ హెల్త్ వర్సిటీకి హైకోర్టు ప్రశ్న
- ఇటీవల చల్మెడ కాలేజీలో హెల్త్ వర్సిటీ అధికారుల తనిఖీలు.. భారీగా లోపాలు
- కాలేజీపై రూ.కోటి జరిమానా
- అభ్యర్థనతో రూ.20 లక్షలకు తగ్గింపు
- వర్సిటీ నోటీసు చెల్లదంటూ హైకోర్టుకు చల్మెడ ఆనందరావు కాలేజీ 14

రెపో రేటు యథాతథం

- ట్రంప్ సుంకాల దెబ్బకు వడ్డీ రేట్ల కోతకు ఆర్బీఐ బ్రేక్.. రుణగ్రహీతల ఆశలపై నీళ్లు
- ఈసారి జీడీపీ వృద్ధి అంచనా 6.5% 11

ఈ నెలాఖరులో చైనాకు ప్రధాని మోదీ

- గల్వాన్ ఘర్షణల తర్వాత తొలిసారి 2
- రెండు దేశాల పర్యటనలో భాగంగా తొలుత జపాన్‌కు, తర్వాత చైనాలో జరిగే ఎస్సీవోకి

80 మంది శిశువుల విక్రయం

పిల్లలు లేని దంపతులతో 'సృష్టి' చెలగాటం

- ఒక్కొక్కటిగా వెలుగులోకి డాక్టర్ నమ్రత అరాచకాలు
- సరోగసీ పేరుతో నయవంచన
- అడ్డగోలుగా శిశు విక్రయాలు
- పిల్లల అంతర్రాష్ట్ర అక్రమ రవాణా ముఠాలతో లింకులు
- రూ. 25 కోట్ల దాకా 'సృష్టి' మోసాలు
- పోలీసుల దర్యాప్తులో వెల్లడి
- నమ్రత, ఆమె కొడుకు జయంత్ కృష్ణ బ్యాంకు ఖాతాల స్తంభన
- నమ్రతపై గైనకాలజిస్టు ఫిర్యాదు
- 8కి చేరిన 'సృష్టి' మోసాల కేసులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సృష్టి ఫర్టిలిటీ మోసం కేసులో నమ్రత పాపాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. దర్యాప్తు అధికారులే నమ్రత మోసాలను చూసి అవాక్కవుతున్నారు. పిల్లలు లేని దంపతులకు టెస్ట్‌ట్యూబ్ బేబీ, సరోగసి ద్వారా పిల్లలు కలిగేలా చేస్తామని నమ్మించిన నమ్రత.. వారు సరోగసీకి ఒప్పుకొనేలా కౌన్సెలింగ్ ఇచ్చేది. ఆ తర్వాత సంబంధిత దంపతుల నుంచి సేకరించిన వీర్యం, అండాన్ని మరో మహిళ గర్భంలో పెంచుతున్నట్లు నమ్మించేది. ఇందుకోసం రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు చేసేది. అంతటితో ఆగకుండా.. నవ మాసాలు పూర్తయ్యేవరకు సరోగసి మహిళ ఆరోగ్యం, వైద్యం ఖర్చులు, నిర్వహణ, పోషకాహారం.. ఇలా పలు కారణాలు చెప్పి.. అదనంగా దండుకునేదని దర్యాప్తు అధికారులు గుర్తించారు. స్పెషలిస్టు డాక్టర్‌తో ఆ మహిళకు చికిత్స అందిస్తున్నామని పేర్కొంటూ.. ఓ మహిళా గైనకాలజిస్టు లెటర్‌హెడ్‌పై ప్రిస్క్రిప్షన్ రాసేవారని

మిగతా 3వ పేజీలో...



పోలీసుల అదుపులో డాక్టర్ నమ్రత

సగానికి పైగా సంతాన సాఫల్య కేంద్రాల్లో లోపాలు

3

- గ్రేటర్ హైదరాబాద్‌లోని ఫర్టిలిటీ కేంద్రాల్లో ముగిసిన తనిఖీలు
- నోటీసులకు రంగం సిద్ధం.. ఇక రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు



ఇప్పుడేం చేద్దాం?

- కేసీఆర్‌తో హరీశ్‌రావు భేటీ
- పవర్ పాయింట్ ప్రజంటేషన్ ప్రభావం, ప్రభుత్వ ఆరోపణలు తిప్పికొట్టడంపై చర్చ!
- ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా అంశంపైనా..

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మరోసారి సమావేశమయ్యారు. ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో కేసీఆర్‌ను బుధవారం కలిసిన హరీశ్‌రావు ఆయనతో వివిధ అంశాలపై చర్చించినట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలను

మిగతా 14వ పేజీలో...

ఆహ్వానిస్తే.. బీఆర్ఎస్ బీసీ సభకెళ్తా

ఇప్పటివరకైతే పిలుపు రాలేదు: కవిత 14



ఏ23.. బెట్టింగ్ కాదు.. గేమింగ్ యాప్

- అన్ని అనుమతులు ఉన్నందునే ప్రచారానికి అంగీకరించా 10
- సినీ నటుడు విజయ్ దేవరకొండ
- ఈడీ ఎదుట విచారణకు హాజరు

బిహార్‌లో 65 లక్షల ఓట్లు ఎలా తొలగించారు?

- ఆ ఓటర్ల వివరాలు మాకు అందించండి
- ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు ఆదేశం 2
- బిహార్ ఓటర్ల జాబితా సవరణపై పార్లమెంటులో కొనసాగుతున్న ప్రతిష్టంభన

ఏసీబీకి చిక్కిన డీటీవో

- రూ.22 వేలు లంచం తీసుకుంటుండగా జగిత్యాల డీటీవో పట్టివేత
- మరో మూడు వారాల్లో పదవీ విరమణ
- రూ.3వేలు తీసుకుంటూ పట్టుబడిన మహబూబ్‌నగర్ జిల్లా ఏఈఈ 3



పట్టుబడిన సొమ్ముతో డీటీవో భద్రునాయక్

ఈ నెలాఖరులో చైనాకు ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 6: దాదాపు ఏడేళ్ల తర్వాత ప్రధాని మోదీ ఈ నెలాఖరులో చైనాలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. సంబంధిత వర్గాలు తెలియజేసిన వివరాల ప్రకారం.. మోదీ రెండు దేశాల పర్యటనలో భాగంగా మొదట ఆగస్టు 29న జపాన్ వెళ్తారు. అక్కడ ఇరుదేశాల వార్షిక సదస్సులో జపాన్ ప్రధానితో సమావేశం అవుతారు. అనంతరం చైనాలో పర్యటిస్తారు. తియాంజిన్ వేదికగా ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 1 వరకు జరగనున్న షాంఘై సహకార సంఘం(ఎస్‌సీవో) వార్షిక సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉంది. గతేడాది రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చివరిసారిగా జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అయ్యారు. తూర్పు లద్దాఖ్‌లోని గాల్వాన్‌లో సరిహద్దు ఘర్షణల తర్వాత ప్రధాని మోదీ చైనాలో చేయబోయే తొలి పర్యటనగా ఇది నిలవనుంది. కాగా, రానున్న ఎస్‌సీవో సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలును వ్యతిరేకిస్తూ భారత్‌పై ట్రంప్ భారీగా సుంకాలు విధించిన నేపథ్యంలో మోదీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

11 ఏళ్లుగా భారత్‌లో పారదర్శక పాలన: మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 6: గత 11 ఏళ్లుగా భారత్‌లో పౌరులే కేంద్రంగా పారదర్శక పాలన సాగుతోందని ప్రధాని మోదీ చెప్పారు. ప్రస్తుత సమస్యలను భవిష్యత్ తరాలకు వదిలివేయబోమని, దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడంలో కలిసి పనిచేద్దామని మోదీ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చే లక్ష్యంతో నిర్మిస్తోన్న కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ 10 భవనాల్లో మొదటిదైన కర్తవ్య భవన్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. భవనాలన్నీ పూర్తయితే ఏడాదికి రూ.1500 కోట్లు అద్దె రూపంలో మిగులుతాయని ప్రధాని చెప్పారు. కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ 10 భవనాల్లో కర్తవ్య భవన్-3లో కేంద్ర హోం, విదేశాంగ, గ్రామీణాభివృద్ధి, పరిశ్రమలు, పెట్రోలియం శాఖల కార్యాలయాలతో పాటు ప్రిన్సిపల్ సైంటిఫిక్ సలహాదారు కార్యాలయం కూడా ఏర్పాటు చేస్తారు.

ధరాలీలో 28మంది కేరళ పర్యాటకులు గల్లంతు

ఉత్తరకాశీ, ఆగస్టు 6: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో మంగళవారం కురిసిన కుంభవృష్టి, ఆకస్మిక వరదల్లో కేరళకు చెందిన 28మంది పర్యాటకులు గల్లంతయ్యారు. వారు మంగళవారం ఉదయం 8.30గంటలకు ధరాలీ నుంచి గంగోత్రికి బయల్దేరినట్లు చెప్పారని, ఆ మార్గంలోనే కొండచరియలు విరిగిపడ్డాయని, ఆ తర్వాత ఈ పర్యాటకుల నుంచి ఎలాంటి సమాచారం లేదని గల్లంతైనవారిలో ఒకరి బంధువు మీడియాతో చెప్పారు. మరోవైపు, ధరాలీలో వరదలో, బురదలో చిక్కుకుపోయినవారిని కాపాడటానికి సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 190మందిని కాపాడినట్లు ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ వెల్లడించారు. ఒకరి మృతదేహాన్ని వెలికితీసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, గంగోత్రిలో చిక్కుక్కున్న యాత్రికులను నెలాంగ్ లోయ మార్గం నుంచి పంపించేందు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ధామీ వెల్లడించారు. తర్వలోనే యాత్రికులందరినీ స్వస్థలాలకు పంపిస్తామన్నారు.

డ్రైవర్లకు విశ్రాంతి కోసం హైవేల పక్కన 5వేల ఎమినిటీ సెంటర్లు

- ప్రతి 30-40 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటు

న్యూఢిల్లీ, ఆగస్టు 6: జాతీయ రహదారులపై దూర ప్రయాణాలు చేసే ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రణాళికలు రచిస్తోంది. దీనిలో భాగంగా దేశంలోని అన్ని జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల వెంబడి నూతనంగా రెస్ట్ స్టాప్‌లను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ప్రతి 30-40 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటయ్యే వీటిలో కారు, బస్సు ప్రయాణికులతో పాటు భారీ వాహనాల డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా సదుపాయాలు కల్పించనుంది. వేసైడ్ ఎమినిటీ (డబ్ల్యూఎస్‌ఏ)గా పిలిచే 5వేల నూతన విశ్రాంతి స్థలాల అభివృద్ధి కోసం మంత్రిత్వ శాఖ ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తోంది. ప్రతి కేంద్రంలోనూ కార్లు, బస్సులు, ట్రక్కులు, భారీ వాహనాల పార్కింగ్ కోసం స్థలం కేటాయిస్తారు. టాయ్‌లెట్లను ఏర్పాటు చేస్తారు. జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేల వెంబడి ఉన్న ప్రైవేటు స్థలాల్లో డబ్ల్యూఎస్‌ఏల అభివృద్ధి, నిర్వహణపై ముసాయిదా విధానాన్ని మంత్రిత్వ శాఖ గత వారం విడుదల చేసింది. దీనిపై ఈ నెల 21లోగా తమ అభిప్రాయాలు చెప్పాలని సంబంధిత వర్గాలు, ప్రజలను కోరింది.

పరువు నష్టం కేసులో రాహుల్‌కు బెయిల్

రాంచీ, ఆగస్టు 6: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారన్న కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఝార్ఖండ్‌లోని ప్రజా ప్రతినిధుల కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. 2018లో చైబాసాలో జరిగిన ర్యాలీలో అమిత్ షాపై రాహుల్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ప్రతాప్‌కుమార్ అనే వ్యక్తి ఈ పరువు నష్టం కేసు దాఖలు చేశారు. అప్పటి నుంచి కేసు విచారణ సాగుతోంది. జూన్‌లో విచారణకు హాజరు కావాలని గతంలో చైబాసా ప్రజా ప్రతినిధుల కోర్టు ఆదేశాలిచ్చింది. అయితే ఆయన హైకోర్టును ఆశ్రయించి ఆగస్టు 6న విచారణకు హాజరయ్యేందుకు అనుమతి తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం చైబాసా కోర్టులో విచారణకు రాహుల్ స్వయంగా హాజరయ్యారు.

ధర్మస్థళలో ఉద్రిక్తత.. రిపోర్టర్‌పై దాడి

బెంగళూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ సమీపంలోని ఉజిరే వద్ద సువర్ణ చానల్ రిపోర్టర్‌తో పాటు ముగ్గురు యూట్యూబర్‌లపై స్థానికులు బుధవారం దాడి చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీ చార్జి చేశారు. ధర్మస్థళలో 2012లో అనుమానాస్పదంగా మృతి చెందిన సౌజన్య కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు బిగ్‌బాస్ ఫేం రజత్ వచ్చారు. నేత్రావతి నది సమీపంలో ఆయన యూట్యూబర్లతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతుండగానే 50 నుంచి 60 మంది స్థానికులు అక్కడికి చేరుకుని సువర్ణ చానల్ రిపోర్టర్‌తో పాటు యూట్యూబర్‌లతో వాగ్వాదానికి దిగారు. సౌజన్య అనుమానాస్పద మృతిపై పోరాడుతున్న మహేశ్ శెట్టి తిమరోడి, గిరీశ్ మట్టన్నతో పాటు వారి అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వాగ్వాదం పెరిగి.. నలుగురినీ చితకబాదారు. అంతలోనే యూట్యూబర్లకు మద్దతుగా వంద మందికిపైగా యువకులు అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాలూ ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నాయి. గొడవ అంతకంతకూ పెరుగుతుండటంతో పోలీసులు లాఠీచార్జి చేశారు.

చైనాలో దోమలకు దోమలతోనే చెక్..!

- చికున్‌గున్యా కట్టడికి ఏనుగు దోమల ప్రయోగం

బీజింగ్, ఆగస్టు 6: "ముల్లును ముల్లుతోనే తీయాలి".. "వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి".. అనే మాటలను బాగా వంటబట్టించుకున్నారేమో చైనా వాళ్లు..! అందుకే ఇప్పుడు దోమల బెడదను దోమలతోనే అరికడుతున్నారు. విషయం ఏంటంటే..? చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని ఫోషన్ నగరంలో చికున్‌గున్యా విజృంభిస్తోంది. ఇప్పటి వరకు అధికారికంగా 8 వేల కేసులు నమోదయ్యాయి. దీంతో.. సర్కారు కొవిడ్ కాలంలో తరహా కఠిన ఆంక్షలను అమలు చేస్తోంది. అదే సమయంలో చికున్‌గున్యా వైరస్‌కు కారణమయ్యే దోమలకు చెక్ పెట్టేందుకు ఏనుగు దోమల(ఎలిఫెంట్ మస్కిటోలు)ను రంగంలోకి దింపింది. టాక్సోరెంకైటిస్ అనే రకం దోమలను ఏనుగు దోమలు అంటారు. ఇవి ప్రపంచంలోనే అతి పెద్ద దోమజాతికి చెందినవి. ఇవి 18 మిల్లీమీటర్ల(1.8సెంటీమీటర్లు) నుంచి 24 మిల్లీమీటర్ల వరకు పెరుగుతాయి. ఈ దోమలు మనుషులను కుట్టవు. చెట్లలోని రసాలను పీల్చి బతుకుతాయి. ఏనుగు దోమలు కూడా సాధారణ దోమల్లాగే మురికి నీళ్ల, నిల్వ ఉన్న నీటిలో గుడ్లను పెడతాయి. అయితే.. వీటి గుడ్ల నుంచి 40-60 గంటల్లోనే లార్వాలు బయటకు వస్తాయి. అవి సాధారణ దోమల గుడ్లను తిని, పెరుగుతాయి. లార్వా దశ ముగిసేలోగా ఒక్కో ఏనుగు దోమ కనీసం 100 దోమల గుడ్లను తింటుంది. దీని వల్ల ఇతర దోమల సంతానం పెరగదు. ఇప్పుడు చైనా సర్కారు కాలువలు, రోడ్లపై నిల్వ ఉన్న నీటిలో ఈ తరహాలో 5 వేల దాకా ఏనుగు దోమల లార్వాలను వదిలింది. కాగా.. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) కూడా ప్రపంచ దేశాలకు గున్యా వ్యాప్తిపై హెచ్చరికలు జారీ చేయగా.. అమెరికాకు సీడీసీ తమ పౌరులకు చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌కి వెళ్లకుండా ట్రావెల్ అడ్వయిజరీ జారీ చేసింది.

మరో 25 శాతం సుంకం

(మొదటిపేజీ తరువాయి)



సమకూరుతున్నాయని ట్రంప్ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జూలై 30న భారత్‌పై 25శాతం సుంకాలను విధించారు. అవి ఆగస్టు 7వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. రష్యా చమురు కొనుగోళ్లపై భారత్ వెనక్కి తగ్గకపోవడం, రష్యాతో యూరోపియన్ యూనియన్, అమెరికా కూడా వాణిజ్యం జరుపుతుండటాన్ని భారత్ ఎత్తిచూపడంతో.. మరో 25శాతం కలిపి 50శాతం సుంకాలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా ఉత్పత్తులపై ఇప్పటికే ఉన్న సుంకాలకు ఈ 50 శాతం అదనం కావడం ఆందోళనకరం. కాగా.. భారత్, పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ ట్రంప్ మరోసారి వ్యాఖ్యలు చేశారు. 2028లో అమెరికాలోని లాస్‌ఏంజిలిస్‌లో జరిగే ఒలింపిక్స్‌కు సంబంధించి మీడియా సమావేశం ఏర్పాటు చేసిన ట్రంప్.. "రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపడానికి గట్టిగా ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే గత ఐదు నెలల్లో.. భారత్, పాక్ యుద్ధం సహా ఐదు యుద్ధాలను ఆపాను. ఇది ఆరోది అవుతుంది.." అని పేర్కొన్నారు. మరోవైపు ప్రస్తుత ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 2028లో జరిగే ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా నిలిచే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఆయనతోపాటు విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడే అవకాశం ఉందని చెప్పారు. అమెరికాలో నిబంధనల ప్రకారం.. ఎవరైనా సరే రెండుసార్లకు మించి అధ్యక్షుడు కావడానికి వీల్లేదు. ప్రస్తుతం రెండోసారి అధ్యక్షుడిగా ఉన్న ట్రంప్ మళ్లీ పోటీ చేయలేరు. మరో అభ్యర్థిని రిపబ్లికన్ పార్టీ తరఫున రంగంలోకి దింపాల్సిందే.

ఇది ఆర్థిక బ్లాక్ మెయిలింగ్: రాహుల్

ట్రంప్ సుంకాల పెంపు భారత్‌పై ఆర్థిక బ్లాక్ మెయిలింగ్ అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. అసమంజసమైన వాణిజ్య ఒప్పందం దిశగా భారత్‌ను నెట్టే ప్రయత్నమని విమర్శించారు. ప్రధాని మోదీ తన బలహీనతలను అధిగమించి అయినా.. భారత ప్రయోజనాలను దెబ్బతీసే ఈ చర్యను అడ్డుకోవాలంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ట్రంప్ పదే పదే బెదిరింపులు చేస్తున్నా ప్రధాని మోదీ దీటుగా స్పందించడం లేదని... అదానీ వ్యవహారంపై అమెరికాలో దర్యాప్తు జరుగుతుండటమే దీనికి కారణమని రాహుల్ ఆరోపించారు.

మోదీతోనే మాట్లాడుతా: డసిల్వా

తమ దేశంపై సుంకాలకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో తాను మాట్లాడే ప్రసక్తే లేదని బ్రెజిల్ అధ్యక్షుడు ఇనాసియో లులా డసిల్వా స్పష్టం చేశారు. ఇటీవల బ్రెజిల్‌పై సుంకాలు విధిస్తూ, ఆ దేశ అధ్యక్షుడు తనతో ఎప్పుడైనా చర్చించవచ్చని ట్రంప్ ప్రకటించడంపై డసిల్వా స్పందించారు. "సుంకాలపై చర్చించేందుకు నేను ట్రంప్‌కు కాల్ చేసి మాట్లాడే ప్రసక్తే లేదు. ఆయన మేం చెప్పేది వినరు. దానికి బదులు భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో మాట్లాడుతాను.

అదనపు సుంకాలు అసమంజసం: భారత్

సుంకాల పెంపు పూర్తిగా అసమంజసం, అన్యాయమని అమెరికాకు భారత్ స్పష్టం చేసింది. ఈ అంశంలో దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా తగిన చర్యలు చేపడతామని స్పష్టం చేసింది. భారత్‌పై 25శాతం అదనపు సుంకాలు విధిస్తూ ట్రంప్ ఉత్తర్వులు జారీ చేయడంపై.. మన విదేశాంగ శాఖ స్పందించింది. "రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులను అమెరికా కొన్ని రోజులుగా టార్గెట్ చేస్తోంది. ఈ అంశంపై మేం ఇప్పటికే మా వైఖరిని స్పష్టం చేశాం. 140 కోట్ల మంది దేశ ప్రజలకు ఇంధన భద్రత కోసం మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మా చమురు దిగుమతులు ఉన్నాయి. ఇతర దేశాలు వారి జాతీయ ప్రయోజనాల కోసం చేపట్టిన చర్యలకు సంబంధించి.. భారత్‌పై అదనపు సుంకాలు విధించాలని అమెరికా నిర్ణయించడం తీవ్ర దురదృష్టకరం. ఇది పూర్తిగా అన్యాయం, అసమంజసం. జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా అవసరమైన అన్ని చర్యలను భారత్ చేపడుతుంది" అని ప్రకటించింది.

వస్త్ర, ఆక్వా పరిశ్రమలకు దెబ్బ!

ట్రంప్ అదనంగా విధించిన సుంకాల ప్రభావం భారత్‌పై గణనీయంగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రస్తుత పెంపుతో కలిపి గంపగుత్తగా 50 శాతం సుంకాలు వర్తించే కొన్ని రంగాలపైనే అధిక ప్రభావం ఉంటుందని.. నిర్ణీత టారిఫ్‌లు ఉన్న రంగాలకు ఇబ్బంది రాకపోవచ్చని అంటున్నారు. గంపగుత్త సుంకాలు వర్తించే ఉత్పత్తుల్లో.. వస్త్రాలు, రొయ్యలు ఇతర ఆక్వా ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు, తోలు ఉత్పత్తులు, పాదరక్షలు, జంతు ఉత్పత్తులు, రసాయనాలు, ఎలక్ట్రిక్, మెకానికల్ యంత్రాలు ఉన్నాయి. ఉత్పత్తులను బట్టి నిర్ణీత సుంకాలు (10 శాతం, 15 శాతం, 30 శాతం.. ఇలా) వర్తించేవాటిలో... చమురు, పెట్రోలియం ఉత్పత్తులు, బొగ్గు, కీలక ఖనిజాలు, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, స్ర్కీన్లు, హార్డ్ డిస్కులు వంటి ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు ఉన్నాయి. ఇందులో గంపగుత్త సుంకాలు వర్తించే భారత ఉత్పత్తుల ధరలు అమెరికాలో పెరిగిపోతాయి. తక్కువ సుంకాలున్న దేశాల నుంచి వచ్చే ఇవే ఉత్పత్తులు తక్కువ ధరకే లభిస్తాయి. దీనితో భారత ఎగుమతులపై ప్రభావం పడుతుంది. ఉదాహరణకు భారత్‌పై 50 శాతం సుంకం వల్ల.. అమెరికాలో మన వస్త్రాల ధరలు ఒక్కసారిగా 50శాతం పెరుగుతాయి. అంటే ఇప్పటివరకు 20 డాలర్లకు దొరికే భారత టీషర్టు ధర 30 డాలర్లు అవుతుంది. అదే ఫిలిప్పీన్స్, వియత్నాంలపై 20శాతమే సుంకం వల్ల.. ఆ దేశాల నుంచి వచ్చే అదేస్థాయి టీషర్టు ధర 20 డాలర్ల నుంచి 24 డాలర్లకు మాత్రమే పెరుగుతుంది. ధర ఎక్కువగా ఉండటంతో భారత ఉత్పత్తులకు డిమాండ్ తగ్గి.. ఇక్కడి నుంచి ఎగుమతులు తగ్గిపోతాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే రొయ్యల ధర పరిస్థితి కూడా ఇలాగే ఉండనుంది.

- ప్రస్తుతం అమెరికా టారిఫ్‌లు మలేసియాపై 25%, చైనా, శ్రీలంకలపై 30శాతం, ఇండోనేషియాపై 32%, బంగ్లాదేశ్‌పై 35శాతం, థాయ్‌లాండ్, కాంబోడియాలపై 36 శాతం, మయన్మార్‌పై 40శాతంగా ఉన్నాయి. దీనితో అమెరికాలో ఆయా దేశాల ఉత్పత్తుల కంటే భారత ఉత్పత్తుల ధర ఎక్కువగా ఉండే అవకాశముంది.
- ట్రంప్ సుంకాల నిర్ణయం షాక్‌కు గురిచేసిందని, దీనివల్ల దాదాపు 55శాతం భారత ఎగుమతులపై ప్రభావం పడుతుందని 'భారత ఎగుమతి సంస్థల ఫెడరేషన్ (ఎఫ్ఐఈఓ)' ప్రకటించింది. వస్త్ర పరిశ్రమ, ఆక్వా, తోలు ఉత్పత్తులు, పాదరక్షలు, రసాయనాలు, యంత్ర పరికరాల పరిశ్రమలకు దెబ్బతగులుతుందని పేర్కొంది.
- అమెరికా సుంకాల ప్రభావం భారత్‌లో ద్రవ్యోల్బణంపై తీవ్ర ప్రభావమేమీ చూపుతుందని భావించడం లేదని రిజర్వు బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. భారత్ ప్రతీకార సుంకాలు విధిస్తే.. ఏదైనా ప్రభావం పడే అవకాశం ఉందని, కానీ ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదని చెప్పారు.

లోకం తీరు



భారత్‌ను దూరం చేసుకోవద్దు: నిక్కీ హేలీ



భారత్‌తో ట్రంప్ వ్యవహరిస్తున్న తీరును రిపబ్లికన్ పార్టీ నేత నిక్కీ హేలీ ఆక్షేపించారు. చైనాతో ఒకలా, భారత్‌లో ఒకలా వ్యవహరిస్తూ ద్వంద్వ ప్రమాణాలను అనుసరిస్తున్నారని విమర్శించారు. ఈ అంశంపై సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "రష్యా నుంచి భారత్ చమురును కొనుగోలు చేయవద్దు. కానీ ప్రత్యర్థి దేశం చైనా చేయవచ్చా? రష్యా, ఇరాన్‌ల నుంచి అత్యధికంగా చమురును కొంటున్నది చైనాయే. ఆ దేశానికి మాత్రం సుంకాల నుంచి 90 రోజులు మినహాయింపు ఇచ్చారు. చైనాను ఇలా వదిలేయవద్దు. భారత్ వంటి బలమైన మిత్రదేశంతో సంబంధాలను చెడగొట్టుకోవద్దు" అని నిక్కీ హేలీ పేర్కొన్నారు.

అమెరికాలో ఆపిల్ 8.32 లక్షల కోట్ల పెట్టుబడులు

వాషింగ్టన్, ఆగస్టు 6: అమెరికాలో తయారీ విభాగాన్ని బలోపేతం చేయడానికి యాపిల్ సంస్థ రూ.8.32 లక్షల కోట్ల(100 బిలియన్ డాలర్లు) మేర పెట్టుబడులు పెట్టనున్నట్లు వైట్‌హౌస్ అధికారి టేలర్ రోజర్స్ వెల్లడించారు. తయారీ రంగంలో ఉద్యోగాలను తిరిగి అమెరికాకు తీసుకురావాలనే ప్రయత్నాలకు ఈ నిర్ణయం ఊతమిస్తుందని ఆ అధికారి 'రాయిటర్స్'తో అన్నారు. రానున్న నాలుగేళ్లలో 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఫిబ్రవరిలో యాపిల్ సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా టెక్సాస్‌లో ఏఐ సర్వర్ల తయారీ ఫ్యాక్టరీ నిర్మించనుంది. ఇక్కడ పరిశోధన-అభివృది రంగంలో 20 వేల ఉద్యోగాల సృష్టి జరుగుతుందని అంచనా. అయితే.. ఈ పెట్టుబడుల గురించి అటు యాపిల్ సంస్థ గానీ, ఇటు ట్రంప్ గానీ ఎలాంటి ప్రకటన చేయలేదు.

ప్రకటనల్లో సీఎం ఫొటో తప్పేంకాదు!

- అన్నాడీఎంకే ఎంపీపై సుప్రీం సీరియస్
- 10 లక్షల జరిమానా విధించిన ధర్మాసనం

చెన్నై, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు జారీ చేసే ప్రకటనల్లో ప్రధాని, ముఖ్యమంత్రుల ఫొటోలు పెట్టడం సర్వసాధారణమేనని.. అవేమీ తప్పుకాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ముఖ్యంగా సంక్షేమ పథకాలకు సీఎంల పేర్లు, ఫొటోలను కూడా దేశవ్యాప్తంగా వినియోగిస్తున్నారని తెలిపింది. అదేసమయంలో, రాజకీయ కారణాలతో ఇలాంటి వాటిపై కోర్టును ఆశ్రయించి.. న్యాయస్థానాల వేదికగా యుద్ధాలు చేసుకోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఇటీవల తమిళనాడు ప్రభుత్వం 'ఉంగలుడన్ స్టాలిన్(మీతో స్టాలిన్) అనే పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ప్రచార పత్రాలు, బ్యానర్లలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఫొటోలను ముద్రించారు. దీనిని తప్పుబడుతూ ప్రతిపక్షం అన్నాడీఎంకే ఎంపీ సీవీ షణ్ముగం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. సంక్షేమ పథకాల ప్రచారం కోసం..సీఎం, మాజీ సీఎంలు, మృతి చెందిన నేతల పేర్లను వినియోగించడాన్ని తప్పుబడుతూ.. గత నెల 31న ఆదేశాలు జారీ చేసింది. అయితే.. ఈ ఆదేశాలను తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఎంపీ షణ్ముగంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాలకు సీఎం పేరు పెట్టిన దాఖలాలు లేవా? అని ప్రశ్నించింది. రాజకీయ స్పర్థలు ఎన్నికల వరకే ఉండాలని, అవి న్యాయస్థానాల దాకా రాకూడదని కటువుగా వ్యాఖ్యానించింది. రాజకీయ దురుద్దేశంతోనే పిటిషనర్ న్యాయస్థానానికి వచ్చినట్లుందని వ్యాఖ్యానిస్తూ.. ఆయనకు రూ.10 లక్షల జరిమానా విధిస్తున్నట్లు ప్రకటించింది.

ఈడీకి 30 వేల జరిమానా

- కౌంటర్ దాఖలు చేయలేదని మద్రాస్ హైకోర్టు ఆగ్రహం

చెన్నై, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తమిళ సినీ నిర్మాత ఆకాశ్ భాస్కరన్, పారిశ్రామికవేత్త విక్రమ్ రవీంద్రన్ గృహాలు, కార్యాలయాల్లో తనిఖీలకు సంబంధించిన కేసులో రెండు సార్లు అవకాశం ఇచ్చినా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయని ఈడీ అధికారులకు మద్రాస్ హైకోర్టు రూ.30 వేల జరిమానా విధించింది. టాస్మాక్ మద్యం కుంభకోణంతో సంబంధం ఉందన్న కారణంగా ఆ ఇద్దరి ఇళ్లలో ఈడీ అధికారులు గతంలో సోదాలు చేపట్టారు. రవీంద్రన్ ఇంటికి, ఆఫీసుకు సీలు వేశారు. దీన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గత నెల 20వ తేదీన విచారణ జరిపిన హైకోర్టు.. ఆ ఇద్దరి గృహాలు, కార్యాలయాల్లో తనిఖీలు జరిపేందుకు ఈడీకి ఎలాంటి అధికారమూ లేదని పేర్కొంది. ఈడీ అధికారులు హైకోర్టుకు సమర్పించినవాటిలో వారిద్దరికీ వ్యతిరేకంగా ఒక్క ఆధారం కూడా లేదని పేర్కొంది. తనిఖీల సమయంలో స్వాధీనం చేసుకున్న కంప్యూటర్ హార్డ్‌డిస్క్, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌లను తిరిగి వారికి అప్పగించి, కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. రెండు సార్లు అవకాశం ఇచ్చినా బుధవారం జరిగిన విచారణ సమయానికి కూడా ఈడీ అధికారులు కౌంటర్ దాఖలు చేయలేదు.

హైకోర్టుల్లో ఏం జరుగుతోంది?

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించింది. అంతేకాదు.. "హైకోర్టుల స్థాయిలో భారత న్యాయవ్యవస్థకు ఏం జరుగుతోందో మాకు అర్థం కావట్లేదు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ వివాదాస్పద తీర్పును ఉపసంహరించి.. ఈ కేసును మరో జడ్జికి కేటాయించాలని, జస్టిస్ ప్రశాంత్‌కుమార్‌ను వేరే సీనియర్ జడ్జితో కూడిన ధర్మాసనంలో నియోగించాలని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆదేశించింది. ఆయన పదవీ విరమణ చేసేదాకా ఎలాంటి క్రిమినల్ కేసుల విచారణా ఆయనకు అప్పగించొద్దంటూ అత్యంత అసాధారణ ఆదేశాలు జారీచేసింది. ఈ ఒక్క తీర్పే కాక.. జస్టిస్ ప్రశాంత్ కుమార్ గతంలో కూడా ఇదే తరహాలో పలు అసంబద్ధ ఆదేశాలు ఇచ్చినట్టు తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలోనే ఈ ఆదేశాలు జారీచేస్తున్నట్టు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన సుప్రీం ద్విసభ్య ధర్మాసనం తన తీర్పులో స్పష్టం చేసింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన లలిత టెక్స్‌టైల్స్ అనే కంపెనీ.. శిఖర్ కెమికల్స్ అనే సంస్థకు రూ.52.34 లక్షల విలువైన నూలు సరఫరా చేసింది. అయితే, శిఖర్ సంస్థ రూ.47.75 లక్షలు మాత్రమే చెల్లించి రూ.4.59 లక్షలు బకాయి పెట్టింది. ఇదంతా 2019లో జరిగింది. అప్పట్నుంచీ వడ్డీతో కలిపి బకాయి రూ.7 లక్షలకు పెరిగింది. బకాయి చెల్లించాలని ఎన్నిసార్లు అడిగినా, లీగల్ నోటీసులు పంపినా శిఖర్ యాజమాన్యం స్పందించకపోవడంతో.. లలిత టెక్స్‌టైల్స్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ, ఇది సివిల్ కేసు కావడంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. దీంతో ఆయన 'కోర్ట్ ఆఫ్ ద అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్'లో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. ఆ కోర్టు జారీ చేసిన సమ



న్లను శిఖర్ సంస్థ అలహాబాద్ హైకోర్టులో సవాల్ చేసింది. ఆ కేసును విచారించిన జస్టిస్ ప్రశాంత్ కుమార్.. శిఖర్ సంస్థ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ ఏడాది మే5న తీర్పు ఇచ్చారు. సివిల్ కేసు అయితే తేలడానికి ఏళ్లు పడుతుందని, ఆ కేసు విచారణ నిమిత్తం లలిత టెక్స్‌టైల్స్ యాజమాన్యం బోలెడంత డబ్బు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని.. కోల్పోయిన డబ్బును పొందడానికి మరిన్ని డబ్బును ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని.. కాబట్టి ఈ కేసును సివిల్‌కోర్టుకు పంపితే అది న్యాయాన్ని హేళన చేయడమే అవుతుందని, దానివల్ల లలిత టెక్స్‌టైల్స్ యజమానికి పూడ్చుకోలేని నష్టం జరుగుతుందని తీర్పులో పేర్కొన్నారు. సివిల్ దావాల్లో అయ్యే ఖర్చు, ఆలస్యాన్ని నివారించడానికి ఇలాంటి కేసుల్లో క్రిమినల్ చర్యలు తీసుకోవడాన్ని సమర్థిస్తూ.. శిఖర్ సంస్థ పిటిషన్‌ను తిరస్కరించారు. దీంతో ఆ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన ధర్మాసనం.. సివిల్ సమస్యల పరిష్కారానికి క్రిమినల్ చట్టాలను ఉపయోగించలేమని స్పష్టం చేస్తూ జస్టిస్ ప్రశాంత్ ఆదేశాలను కొట్టేసింది. భవిష్యత్తులో ఆయన సింగిల్ జడ్జిగా ఆసీనులైనా.. క్రిమినల్ కేసులు మాత్రం ఆయనకు కేటాయించొద్దని అలహాబాద్ హైకోర్టు సీజేను ఆదేశించింది.


బిహార్‌లో ఆ ఓట్లు ఎలా తొలగించారు?

- తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలు మాకివ్వండి
- ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 6: అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో.. ముసాయిదా ఓటరు జాబితాల నుంచి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను తమకు అందించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని(ఈసీ) సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నెల 9 నాటికి(ఎల్లుండి) తమకు ఆ వివరాలు చేరాలని పేర్కొంది. ఆ ఓటర్లను ఏ ప్రాతిపదికన తొలగించారో తాము కూడా తెలుసుకుంటామని స్పష్టం చేసింది. అదేవిధంగా తొలగించిన ఓటర్ల వివరాలతో కూడిన కాపీని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్)కు కూడా అందించాలని స్పష్టం చేసింది. బిహార్‌లో ఓటరు జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) కోసం ఈసీ జారీ చేసిన ఆదేశాలను ఏడీఆర్ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీంతోపాటు తాజాగా తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల పేర్లు, వివరాలను బహిరంగంగా ప్రకటించేలా ఆదేశాలు ఇవ్వాలని మరో పిటిషన్ దాఖలు చేసింది. జాబితాల నుంచి తీసేసిన ఓటర్లు.. మృతి చెందారా?, శాశ్వతంగా వలసపోయారా?, లేక ఏ ఇతర కారణాలతోనైనా వారిని తొలగించారా?. అనే విషయాలను స్పష్టం చేయాలని కూడా ఏడీఆర్ కోరింది. బుధవారం ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది.

పార్లమెంటులో అదే ప్రతిష్టంభన

బిహార్ ఓటర్ల జాబితా సవరణపై కొనసాగుతున్న రచ్చ


కిరెన్ రిజిజు

న్యూఢిల్లీ, ఆగస్టు 6: బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) వ్యవహారం పార్లమెంటును కుదిపేస్తోంది. దీనిపై చర్చించాల్సిందేనంటూ విపక్షాలు ఉభయసభలనూ స్తంభింపజేస్తున్నాయి. గత నెల 21న వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి రచ్చ కొనసాగుతోంది. 28, 29 తేదీల్లో లోక్‌సభలో, 30న రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ మాత్రమే సజావుగా సాగింది. మిగతా రోజుల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. బుధవారం కూడా ఇదే జరిగింది. నిరసనల నడుమ కాసేపు సభలు సాగినా.. ప్రతిపక్షాల నిరసనలతో గురువారానికి వాయిదాపడ్డాయి. రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల కమిషన్ వ్యవహారంపై పార్లమెంటులో చర్చించడానికి వీల్లేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు లోక్‌సభలో స్పష్టంచేశారు. అదీగాక ఈ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ సాగుతోందని.. దానిపై చర్చకు ఆస్కారం లేదని స్పష్టంచేశారు. అయితే గతంలో రాజ్యాంగ సంస్థలపై పార్లమెంటులో చర్చ జరిగిన సందర్భాలు ఉన్నాయంటూ రాజ్యసభలో ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌కు లేఖ రాశారు. ఇదిలా ఉండగా, లోక్‌సభ ఆమోదానికి వచ్చిన జాతీయ క్రీడల పరిపాలన బిల్లు(2025), జాతీయ యాంటీ-డోపింగ్ బిల్లు (2025)లను లోతుగా పరిశీలించేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి పంపాలని విపక్షాల ఎంపీలు స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు. కీలకమైన ఈ రెండు బిల్లులపై విస్తృత ఏకాభిప్రాయం అవసరమని అభిప్రాయపడ్డాయి.

మీరు చదువుకున్నవారు.. ఇలా అడుక్కోవొద్దు!

- భరణంగా బీఎండబ్ల్యూ కారు కోరిన మహిళను ఉద్దేశించి సీజేఐ వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఆగస్టు 6: విడాకులు కోరుతూ భర్త నుంచి భరణం కింద ఆ భార్య ముంబైలోని ఖరీదైన ఫ్లాట్, బీఎండబ్ల్యూ కారు, రూ.12 కోట్ల నగదు కోరిన కేసు గుర్తుందా? ఈ వ్యవహారంలో సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం.. ఆర్టికల్ 142కింద అధికారాలను ఉపయోగిస్తూ ఆ దంపతులకు విడాకులు మంజూరు చేసింది. అయితే.. భరణం కింద పెద్ద మొత్తంలో డబ్బు, బీఎండబ్ల్యూ కారును ఆ మహిళ కోరడాన్ని న్యాయబద్ధం కాని డిమాండ్లుగా కొట్టిపారేసింది. గతంలో..ఆమె ముంబైలో ఇంటిని తీసుకునేందుకు ఓ ఒప్పంద పత్రంపై సంతకం చేసింది. ఆ ఇంటినే విడాకుల సెటిల్‌మెంట్ కింద తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. "మీరు చదువుకున్నవారైతే గనక.. మీకోసం మీరు ఇలా అడుక్కోవొద్దు" అని జస్టిస్ గవాయ్ ఆ మహిళను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

తెలంగాణ ఉద్యమ ఆయువుపట్టు గద్దర్


గద్దర్, జయశంకర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, చిత్రంలో మంత్రులు పొంగులేటి, సీతక్క, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

- జయశంకర్ వల్లే ఉద్యమం సజీవం
- నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువుపట్టుగా నిలిచిన వ్యక్తి గద్దరన్న అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని సీఎం అధికారిక నివాసంలో.. గద్దర్ చిత్రపటానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద కుటుంబంలో పుట్టి ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన గద్దర్ ఉన్నత కొలువుల వైపు దృష్టిసారించకుండా ప్రతి ఒక్కరికి కూడు, గూడు, గుడ్డ లభించాలనే లక్ష్యంతో జీవితాంతం తన పాటలతో ప్రజలను చైతన్యపర్చారని కొనియాడారు. పలు ఉద్యమ సంస్థల ఏర్పాటుతో తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరులూదిన వారిలో అగ్రగణ్యుడు గద్దర్ అని గుర్తు చేశారు. గద్దర్ సాంస్కృతిక, సాహితీ సేవలకు గుర్తింపుగా జూన్ 14న గద్దర్ పేరిట తెలంగాణ ఫిల్మ్ అవార్డులను సినీ కళాకారులకు, సినీ ప్రముఖులకు అందించామని తెలిపారు. అలాగే.. ఉమ్మడి ఏపీలో తెలంగాణ, ప్రజలు ఏవిధంగా నష్టపోయారో గణాంకాలతో ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఆరు దశాబ్దాలపాటు సజీవంగా ఉంచిన ఘనత ప్రొఫెసర్ జయశంకర్ సర్‌దేనని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. బుధవారం జయశంకర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. జయశంకర్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమే శ్వాసగా, ధ్యాసగా, లక్ష్యంగా బతికారని, సకల జనుల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారన్నారు. జయశంకర్ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని, ఆయన ఆశయ సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

80 మంది శిశువుల విక్రయం

(మొదటి పేజీ తరువాయి)

తేల్చారు. పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న సదరు గైనకాలజిస్టు ఫిర్యాదు చేయడం గమనార్హం.! తీరా నవమాసాలు పూర్తయ్యాక.. అంతర్రాష్ట్ర పిల్లల అక్రమ రవాణా ముఠాల నుంచి ఓ శిశువును కొనుగోలు చేసి.. సరగసీ బిడ్డ అని చెబుతూ.. ఆ దంపతులకు ఇచ్చేది. ఇలా నమ్రత ఇప్పటి వరకు 80 మంది శిశువులను సంతానం కోసం తన వద్దకు వచ్చిన దంపతులకు సరగసీ బిడ్డ అంటూ అంటగట్టినట్లు అధికారులు తేల్చారు. తాజాగా మహిళా గైనకాలజిస్టు ఇచ్చిన ఫిర్యాదుతో నమోదు చేసిన కేసుతో కలిపి.. నమ్రతపై మొత్తం 8 ఎఫ్ఐఆర్‌లు రిజిస్టర్ అయినట్లు పోలీసులు తెలిపారు.

రూ. కోట్లలో ఆర్థిక లావాదేవీలు..

పిల్లలు లేని దంపతుల నుంచి రూ. లక్షల్లో కొల్లగొట్టిన నమ్రత, ఆమె కొడుకు జయంత్ కృష్ణ సుమారు రూ.25 కోట్లు దండుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. దీంతో.. దర్యాప్తు అధికారులు సృష్టి క్లినిక్‌తోపాటు.. తల్లికొడుకుల బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్‌చేశారు. నమ్రత ఆర్థిక లావాదేవీలపై పోలీసులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాలకు సంబంధించిన ఏజెంట్లకు రూ.లక్షలు బదిలీ చేసినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. పోలీసులు త్వరలో ప్రధాన ఏజెంట్లను విచారించనున్నట్లు స్పష్టమవుతోంది.

దంపతుల్లో గుబులు

సృష్టిలో సరగసీ ద్వారా సంతానం పొందిన దంపతుల్లో ఇప్పుడు కొత్త ఆందోళన, గుబులు మొదలైనట్లు తెలుస్తోంది. సుమారు 80 మంది జీవితాలతో నమ్రత ఆటలాడినట్లు తేలడంతో "మా పిల్లలు సక్రమమేనా" అని వారు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం.

ఫర్టిలిటీ కేంద్రాల్లో లోపాలు!

50% కేంద్రాలకు నోటీసులిచ్చేందుకు రంగం సిద్ధం.. గ్రేటర్ హైదరాబాద్‌లోని కేంద్రాల్లో ముగిసిన తనిఖీలు

- ఇక రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలకు సిద్ధం

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మోసం.. మోసం.. మోసం.! "సంతానం లేని దంపతులకు శుభవార్త..!" అంటూ తాటికాయలంత అక్షరాలతో సంతనా సాఫల్య కేంద్రాల్లో ధరల పట్టిక ప్రదర్శన మొదలు.. స్కానింగ్‌ల నమోదు.. ఫర్టిలిటీ వరకు మోసాలే జరుగుతున్నాయని వైద్య ఆరోగ్య శాఖ తనిఖీల్లో తేలింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నాలుగు రోజులుగా తనిఖీలు నిర్వహించగా.. సగానికి పైగా సంతాన సాఫల్య కేంద్రాల్లో లోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దాంతో.. 50% కేంద్రాలకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోని కేంద్రాలోనూ తనిఖీలు ప్రారంభం కానున్నాయి. సృష్టి ఫర్టిలిటీ కేంద్రంలో సరోగసి పేరుతో చేసిన మోసం, చైల్డ్ ట్రాఫికింగ్ వ్యవహారాలు ఇటీవల వెలుగులోకి రావడంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సంతాన సాఫల్య కేంద్రాలను తనిఖీలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. సర్కారు ఆదేశాలతో 35 బృందాలు ఈ తనిఖీలను చేపట్టాయి. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 381 సంతాన సాఫల్య కేంద్రాలున్నాయి. ఇందులో గ్రేటర్ హైదరాబాద్(హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలు) పరిధిలో ఉన్న 271 కేంద్రాల్లో అధికారుల తనిఖీలు బుధవారంతో పూర్తయ్యాయి. ఈ తనిఖీలకు సంబంధించిన నివేదికలు ఒకట్రెండ్రోజుల్లో ప్రభుత్వానికి చేరుతాయి.

ఆన్‌లైన్‌లో నమోదవ్వని స్కానింగ్‌లు

సింహభాగం సంతాన సాఫల్య కేంద్రాలు అల్ట్రాసౌండ్ స్కానింగ్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని తనిఖీ బృందాలు గుర్తించాయి. దాంతోపాటు.. చాలా కేంద్రాలు నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని, రిజిస్ట్రేషన్ సమయంలో మానవ వనరులకు సంబంధించిన పేర్కొన్న సంఖ్యకు.. అక్కడ పనిచేసే సిబ్బంది సంఖ్యకు సంబంధమే లేదని తేల్చాయి. ఇక రేడియాలజిస్టు, ఎంబ్రియాలజిస్టులు లేకుండానే కొన్ని కేంద్రాలు నడుస్తున్నట్లు నిర్ధారణ అయ్యింది. పని జేసే డాక్టర్ల పేర్లకు, రికార్డుల్లో ఉన్న వైద్యుల పేర్లకు ఏమాత్రం సంబంధం లేదని తేలింది. రికార్డుల్లో చూపిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలకు, అక్కడున్న యంత్రాల సంఖ్యకు పొంతనే లేదని గుర్తించినట్లు సమాచారం. ఉదాహరణకు.. రిజిస్ట్రేషన్ సమయంలో ఓ ఫర్టిలిటీ కేంద్రం రెండు అల్ట్రాసౌండ్ యంత్రాలున్నట్లు చూపించింది. తాజాగా తనిఖీలు చేసిన అధికారులు అక్కడ నాలుగు యంత్రాలను గుర్తించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇలా యంత్రాలను వినియోగించడం పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం నేరం. ఇలాంటి ఉల్లంఘనలకు భారీగా జరిమానాలను విధించవచ్చు. స్కానింగ్‌లు చేసిన ప్రతీసారి.. ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పీసీపీఎన్‌డీటీ చట్టం స్పష్టం చేస్తోంది. సింహభాగం కేంద్రాలు ఆన్‌లైన్ నమోదు జోలికి వెళ్లడం లేదని తేలింది. దీన్ని బట్టి.. గర్భవిచ్ఛిత్తి కేసులు కూడా పెరిగాయనే అనుమానాలను తనిఖీ బృందాలు వ్యక్తం చేస్తున్నాయి. 80% కేంద్రాల్లో అసలు ధరల పట్టికను, అందుబాటులో ఉన్న వైద్యుల వివరాలను ప్రదర్శించడం లేదని అధికారులు గుర్తించారు.



అప్రమత్తమైన సరోగసీ కేంద్రాలు..!

వైద్య ఆరోగ్యశాఖ బృందాలు తనిఖీలకు వస్తున్నాయని ముందుగానే తెలిసిపోవడంతో పలు సంతాన సాఫల్య కేంద్రాలు జాగ్రత్త పడ్డాయి. అధికారులు రాక ముందే.. లొసుగులను సరిచేసుకున్నాయి. ముఖ్యంగా రికార్డుల నిర్వహణ, స్కానింగ్స్ నమోదు వంటివి పక్కాగా ఉండేట్లు జాగ్రత్త తీసుకున్నట్లు సమాచారం.

మిగతా జిల్లాలపై నజర్

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు.. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో తనిఖీలు ముగియడంతో మిగిలిన జిల్లాల్లో ఉన్న మరో 110 కేంద్రాలపై వైద్య ఆరోగ్య శాఖ దృష్టిసారించింది. వాటిల్లోనూ తనిఖీలు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. ఒకట్రెండు రోజుల్లో తనిఖీలు మొదలవుతాయని వైద్యవర్గాలు వెల్లడించాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జరిపిన తనిఖీ బృందాల్లో ఒక డాక్టర్, ఒక డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉండేలా జాగ్రత్తపడ్డారు. జిల్లాల్లోని సంతాన సాఫల్య కేంద్రాల్లో తనిఖీలకు మాత్రం జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారులను నియమించనున్నట్లు సమాచారం. జాతీయ ఆరోగ్య మిషన్‌లో ప్రోగ్రామ్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న వారిని కూడా తనిఖీల బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలిసింది. తనిఖీ బృందాల్లో ఎవరెవరుంటారు? ఏయే బృందాలను ఏయే జిల్లాలకు పంపాలనే ప్రణాళిక ఇప్పటికే సిద్ధమైనట్లు తెలుస్తోంది.

చిన్నారిపై టీచర్ అమానుషం!

- ఎల్‌కేజీ విద్యార్థిని లంచ్ బాక్స్‌తో కొట్టిన టీచర్
- తలకు గాయం, ఘటనపై పోలీసులకు ఫిర్యాదు


గాయపడ్డ బాలుడు ఈశ్వర్

సైదాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పసిపిల్లాడని కూడా చూడకుండా.. ఎల్‌కేజీ విద్యార్థిని ఓ టీచర్ నిర్దాక్షిణ్యంగా లంచ్ బాక్స్‌తో కొట్టిన ఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. ఎల్‌సీహెచ్ కాలనీలో నివాసముండే అవుల మణికంఠ కుమారుడు ఈశ్వర్.. ఇంటికి దగ్గరలోని లిటిల్ ఇండియన్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం సమయంలో.. ఈశ్వర్‌కు తలకు గాయమై, రక్తస్రావం అవుతోందని తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ సమాచారమందించారు. వెంటనే వారు స్కూల్‌కు చేరుకుని కుమారుడిని స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు. గాయానికి మూడు కుట్లు పడ్డాయి. ఈ విషయంపై బాలుడిని ఆరాతీయగా టీచర్ కొట్టడంతోనే గాయమైందని చెప్పాడు. తల్లిదండ్రులు స్కూల్ ప్రిన్సిపాల్‌ను నిలదీయగా.. పిల్లలు కొట్టుకోవడంతోనే కిందపడి గాయమైందని బుకాయించాడు. దీంతో తండ్రి ఘటనపై సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్కూల్‌లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఇవ్వమని కోరినా ప్రిన్సిపాల్ ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. టీచర్‌పై కేసు నమోదు చేశామని సైదాబాద్ పోలీసులు తెలిపారు.

అక్టోబరు 19 వరకు సికింద్రాబాద్‌లో రైళ్లు ఆగవు

- పునరాభివృద్ధి పనుల నేపథ్యంలో ఇతర స్టేషన్లకు మళ్లింపు

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పునరాభివృద్ధి పనులు కొనసాగుతున్నందున వేర్వేరు ప్రాంతాల నుంచి అక్కడికి వచ్చే పలు రైళ్లను అక్టోబర్ 19వ తేదీ వరకు ఇతర స్టేషన్లకు మళ్లిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. తిరిగి అదే స్టేషన్ నుంచి రైళ్లు బయలుదేరుతాయని ఓ ప్రకటనలో వెల్లడించారు. విజయవాడ నుంచి వెళ్లే (12713, 12714) రైళ్లు కాచిగూడ స్టేషన్‌కు, పోరుబందర్ నుంచి (వీక్లీ) వచ్చి వెళ్లే (20967, 20968) రైళ్లు ఉందానగర్‌కు, సిద్దిపేట నుంచి వచ్చి వెళ్లే (77656, 77653, 776754, 77655) రైళ్లను మల్కాజ్‌గిరికి మళ్లించినట్టు వివరించారు. పుణె నుంచి వచ్చి వెళ్లే (12025, 12026) రైళ్లు హైదరాబాద్ స్టేషన్ నుంచి.. మణుగూరు (12745, 12746) రైళ్లు, రేపల్లె నుంచి వచ్చి వెళ్లే (17645, 17646) రైళ్లు చర్లపల్లి నుంచి నడుస్తాయన్నారు.. దూర ప్రాంతాలకు వారానికోసారి, రెండు, మూడు సార్లు నడిచే పలు రైళ్లు.. సిల్చార్ (12513, 12514), దర్భంగ (17007, 17008), యశ్వంత్‌పూర్ (12735, 12736) రైళ్లు చర్లపల్లి నుంచి.. అగర్తల (07029, 07030), ముజఫర్‌పూర్ (05293, 05294), సంత్రాగచి (07221, 07222), దనపూర్ (07647, 07648), రామేశ్వరం (07695, 07696), హైదరాబాద్ రాక్సోల్ (07051, 07052) రైళ్లు చర్లపల్లి టెర్మినల్ నుంచి నడుస్తాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

వరి పంటపై అటవీ సిబ్బంది గడ్డిమందు పిచికారి

- ఆందోళన చెందిన రైతు ఆత్మహత్యాయత్నం
- అది అటవీ భూమేనంటున్న అధికారులు


చికిత్స పొందుతున్న రైతు చిన్నమల్లయ్య

గాంధారి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పొలంలో అటవీ అధికారి గడ్డిమందు పిచికారి చేయించడంతో సాగులో ఉన్న రైతు ఆందోళనకు గురై ఆ గడ్డిమందునే సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన కామారెడ్డి జిల్లా గాంధారి మండలం సీతాయిపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ రైతు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొర్రె చిన్నమల్లయ్యకు నాలుగు ఎకరాల భూమి ఉంది. అదే గ్రామంలో మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. 25 ఏళ్లుగా ఈ భూమిలో మొక్కజొన్న, వరి పంట సాగుచేస్తున్నాడు. ఇంతకాలం ఏ అధికారి కూడా ఈ భూమిపై అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. ఈ క్రమంలో మంగళవారం అటవీ సెక్షన్ అధికారి అరుణ సిబ్బందితో సదరు భూమి వద్దకు వచ్చి.. ఇది అటవీ భూమి అని, సాగు చేయడానికి వీల్లేదని చెప్పారు. పైగా సిబ్బందితో వరి పంటపై గడ్డి మందు పిచికారి చేయించారు. తన పొలంలో ఎందుకు గడ్డిమందు పిచికారి చేస్తున్నారని చిన్న మల్లయ్య ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన సెక్షన్ ఆఫీసర్ పోలీస్‌స్టేషన్‌లో రైతుపై ఫిర్యాదు చేశారు. కాగా బుధవారం పంటను పరిశీలించగా ఎండిపోవడాన్ని చూసి రైతు తీవ్రంగా ఆందోళనకు గురయ్యాడు. అక్కడే అటవీ అధికారులు పిచికారి చేసి పడేసిన డబ్బాలోని గడ్డి మందును సేవించాడు. వెంటనే పోలీసు స్టేషన్‌కు వెళ్లి సెక్షన్ అధికారిపై ఫిర్యాదు చేశాడు. రైతు ఆత్మహత్యాయత్నం చేశాడని గమనించిన ఎస్సై ఆంజనేయులు చిన్నమల్లయ్యను చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సెక్షన్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్నమల్లయతో పాటు మరొకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా ఈ విషయమై ఎఫ్ఆర్‌వో హేమచందనను వివరణ కోరగా.. రైతు సాగు చేసుకుంటున్న భూమి అటవీ భూమి అని, పలుసార్లు నోటీసులు కూడా ఇచ్చినట్లు తెలిపారు.

సంధ్య థియేటర్ ఘటనపై
సీఎస్‌కు ఎన్‌హెచ్ఆర్‌సీ నోటీసులు

- సమగ్ర దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని సీపీకి ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా ప్రదర్శన సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద గత డిసెంబరు 3న జరిగిన తొక్కిసలాటపై జాతీయ మానవ హక్కుల సంఘం(ఎన్‌హెచ్ఆర్‌సీ) తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మరణించగా ఆమె కుటుంబానికి రూ.5లక్షల నష్టపరిహారం ఎందుకు చెల్లించకూడదు ? అని ప్రశ్నించింది. ఇక, శాంతి భద్రతల నిర్వహణలో పోలీసు శాఖ నిర్లక్ష్యం కనిపిస్తోందని ఎన్‌హెచ్ఆర్‌సీ అభిప్రాయపడింది. మొత్తం ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి ఆరు వారాల్లోపు నివేదిక సమర్పించాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ (శాంతి భద్రతలు)ను ఎన్‌హెచ్ఆర్‌సీ ఆదేశించింది. కాగా, సంధ్య థియేటర్ వద్ద లాఠీచార్జి, తొక్కిసలాటలో రేవతి మరణం, ఆమె ఇద్దరు పిల్లలు గాయపడడంపై ఇమ్మనేని రమణారావు అనే న్యాయవాది చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎన్‌హెచ్ఆర్‌సీ ఈ నోటీసులు జారీ చేసింది. ఇదే ఘటనపై హైదరాబాద్ అదనపు పోలీసు కమిషనర్ ఇప్పటికే రెండుసార్లు వివరణలు ఇచ్చినప్పటికీ ఎన్‌హెచ్ఆర్‌సీ సంతృప్తి చెందలేదు.

వానాకాలం సాగు విస్తీర్ణంలో 69 శాతం నమోదు!

- రాష్ట్ర వ్యవసాయశాఖ నివేదికలో వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగు విస్తీర్ణంలో ఇప్పటివరకు 69 శాతం విస్తీర్ణంలో సాగు నమోదైందని రాష్ట్ర వ్యవసాయశాఖ నివేదిలో వెల్లడించింది. రాష్ట్రంలో మొత్తం 1 కోటి 32 లక్షల 44 వేల 305 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణానికి గాను.. బుధవారం నాటికి 91,52,976 ఎకరాల్లో సాగు పూర్తయిందని తెలిపింది. గతేడాది ఇదే సమయానికి 80.71లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు కాగా... ఈ ఏడాది అంతకంటే 10 లక్షల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పంటలు సాగైనట్లు వివరించింది. వరి 30,15,599 ఎకరాలు, పత్తి 43,70,919, మొక్కజొన్న 5,52,551 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. వీటితో పాటు 4,43,335 ఎకరాల్లో కంది, 3,55,857 ఎకరాల్లో సోయాబీన్, మిగిలిన విస్తీర్ణంలో ఇతర పంటలు సాగు చేసినట్లు నివేదికలో వ్యవసాయశాఖ పేర్కొంది.

ఏసీబీకి చిక్కిన జగిత్యాల డీటీవో

రూ.22 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత.. మరో మూడు వారాల్లో పదవీ విరమణ

- 3వేలు తీసుకుంటూ పట్టుబడిన మహబూబ్‌నగర్ జిల్లా ఏఈఈ


ఏసీబీకి పట్టుబడిన ఏఈఈ మహ్మద్ ఫయాజ్

హైదరాబాద్, జగిత్యాలరూరల్, మహబూబ్‌నగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఒకే రోజు ఏసీబీ వలకు ఇద్దరు అధికారులు చిక్కారు. ఈ నెలాఖరున పదవీ విరమణ చేయబోతున్న జగిత్యాల జిల్లా రవాణాశాఖ అధికారి (డీటీవో) భద్రునాయక్ బుధవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈనెల 4న కోరుట్ల శివారులో ఓ ఎక్స్‌కవేటర్‌ను కాలుష్య, బీమా పత్రాలు లేకపోవడంతో రవాణాశాఖాధికారులు పట్టుకున్నారు. దాన్ని సీజ్ చేయకుండా ఉండేందుకు రూ.35 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో ఆ మొత్తం డీటీవోకు ఇచ్చేందుకు యజమాని ఒప్పుకున్నాడు. అదే రోజు రూ.13 వేలు ఆయనకు ఇవ్వడంతో వాహనాన్ని వదిలిపెట్టారు. మిగతా రూ.22 వేలు ఇచ్చి ఫోన్లు తీసుకెళ్లాలని వాహన యజమానికి డీటీవో చెప్పారు. మిగతా డబ్బుల కోసం వాహన యజమానిని వేధించడంతో ఆయన ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనలతో బాధితుడు జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలోని రవాణాశాఖ కార్యాలయంలో డీటీవో వ్యక్తిగత డ్రైవర్ అరవింద్ ద్వారా రూ.22 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగా, మహబూబ్‌నగర్‌లోని ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ)గా పనిచేస్తున్న మహ్మద్ ఫయాజ్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. నగరానికి చెందిన ఓ వ్యక్తికి చెందిన 150గజాల స్థలానికి ఎన్‌వోసీ ఇచ్చేం దుకు నివేదిక కోసం ఫయాజ్ బుధవారం రూ.3 వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు అరెస్టు చేశారు.

మళ్లీ చిక్కిన భద్రునాయక్..

భద్రునాయక్ ఇంతకు ముందూ ఏసీబీకి పట్టుబడ్డారు. 2008లో హైదరాబాద్ ఏసీబీ సీఐయూ విభాగంలోనూ ఆయనపై కేసు నమోదైంది. సొంత అన్నను సుపారీ గ్యాంగ్ తో హత్య చేయించేందుకు కుట్ర చేసిన కేసులోనూ ఆయన కీలక నిందితుడు. హత్యకు కుట్ర విషయం చెబుతాడనే ఉద్దేశంతో ఓ వ్యక్తిని హత్య చేయించిన కేసులోనూ భద్రు నాయక్‌ను పోలీసులు నిందితుడిగా చేర్చారు. సోదరుడి హత్యకు కుట్ర, హత్య కేసు 2022 లో నమోదుకాగా.. 2008లో నమోదైన ట్రాప్ కేసు ప్రస్తుతం ఏసీబీ ప్రత్యేక కోర్టులో విచారణలో ఉంది. తాజాగా మళ్లీ ఆయన ఏసీబీకి చిక్కారు. భద్రునాయక్ పెద్ద మొత్తం లో ఆస్తులు కూడబెట్టాడు. సోదరుడు వీరు నాయక్‌తో కలిసి వ్యాపారాలు చేశారు. నాలుగు గ్రానైట్ క్వారీలు, 120 ఎకరాల భూమి కొన్నా రు. 70 ఎకరాలు భద్రునాయక్ పేరుతో ఉండగా మిగతాది సోదరుడి పేరుతో ఉంది. నాలుగు క్వారీ లు భద్రునాయక్ పేరుతోనే నిర్వహించారు. హైదరాబాద్‌లో 3 ఇళ్లు, 7 వరకు ప్లాట్లు ఉన్నట్లు వీరు నాయక్ హత్యకు కుట్ర కేసు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. కలిసి వ్యాపారం చేయడంతో ఆస్తుల్లో సగం కావాలని డిమాండ్ చేయడంతో సుపారీ గ్యాంగ్‌తో వీరు నాయక్‌కు హత్యకు కుట్ర చేసినట్లు భద్రునాయక్‌పై కేసు నమోదైంది. భద్రు నాయక్ ఆస్తులను గుర్తించడంలో ఏసీబీ నిమగ్నమైంది. ఆయన నివాసం, కార్యాలయంతోపాటు ఇతర ప్రాంతాల్లో అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.

శిథిలావస్థకు చేరిన
తరగతి గదులు

- అపరిశుభ్రంగా పరిసరాలు.. నీళ్లు రాని బాత్రూమ్‌లు!
- మెదక్ జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల అవస్థలు
- ఆకస్మిక తనిఖీలో విస్తుపోయిన ఏసీబీ అధికారులు


తరగతి గదిలో ఓ వైపు కూలిన గోడ


పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన శ్లాబు

నర్సాపూర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆ గిరిజన ఆశ్రమ పాఠశాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. విద్యార్థులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం మహ్మదాబాద్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన ఈ తనిఖీల్లో.. అక్కడి విద్యార్థులు పడుతున్న అవస్థలను చూసి అధికారులు విస్తుపోయారు. పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబు పెచ్చులూడి చువ్వలు తేలి.. కూలడానికి సిద్ధంగా ఉన్నా.. అందులోనే తరగతులు కొనసాగిస్తున్నారు. ఇక స్నానాలకు, తాగడానికి నీటి వసతి లేక పడుతున్న విద్యార్థులు ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. నీటి సదుపాయం లేకపోవడంతో కుళాయిలు నిరుపయోగంగా మారాయి. బాత్రూముల్లో నీరురాక సమీపంలోని పొలాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి. పైగా పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా.. చుట్టూ చెట్లు, పొదలు పెరిగి పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ప్రహరీ పూర్తిగా లేక విషపురుగులు, పాములకు ఆవాసాలుగా మారుతోందని పిల్లలు భయాందోళనలకు గురవుతున్నారు. ఇంత దుర్భర పరిస్థితుల్లోనూ ఈ ఆశ్రమ పాఠశాలలో 100 మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. మెనూ ప్రకారం భోజనం అమలు చేయడం లేదని, ఆహార పదార్థాలు నాణ్యంగా లేవని ఏసీబీ అధికారుల తనిఖీలో బయటపడింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు.

'మధ్యాహ్న భోజనం' కార్మికుల ఆందోళన

- బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్

ఖైరతాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బకాయిలో ఉన్న అయిదు నెలల వేతనాలను, 9 నెలల కోడి గుడ్ల బిల్లులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళా కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఘర్షణ వాతావరణం ఏర్పడడంతో పోలీసులు కొంతమంది కార్మికులను అరెస్టు చేశారు. పాత మెనూ ప్రకారమే ప్రభుత్వం తమకు 5 నెలలుగా బిల్లులు ఇవ్వట్లేదని, కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు ఏ విధంగా భోజనం పెట్టాలని సంఘం నాయకులు ప్రశ్నించారు. పెండింగ్ వేతనాల కోసం తమ చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కట్టెల పొయ్యి బదులు గ్యాస్‌స్టవ్ వాడాలని చెబుతున్న ప్రభుత్వం తమకు నేటికీ గ్యాస్ సిలిండర్లు మంజూరు చేయడం లేదని వాపోయారు. అనంతరం బకాయిలతో పాటు కొత్త మెనూ ప్రకారం బిల్లులను సకాలంలో చెల్లించాలని కోరుతూ పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

విష జ్వరంతో ఒకరి మృతి

వాజేడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విష జ్వరంతో ములుగు జిల్లా వాజేడు మండలానికి చెందిన కొండగొర్ల నర్సింహరావు(56) అనే వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని ముత్తారం కాలనీకి చెందిన నర్సింహరావు వారం క్రితం జ్వరం బారిన పడి స్థానికంగా ఓ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అయినా తగ్గకపోవడంతో మొదట ఏటూరునాగారంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో తర్వాత వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. బుధవారం ఉదయం పరిస్థితి విషమించి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఝార్ఖండ్ అంతరాత్మ

'సంతాల్ ప్రజలు ఏడాది పొడుగునా శ్రమిస్తూనే ఉంటారు. అయినా ఆరు ఋతువులలోనూ ప్రతి రోజూ ఆకలి దప్పులతో అలమటిస్తుంటారు. పంట సిరులు, ప్రకృతి ఫలాలు వడ్డీ వ్యాపారుల వశమవుతున్నాయి. ఈ పరిస్థితి పోవాలి' అని శివచరణ్ నిరసించాడు. ధర్మవడ్డీల అధర్మాన్ని ఎదిరించిన తండ్రి శోబరన్ సోరెన్ వడ్డీ వ్యాపారుల దుర్మార్గానికి బలైపోవడం పదమూడేళ్ల శివచరణ్ జీవితాన్ని నిర్ణయాత్మకంగా మార్చివేసింది. వడ్డీ వ్యాపారుల దోపిడీ నుంచి తనకు ఆత్మబంధువులు అయిన ఆదివాసీలను విముక్తం చేసేందుకు బాల శివచరణ్ సంకల్పించుకున్నాడు. ఆ దృఢ నిర్ణయం తోనే ఆ బాలుడు తన జీవన ప్రస్థానంలో శిబూ సోరెన్‌గా పరిణమించాడు, దిశోం గురు (జాతి నాయకుడు)గా గౌరవాదరాలు పొందాడు. మొన్న సోమవారం నాడు శిబూ సోరెన్ మరణంతో ఆదివాసీల జాతీయ జీవితంలో ఒక అధ్యాయం ముగిసిపోయింది.

తండ్రిని కోల్పోయిన చింత శివచరణ్‌ను అన్యాయాలకు వ్యతిరేకంగా సంఘటిత పోరుకు పురిగొల్పింది. తోటి ఆదివాసీ యువకులతో కలిసి వడ్డీ వ్యాపారులు, భూస్వాములకు వ్యతిరేకంగా ఉద్యమించాడు. అదే సమయంలో సంతాల్ గిరిజనులలో సాంఘిక సంస్కరణ ఉద్యమాన్ని కూడా ఆయన ప్రారంభించారు. సనత్ సంతాల్ సమాజ్ పేరిట తన ప్రజలలో మద్యపానం, మూఢనమ్మకాలు, బహు భార్యాత్వం నిర్మూలనకు ఆయన విశేష కృషి చేశారు. అయితే సామాజిక అసమానతలు, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా నిర్వహించిన ఉద్యమాలు శిబూ సోరెన్‌ను రాజకీయ రంగం వైపునకు నడిపించాయి. అవిభక్త బిహార్‌లో ఆదివాసీలు అత్యధికంగా ఉన్న జిల్లాలతో ఝార్ఖండ్ రాష్ట్రాన్ని సాధిస్తేనే గానీ వారి సమస్యలు పరిష్కారం కావనే నిర్ణయానికి ఆయన వచ్చారు.

స్వాతంత్ర్యానంతరం జైపాల్‌సింగ్ ముండా అనే విఖ్యాత హాకీ క్రీడాకారుడు ఝార్ఖండ్ పార్టీ నేర్పాటు చేసి ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఉద్యమించారు.. ఆ దశలో జార్ఖండ్ భావన గిరిజనులను అన్ని విధాల దోపిడీ చేస్తున్న డీకూస్ (బయటివ్యక్తులు)ను వ్యతిరేకించడానికే ప్రధానంగా పరిమితమయింది. ఈ కారణంగానే జైపాల్‌సింగ్ తన లక్ష్య సాధనలో సఫలమవలేకపోయారు. 20వ శతాబ్దంలో జార్ఖండ్ ప్రాంతంలో పారిశ్రామికీకరణ విస్తరించడంతో ఆ ప్రాంత జనాభాలో వైవిధ్యం బాగా పెరిగిపోయి జార్ఖండ్ భావనకు మద్దతు తగ్గిపో సాగింది. ఈ తరుణంలో శిబూ రాజకీయ రంగ ప్రవేశం చేశారు.

బెంగాలీ మార్క్సిస్టు ట్రేడ్ యూనియన్ నాయకుడు ఎ.కె రాయ్, కుర్మి–మహతో నేత బినోద్ బిహారీ మహతోతో కలిసి ఆయన 1972లో ఝార్ఖండ్ ముక్తి మోర్చా నేర్పాటు చేశారు. పారిశ్రామిక కార్మికులు, అట్టడుగు కులాలవారు, ఆదివాసీలు భాగస్వాములుగా ఝార్ఖండ్ భావనను ఆయన పునః నిర్వచించారు. సామాజిక అసమానతలు, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా ముమ్మర పోరాటాలు చేశారు. ఆదివాసీలతో పాటు ఆదివాసీయేతర ప్రజలలో కూడా ఝార్ఖండ్‌కు మద్దతును కూడగట్టారు. 1980లో లోక్‌సభకు ఎన్నికైన సోరెన్ ప్రధాని ఇందిరతో ఒక ఒప్పందానికి వచ్చారు. అది ఆయన రాజకీయ కార్యచరణను మార్చివేసింది. ఝార్ఖండ్ సాధనే లక్ష్యమైపోయింది. తదాది రెండు దశాబ్దాల పాటు పార్లమెంటులో ఝార్ఖండ్ ఏర్పాటు గురించి అవిరామంగా ఎలుగెత్తారు. 2000 సంవత్సరంలో ఝార్ఖండ్ అధికారికంగా ఉనికిలోకి వచ్చింది. ఆయనతో విభేదించినవారు సైతం ఝార్ఖండ్ సాధకుడు శిబూ సోరెన్ అనే విషయమై భిన్నాభిప్రాయాన్ని ఎన్నడూ వ్యక్తం చేయలేదు.

శిబూ సోరెన్ ఎనిమిదిసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. మరణించిన సమయంలో రాజ్యసభ సభ్యుడుగా ఉన్నారు. స్వల్పకాలమే అయినా అనేక వివాదాల నడుమ కేంద్ర మంత్రిగా కూడా పని చేశారు. మూడుసార్లు ఝార్ఖండ్‌కు ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఏ ఒక్కసారి కూడా ఆయన పాలనా కాలం గరిష్ఠంగా ఆరునెలలు కూడా లేదు. సంకీర్ణ రాజకీయాల పుణ్యమది. సమర్థ పాలన కాదు, మౌలిక మార్పు సాధనే ఆయన వారసత్వం. న్యాయాన్ని స్వప్నించాలని, దాని సాధనకు సంఘటితమవాలని తన ప్రజలకు ఆయన బోధించారు. అధికారం కోసం ఆయన రాజకీయాలలోకి రాలేదు. బాల్యం నుంచి తన ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను రూపుమాపే లక్ష్యం కోసమే ఆయన అధికారాన్ని ఆశించారు. అధర్మంపై ప్రతి పోరాటం లోనూ ఆయన సజీవంగా ఉంటారు– ఒక రాజకీయవేత్తగా కాదు, తాను స్వప్నించి, సాధించిన ఝార్ఖండ్ అంతరాత్మగా.

భారతీయ సంస్కృతీ వైభవ ప్రతీక చేనేత

మన దేశపు సాంస్కృతిక వైవిధ్యానికి, సుసంపన్న వారసత్వానికి ప్రతీక చేనేత రంగం. ఇది గ్రామీణ – అర్ధ గ్రామీణ ప్రాంతాలలో లక్షలాది కుటుంబాలకు ప్రధాన జీవనోపాధి వనరుగా ఉన్నది. ప్రకృతిలోనే పుట్టిన ఈ రంగం పర్యావరణానుకూల ఉత్పత్తి విధానాలను అనుసరిస్తూ, తక్కువ మూలధనంతో పనిచేస్తుంది. అంతేకాక, మారుతున్న ఫ్యాషన్ ధోరణులకు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సృజనాత్మక మార్పులకు అవకాశం కల్పిస్తుంది.

స్వాతంత్ర్యానంతరం దేశంలో జరిగిన పారిశ్రామికీకరణ విధానాల మూలంగా టెక్స్‌టైల్ రంగంలోకి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడంతో చేనేత రంగం భారీ కుదుపులకు లోనైంది. ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లేక అత్యంత నైపుణ్యత కలిగిన అనేక మంది చేనేత కార్మికులు వివిధ ఉపాధి పనుల నిమిత్తం ఇతర రంగాలకు, ప్రాంతాలకు వలస వెళ్ళిపోయారు. అయినప్పటికీ నేటికీ అనేక మంది తమ తరతరాల ఘన వారసత్వాన్ని నమ్ముకొని జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

భారతదేశంలోని ప్రతి ప్రాంతానికీ ప్రత్యేకమైన చేనేత పరంపర ఉంది. ప్రత్యేక రకాల వస్త్రాలను తయారు చేయడంలో ఆయా ప్రాంతాలు ప్రసిద్ధి చెందాయి. చేనేత పరిశ్రమ ఒక గృహ ఆధారిత పరిశ్రమ. దేశంలో లక్షలాది మందికి ప్రత్యక్ష పరోక్ష ఉపాధిని అందిస్తున్నది. తక్కువ మూలధనంతో పర్యావరణ హితమైన ఉత్పత్తులు ఈ పరిశ్రమను వేల సంవత్సరాల పాటు సజీవంగా నిలిపాయి. ప్రస్తుతం చేనేత పరిశ్రమ దాదాపు 3 లక్షలకు పైగా మగ్గాలతో దేశంలోనే అతి పెద్ద కుటీర పరిశ్రమగా ఉంది. ఈ రంగం మహిళా సాధికారతకు నేరుగా తోడ్పడుతున్నది. 2019–20 చేనేత జనాభా లెక్కల ప్రకారం ఈ రంగం గ్రామీణ ప్రాంతంలో రెండవ అతిపెద్ద ఉపాధిగా ఉంటూ, ప్రత్యక్ష, అనుబంధ కార్యకలాపాలలో సుమారు దేశవ్యాప్తంగా 35.22 లక్షలమంది చేనేత కార్మికులకు ఉపాధిని కల్పిస్తుండగా, వీరిలో 25.46 లక్షలమంది అంటే దాదాపు 72శాతం మంది మహిళలే ఉన్నారని ఈ లెక్కలు తెలుపుతున్నాయి.


తెలంగాణలో చేనేత రంగానికి గొప్ప చరిత్ర ఉన్నది. ఈ రంగంలో అనుబంధ కార్మికులు సహా 59,325 మంది చేనేత కార్మికులు ఉన్నారు. రాష్ట్రంలో 41,556 మరమగ్గాలు పని చేస్తున్నాయి. రాష్ట్రంలో కాటన్–259, సిల్క్–40 వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీలు ఉన్నాయి. చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం లిమిటెడ్ పేరుతో ఒక అపెక్స్ సొసైటీ ఉన్నది. ఇక్కడి గ్రామాల్లో మగ్గాలపై నేసే వస్త్రాలకు ఖండాంతర ఖ్యాతి ఉంది. ఆయా ప్రాంతాలు ప్రత్యేకించిన కళాఖండాలుగా జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ సైతం సాధించాయి. ఇక్కడి పోచంపల్లి ఇక్కత్ పట్టుచీరకు 2003లోనే జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ జారీ అయింది. తెలంగాణలోని గద్వాల, సిరిసిల్ల, నారాయణపేట్, దుబ్బాక ప్రాంతాలు సైతం అద్భుతమైన చేనేత వస్త్ర రూపాలతో ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యత సంపాదించాయి.



akbar

మన దేశంలో వ్యవసాయం తరువాత అతిపెద్ద ఉపాధి రంగం చేనేత. తీవ్ర రుణ భారంతో సతమతమవుతున్న చేనేత రంగానికి దన్నుగా వడ్డీ లేని లేదా అత్యంత తక్కువ వడ్డీ గల రుణాలతో, గ్రాంటుల రూపంలోను, ఇతర సబ్సిడీలతో ప్రభుత్వాలు అండగా నిలబడాలి. చేనేత వస్త్రాలను తయారు చేయడానికి వాడే నూలు, రంగు తదితర ముడిసరుకులను ప్రభుత్వం సబ్సిడీ ధరలకు అందించినట్టయితే ఆయా ఉత్పత్తులు చౌకధరల్లో ప్రజలకి అందుబాటులోకి వస్తాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని ఉప్పాడ, మంగళగిరి డ్రెస్ మెటీరియల్స్, వేంకటగిరి జరీ చీరలు, ధర్మవరం సిల్క్ చీరలు, పెద్దాపురం పట్టు చీరలు, పొందూరు ఖాదీ వస్త్రాలు దేశవ్యాప్త ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. అలాగే కర్ణాటక రాష్ట్రంలోని అనేక క్లస్టర్లు సంప్రదాయ డిజైన్లకు, సున్నితమైన కళలకు ప్రసిద్ధి. చిత్రదుర్గ జిల్లాలోని మొళకాల్మూరు చీరలు, బాగల కోట్ జిల్లాలోని ఇల్కల్ చీరలు దేశవ్యాప్త దృష్టిని ఆకర్షించాయి.



స్వాతంత్ర్య పోరాట కాలంలో మహాత్మాగాంధీజీ నాయకత్వంలో స్వదేశీ ఉద్యమం 1905 ఆగస్టు 7న ప్రారంభమైంది. ఇది దేశీయ పరిశ్రమలకు, ముఖ్యంగా చేతివృత్తి కార్మికులకు ప్రోత్సాహాన్ని ఇచ్చింది. దేశీయ సరుకుల వాడకాన్ని విరివిగా ప్రోత్సహిస్తూ గాంధీ గారు స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించిన ఆగస్టు 7నే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2016లో జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించి ఆ రంగానికి వెన్ను దన్నుగా నిలిచింది.

కేంద్ర ప్రభుత్వం 2025–26 సంవత్సర బడ్జెట్‌లో దాదాపు రూ.5,272 కోట్లను ప్రకటించి చేనేత రంగానికి అండగా నిలిచింది. చేనేత కార్మికుల పిల్లలకు నేషనల్ ఓపెన్ యూనివర్సిటీలోనూ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ ద్వారానూ విద్యా సౌకర్యం అందిస్తున్నది.

తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన పోచంపల్లి సిల్క్ టై అండ్ డై, గద్వాల, నారాయణపేట్ తదితర కేంద్రాల అభివృద్ధికి, వరంగల్, మహబూబ్‌నగర్‌లలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి వేల కోట్ల రూపాయలతో ఈ పరిశ్రమను అభివృద్ధి చేస్తోంది. వరంగల్ టెక్స్‌టైల్ పార్క్, సిరిసిల్ల అపరేల్ పార్క్‌లో ఇంటిగ్రల్ స్కిల్ డెవలప్‌మెంట్ స్కీం ద్వారా కేంద్రం 75శాతం, రాష్ట్రం 25శాతం చొప్పున నిధులతో చేనేత కార్మికులకు శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం 'మహాత్మాగాంధీ బంకర్ బీమా యోజన' ద్వారా చేనేత కార్మికులకు ప్రమాద బీమాను కల్పిస్తోంది. ఈ పథకం నేతన్నలతో పాటు వారి మగ్గాలకు సైతం ప్రమాద బీమాను అందిస్తుంది. అలాగే ఈ పథకం ఆయా మగ్గాల ఫ్యాబ్రిక్ నాణ్యతను, ఉత్పాదకతను పెంచడానికి సాంకేతికతను అప్‌గ్రేడ్ చేయడంలో సహాయపడుతుంది.

'హత్‌కర్ఘ సమ్వర్ధన్ సహాయత (HSS)' పథకం ద్వారా నేతన్నలకు కావలసిన మగ్గాలు, తదితర ఇతర పరికరాల కొనుగోలుకై ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది. మోదీ ప్రభుత్వం తీసుకున్న 'ప్రత్యక్ష నగదు బదిలీ' ద్వారా చేనేత లబ్ధిదారులందరికీ నేరుగా కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధి అందనున్నది. నిజమైన చేనేత వస్తువులకు గుర్తుగా 'చేనేత గుర్తు' (హ్యాండ్లూమ్ మార్క్) ద్వారా వినియోగదారులకు నకిలీల బెడద నుంచి రక్షణ కల్పిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ముద్ర' పథకంలోను చేనేత రంగానికి విరివిగా రుణాలు అందిస్తున్నది. కేంద్ర కార్మికశాఖ సైతం చేనేత కార్మికులకు 'పెహచాన్' (గుర్తింపు) కార్డులను అందజేసి వారికి వెనుదన్నుగా నిలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా దాదాపు రూ.400కోట్లను ఈ సంవత్సరం బడ్జెట్‌లో చేనేత రంగానికి కేటాయించింది. ప్రభుత్వం లక్ష రూపాయల లోపు చేనేత రుణాల మాఫీకి ముందుకు రావడం ఎంతో శుభపరిణామం.

మన దేశంలో వ్యవసాయం తరువాత అతిపెద్ద ఉపాధి రంగం చేనేత రంగమే. ఈ రంగం అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉంది. ప్రతి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు వాటి అవసరాన్ని బట్టి విధిగా చేనేత శాలువాలు, బ్లాంకెట్స్, బెడ్‌షీట్స్ టవల్స్ వాడాలనే నిబంధనలు రూపొందించాల్సిన అవసరం ఉంది. తీవ్ర రుణ భారంతో సతమతమవుతున్న చేనేత రంగానికి దన్నుగా వడ్డీ లేని లేదా అత్యంత తక్కువ వడ్డీ గల రుణాలతో, గ్రాంటుల రూపంలోను, ఇతర సబ్సిడీలతో ప్రభుత్వాలు అండగా నిలబడాలి. ఇంతటి పోటీ ప్రపంచంలోనూ 'చేనేతకు ఆదరణ ఎంత మాత్రం తగ్గలేదు. కానీ చేనేత వస్త్రాలను తయారు చేయడానికి వాడే నూలు, రంగు తదితర ముడిసరుకులను ప్రభుత్వం సబ్సిడీ ధరలకు అందించినట్టయితే ఆయా ఉత్పత్తులు చౌకధరల్లో ప్రజలకి అందుబాటులోకి వస్తాయి. స్థానిక నేతన్నలు నేసిన ఉత్పత్తులను దేశవ్యాప్తంగా అమ్మకాలు జరుపుకునేలా మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి. మారుతున్న కాలంతో పాటు మారిన అత్యాధునిక సాంకేతికతను చేనేత రంగానికి అందించాలి. నేటి సమాజంలో రాజకీయ నాయకులను, ఇతర అధికారులను శాలువాలతో సన్మానించే సంస్కృతి పెరిగింది. చేనేతతో చేసిన ఎంబ్రాయిడరీ శాలువాలని ప్రముఖులు సన్మానించే కార్యక్రమాల్లో విరివిగా వాడాలి. కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ తదితర రాష్ట్రాలలోని గ్రామీణ ఆర్థిక వ్యవస్థలలో ఈ రకమైన శాలువాలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి రాజకీయ నాయకుడు వారి రోజు వారీ కార్యక్రమాలలో ఈ శాలువాలని ప్రోత్సహించాలి. పైకి చిన్నగా కనబడుతున్నా ఈ చేనేత శాలువాల విలువ దేశవ్యాప్తంగా దాదాపు రూ.1200 వందల కోట్లని ఒక అంచనా.

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మన ఉభయ తెలుగు రాష్ట్రాలలో చేనేత రంగానికి విశేష సేవలందించి గుర్తింపు తెచ్చిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని మనందరం స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన చేనేత వారసత్వాన్ని కాపాడుకుంటూ మనం అందరం కూడా స్వయంగా చేనేత వస్త్రాలను విరివిగా వాడుతూ ఈ రంగం నిలబడటానికి కృషి చేయడమే చేనేత రంగానికి మనం చేసే నిజమైన సేవ.

▪ బండారు దత్తాత్రేయ
మాజీ గవర్నర్

(నేడు జాతీయ చేనేత దినోత్సవం)

పాణిగ్రాహి ఆదర్శాలే ప్రాణంగా...

భారత విప్లవోద్యమ చరిత్రలో సుబ్బారావు పాణిగ్రాహి పేరు వినని వారు ఉండరు. సుబ్బారావు పాణిగ్రాహి జీవిత సహచరి కామ్రేడ్ సురేఖ పాణిగ్రాహి జూలై 24వ తేదీ నాడు (89వ ఏట) శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడులో అమరులయ్యారు.

1959లో ఆమెకు కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహితో వివాహం జరిగింది. రెండూ సంప్రదాయక పేద బ్రాహ్మణ కుటుంబాలు. సుబ్బారావు పాణిగ్రాహిది సోంపేట గ్రామం. బారువాలో పాణిగ్రాహి తండ్రి శ్రీవత్స పాణిగ్రాహి పౌరోహిత్యం, నాటు వైద్యం చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. సుబ్బారావు పాణిగ్రాహి ఎస్ఎల్‌సి పూర్తిచేసుకుని పద్యాలు పాడుతూ నాటకాలు వేస్తూ ఉండేవారు. కళా రంగంలో ఉన్న కాలంలోనే తల్లి అనారోగ్యం కారణంగా వివాహం చేసుకోవాలని పెద్ద బావ పట్టుబట్టడంతో సురేఖను వివాహం చేసుకున్నారు. కొద్ది రోజులకి సోంపేటలో వారి దాంపత్య జీవితం ప్రారంభమైంది. కటిక పేదరికం. అనేక ఆర్థిక ఇబ్బందుల నడుమ జీవితం. అప్పటికే ఖరగ్‌పూర్ వెళ్ళిన పాణిగ్రాహి కమ్యూనిస్టు భావాలతో తిరిగొచ్చాడు. ఆనాటికే కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తున్న ఆయన, పార్టీ ఆదేశాల మేరకు 1959 లోనే బొడ్డపాడు శివాలయానికి పూజారిగా వచ్చారు. తనతో పాటు భార్య సురేఖను, తన చెల్లెలు లీలా కుమారిని తీసుకొని బొడ్డపాడు చేరారు.



సురేఖ పాణిగ్రాహి ప్రత్యక్షంగా ఉద్యమంలో లేకపోయినా ఆమె ఉద్యమాన్ని, ప్రజలను, ఎర్రజెండాను ప్రేమించారు. పాణిగ్రాహి వర్ధంతి సభలకు కవులు, కళాకారులు, రచయితలు, విప్లవ సంస్థలు పిలిచినప్పుడు ఆమెలో ఉత్సాహం ఉప్పొంగేది. అరుణ పతాకం ఎగరవేసినప్పుడల్లా ఆమె హుందాగా వెళ్లి తన భర్త లాంటి అమరులు చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ, వారు కోరుకున్న వ్యవస్థ రావాలని ఆకాంక్షించేవారు.

చేరింది పూజారి ఉద్యోగంలోనే అయినా స్థానిక యువతరానికి విప్లవ పాఠాలు బోధించేవారు సుబ్బారావు పాణిగ్రాహి. ఉదయం మొదలుకొని అర్ధరాత్రి వరకు పార్టీ కార్యక్రమాల్లో తలమునకలై ఉండేవారు. ప్రజల చుట్టూ, కళా రంగం చుట్టూ ఆయన జీవితం గడిచేది. ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు తామడ గణపతి, పైల వాసుదేవరావు, పంచాది కృష్ణమూర్తి తదితర మిత్రులతో నిరంతరం ఉద్దానం పల్లె ప్రజల్లో విప్లవాగ్నులు రగిల్చేవారు.

మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరుస్తూ 'ఆట, పాట, మాట' ద్వారా వారి నోట్లో నాలుకయ్యాడు సుబ్బారావు. అయితే అత్యంత నిర్బంధ పరిస్థితుల్లో కూడా ఆయన సహచరి సురేఖా పాణిగ్రాహి భర్తకు అడ్డు చెప్పలేదు. ఉద్యమ జీవితానికి సురేఖ అన్ని రకాల సహాయ సహకారాలనూ అందించింది. ఒక రకంగా ఆమె తోడ్పాటు లేకపోతే విప్లవోద్యమంలో పాణిగ్రాహి పాత్ర అంతగా గొప్పగా వెలిగేది కాదేమో. శ్రీకాకుళం ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడుతోన్న కాలంలో సుబ్బారావు పాణిగ్రాహి అజ్ఞాతవాసంలోకి వెళ్లారు. 1969 డిసెంబర్ 22న రంగమట్టియ కొండల్లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లో సుబ్బారావు పాణిగ్రాహి అమరులయ్యారు. పాణిగ్రాహితో సాహచర్యం వీడి 55 ఏళ్ళు ఆమె ఒంటరి జీవితం సాగించింది. బిడ్డలు లేరు, అయినా ఆ చింత లేదు. కొత్తపల్లిలో తమ్ముడు వద్ద పదిహేనేళ్ళు ఉన్నారు. బొడ్డపాడులో పాణిగ్రాహి తమ్ముడు కొడుకు అయిన నిరంజన్ దగ్గర మరికొన్ని రోజులు కాలం వెళ్ళబుచ్చారు.

పేదరికం, కష్టాలు ఆమెకు కొత్త కాదు. ఉద్యమ కాలంలో పోలీసుల వేధింపులు, సాధింపులు నిర్బంధాల మధ్య ఆమె జీవితం గడిచింది. ఆమె ప్రత్యక్షంగా ఉద్యమంలో లేకపోయినా ఆమె ఉద్యమాన్ని, ప్రజలను, ఎర్రజెండాను ప్రేమించారు. పాణిగ్రాహి వర్ధంతి సభలకు కవులు, కళాకారులు, రచయితలు, విప్లవ సంస్థలు పిలిచినప్పుడు ఆమెలో ఉత్సాహం ఉప్పొంగేది. అరుణ పతాకం ఎగరవేసినప్పుడల్లా ఆమె హుందాగా వెళ్లి తన భర్త లాంటి అమరులు చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ, వారు కోరుకున్న వ్యవస్థ రావాలని ఆకాంక్షించేవారు. తనను చూడడానికి వచ్చిన రచయితలు, కవులు, కళాకారులతో నాటి జ్ఞాపకాలు నెమరువేసుకునేవారు. వాళ్ళ దగ్గర పాణిగ్రాహి పాటలు పాడి గుర్తు చేసుకునేవారు. 'ఎందాకా నేస్తం? ఆగాగు అందాక వస్తాం.. అందరం కలిసి, ముందరకే పోదాం' అంటూ పాడేవారు. 'ఎరుపంటే కొందరికి భయం భయం' అంటూ ఆమె పాణిగ్రాహి పాటలోని వాక్యాలు పదే పదే మననం చేసుకునేవారు.

ఎన్ని ఇబ్బందులు పడుతున్నా, ఎర్రజెండా మీద, విప్లవోద్యమం మీద ఆమె విశ్వాసం చెక్కు చెదరలేదు. ఆమె ఆఖరి దశలో, బొడ్డపాడులో నిరంజన్ దగ్గర ఉన్న కాలంలో వృద్ధాప్య పెన్షన్ కూడా తొలగించారు. పెన్షన్ పునరుద్ధరణ కోసం అనేక ప్రయత్నాలు జరిగినప్పటికీ సాధ్యం కాలేదు. మిత్రులు శ్రేయోభిలాషులు చిన్నపాటి తోడ్పాటు అందించారు. నిరంతరం ప్రజలను ప్రేమించి, ప్రజల పట్ల అంతులేని విశ్వాసంతో జీవితాంతం నిలబడ్డారు.

○ బతకల ఈశ్వరమ్మ
పీఓడబ్ల్యూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు, ఆంధ్రప్రదేశ్

(నేడు బొడ్డపాడులో సురేఖ పాణిగ్రాహి సంతాప సభ)

సవరణ చట్టంతో పెన్షనర్లకు తీవ్ర నష్టం

1982 సెప్టెంబర్ 17న జస్టిస్ వైవి. చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. 'పదవీ విరమణ చేసిన ఉద్యోగులందరినీ విరమణ తేదీతో సంబంధం లేకుండా సమానంగా చూడాలి' అని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. చివరగా పొందిన జీతంలో 50 శాతానికి సమానమైన పెన్షన్, ఇతర ప్రయోజనాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. పెన్షనర్లకు సంబంధించి ఈ తీర్పు ఓ మైలురాయిగా నిలిచిపోయింది. అప్పటి నుంచి సెప్టెంబర్ 17ను 'పెన్షనర్ల దినోత్సవం'గా జరుపుకుంటున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం 25 మార్చి 2025న 'ఆర్థిక బిల్లు 2025'లో పెన్షనర్లకు సంబంధించిన ధృవీకరణ చట్టానికి సవరణ చేసింది. ఈ సవరణ ద్వారా పెన్షనర్ల నడ్డి విరగ్గొట్టడానికి పూనుకుంది. ఈ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ నాయకుడు కేసీ వేణుగోపాల్ వంటివారు కోరినప్పటికీ కేంద్రం ఏకపక్షంగా బిల్లును ఆమోదింపజేసింది. ఈ సవరణ వలన పెన్షనర్లలో వ్యత్యాసాన్ని సృష్టించవచ్చు, డీఏ పెరుగుదలను అరికట్టవచ్చు. ఇతర పెన్షన్ లాభాలను కూడా తగ్గించవచ్చు. లేక పెన్షన్‌నే తగ్గించవచ్చు. చివరకు పెన్షన్‌ను నిలిపేయవచ్చు. పెన్షనర్లందరూ ఇది గమనించాలి. ఈ చట్టం కేవలం కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల పైనే గాక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లపై కూడా ప్రభావం చూపవచ్చు. ఈ సవరణ చట్టాన్ని వెంటనే కేంద్రం ఉపసంహరించుకునేలా నిరసన కార్యక్రమాలు ఉధృతం చేయాల్సిన బాధ్యత పెన్షనర్ల సంఘాలపై ఉంది.

– పి.రాజేశం, సికింద్రాబాద్

అస్తిత్వరాహిత్యంలో ఉపకులాలు, తెగలు

సంక్లిష్టతల్ని గుర్తించి వాటిని తగ్గించడమే మానవ ధర్మం. వాటిని పెంచేవారూ ఉంటారు. తమ కులాలు, సమూహాలు మాత్రమే అధికారం చెలాయించాలని, ప్రజల స్థాయిని తగ్గించి అణచివేయ జూసే శక్తులు అనేకం. అవి పెరిగిపోతున్న సందర్భంలో మన దేశంలో, ముఖ్యంగా తెలంగాణలో కింది వర్గాలలోని ఒక సామాజిక వ్యవస్థ అల్లకల్లోలానికి గురవుతున్నది. దానిని పట్టించుకోలేకపోవడం, గుర్తించకపోవడం అప్రజాస్వామికం.

అలాంటి ఒక సమస్య ఉప తెగ, ఉప కుల సమస్య. బలమైన కులాలు తెలివిగా తమ పబ్బం గడుపుకుంటాయి. అధికారాన్ని చెలాయిస్తాయి. అధికార వ్యవస్థలో భాగం అవుతాయి. ప్రభుత్వాలతో అంటకాగి ఎదుగుతాయి. అది ముస్లింల పాలనలో, క్రైస్తవుల పాలనలో, హిందూ రాజుల కాలం నుంచి కొనసాగుతున్నది. అయితే సమాజం తనదైన శైలిలో కొన్ని ఆచారాలు, వెనుకబాటుతనం, సంక్లిష్టతలను మానవీయంగా మార్చుకుంటుంది.

ఆ క్రమంలో కొత్త ఉప వ్యవస్థలను, తీరులను నెలకొల్పుకుంటుంది. మరి అది సహజ న్యాయసూత్రాల కనుగుణంగా జరుగుతుంది. అమానవీయత అధికంగా పెరిగినప్పుడు సమాజంలో ఘర్షణ, యుద్ధ పరిస్థితులు ఏర్పడతాయి. రాజ్యాధికారం, పాలన, సంక్షేమం ఒకేవైపు కేంద్రీకృతమయ్యే కాలంలో మానవ మనుగడ క్లిష్టదశని ఎదుర్కొనేప్పుడు మేధావులు, చైతన్యశీలురు రంగప్రవేశం చేయాలి. కాని ప్రస్తుతం ఈ కోవలోని మనుషులు తమ కళ్లకు తామేవి చూడాలో అవే కనబడే గంతలు కట్టుకోవడం పెచ్చు పెరిగింది.

వేలాది ఏళ్లుగా ఈ కులాలకి గుర్తింపు ఇవ్వ నిరాకరించిన కులవ్యవస్థ మనది. డెబ్బై ఏళ్ల స్వాతంత్ర్యం వేలాది వెనుకబడిన, అంటరాని కులాలను, వాటి ఛత్రచ్ఛాయలో బతుకీడుస్తున్న ఉప కులాలను గురించి పట్టించుకోకపోవడం బాధాకరం. ఈ దేశంలో మూడువేల కులాలు, 25వేల ఉప కులాలు, తెగలు ఉన్నాయి. వీటిలో పెద్ద సంఖ్యలో వారు ఇంకా నిరుపేదలుగానే బతుకుతున్నారు. వీరికి చెందాల్సిన ఫలాలు, ఇతర కులాలు ఆరగిస్తున్నాయి. అంతేకాదు ఉప కులాల్ని సమాజం తొక్కి వేస్తోంది. ఈ వర్గాలకి చెందిన వారితో మాట్లాడితే విషాద సముద్రాలు వెక్కి వెక్కి ఏడుస్తాయి.

ఉప తెగలు ఆదివాసుల్లోనూ ఉన్నాయి. అనేక ఉప కులాలు వివిధ ప్రాంతాలలో, ప్రతి గ్రామంలో ఉపగ్రహాల్లా సంచరిస్తుంటాయి. కులాలకీ, ఉపకులాలకీ మధ్య ఆనాడున్న మానవీయ పేగుబంధం ఈనాడు ముక్కలు ముక్కలైంది. ఆయా కులాల చరిత్రని, పుట్టుకని, గోత్రాలని, కథలను గాన రూపంలో పాడేవారు. విలక్షణ ప్రదర్శనల ద్వారా వారి దాతృత్వాన్ని వెల్లడి చేసేవారు. అత్యంత గొప్పశైలిలో వాటిని ఆడి, పాడి భారతీయ సాంస్కృతిక సంపదలో భాగం చేశారు. 'చిందు' కళాకారులను, కళను భరతుడి 'నాట్యశాస్త్రం' గ్రంథం గుర్తించింది. శిష్టకళలకు ఉప కుల కళా సంస్కృతులు ప్రాణ వాయువులు అందించాయి. అద్భుతమైన వైవిధ్యత, విలక్షణ, ప్రత్యేకతలకు ఈ కళలు ఆలవాలమైనాయి. చాకలి, మంగలి వంటి వెనుకబడిన కులాలు, మాల, మాదిగ వంటి అస్పృశ్యతకు గురైన కులాలకు అనేక ఉపకులాలు ఉండడం గుర్తించాలి. వారి వద్ద కనబడే, కనిపించని కళా సంస్కృతులు మన నాగరికతకు మూలాలు. అయినా వీటినే ఆధారంగా చేసుకుని వేలాది ఏళ్ళుగా బతుకులీడుస్తున్న వాళ్ల జీవన పరిస్థితుల మీద పెద్దగా కృషి జరగలేదు. వీరి ఆర్థిక, సామాజిక, కళా, సంస్కృతుల విశిష్టత సమగ్రంగా బయటకు రాలేదు. ప్రభుత్వాలు అటువైపుగా దృష్టి సారించలేదు. ప్రజా పాలనలో సైతం వీరిని పక్కనే పెట్టారు. చెదురుమదురు ప్రయత్నాల వల్ల వీరికి ఒరిగిందేమీ లేదు. చదువుకున్న కులాలకి ప్రభుత్వ గుర్తింపు, సహకారం అందితే కానీ ఉప కులాల సమస్య తీరదు.

ఈ కులాలకి చెందినవాళ్లు రవీంద్రభారతులకి ఇంకా అంటరానివాళ్లే. ప్రభుత్వం మారినా పాత ప్రభుత్వం విధానాలే అమలు కావడం విచిత్రం. అద్దం వారు, పటం వారు, గంజికూటి వారు మొదలైన ఉప కులాలలో చదువుకున్న వారు లేరు. నిన్న మొన్నటి వరకు ఈ కులాలకి గుర్తింపు లేదు. ఈనాటి వరకు అలాంటి కళాకారుల సంఖ్య ఎంతో సాంస్కృతిక శాఖ వద్ద ఉందా అనే ప్రశ్నకు బదులు లేదు. వీరికి కదా మొదట గుర్తింపు ఇవ్వాలి. నోరు లేని ఈ కళాకారులకు ప్రదర్శనలు ఇవ్వాలి. కాని జరుగుతున్నది వేరు. మూలవాసీ కళాకారుల కన్నీళ్ళు తుడవని సాంస్కృతిక విభాగాలపై ప్రభుత్వం నజర్ వేయాల్సిన అవసరం ఉంది.

నిజానికి గుర్తింపు పొందని కులాలు చాలా ఉన్నాయి. గుర్తించినా కులం సర్టిఫికెట్లు పొందనివారు వేలకు వేలుగా ఉన్నారు. ఈ కులాలను సాంస్కృతిక కులాలు అని కూడా అంటారు. ఈ కళాకారులలో ఎంత మందికి గుర్తింపు కార్డులు ఉన్నాయి? కార్డులు ఇవ్వడానికి ఎందుకు జాప్యం జరుగుతున్నది? కార్డులు ఇవ్వలేనివారు వారి బతుకులను బాగుపరచగలరా?

ఉప కులాలు, తెగల కళాకారులు తాగే బీడీలపై, ఇతర వస్తువులపై జీఎస్టీలు, ఇతర పన్నులు వసూలు చేసే పాలకులు వీరిని పట్టించుకొని వారి జీవితాలను పట్టాలపైకి ఎక్కించలేరా? ప్రజల గురించి అనేక ఉద్యమాలు చేసేవారు వారి ఎజెండాలోకి ఇకనైనా వీరికి స్థానం కల్పిస్తారా? మామూలు మనుషుల గురించి, నిత్యం దోపిడీకి గురయ్యే ఇలాంటి 'చిన్న' మనుషుల గురించి మాట్లాడడం నామోషీగా భావించవద్దు. ఈ వ్యవస్థకు నిత్యం బలయ్యేవారి గౌరవం, గుర్తింపు, అస్తిత్వం కాపాడడమే సోదర పౌరధర్మం.



ఈ ఉపకులాలకు పోషితులుగా ఉన్న కులాలు వీరి బతుకును ఎందుకు పట్టించుకోవడం లేదు? ఒకనాడు వీరి బాగోగులు చూసుకుంటామన్నవారు రాగిరేకులు రాసి ఇచ్చినవారు, కాగితం సనదులపై సంతకాలు చేసినవారు ఏమయ్యారు? గౌడులు, యాదవులు, పద్మశాలీలు, కాపులు, విశ్వబ్రాహ్మణులు, మాలలు, మాదిగలు ఇకనైనా వీరిపై ఆధార పడినవారి స్థితిగతుల పట్ల దృష్టి పెట్టాలి. కులాధారితంగా నిర్మాణమైన దేశంలో కులాల అలసత్వం వల్ల, ప్రభుత్వాల వల్ల, వారి శాఖల వల్ల బతుకులు కునారిల్లకూడదు. వారి మీద రుద్దిన కులం వల్ల బాధలకు గురికాకుండా చూడాలి.

'జాంబపురాణం'లో పేర్కొన్న ఈనెలవారు, నేహ సుక్కన్నల వారు, చపలచోరులు, మొండివారు, కాగిత బ్రాహ్మణులు వంటి కులాల చరిత్రపై, మనుషులపై దృష్టి పెట్టాలి. కొన్ని కులాలు తినడానికి తిండి లేక ఆకలితో అలమటించి, లోకం నుంచి నిష్క్రమించాయి. కులగణనలో వీరిని గుర్తించే ప్రయత్నాలు జరగలేదు. ఇలాంటి వారున్నారని కులగణన చేసే వారికి తెలియనప్పుడు వారి సంఖ్య ఎలా తెలుస్తుంది?

ఇకపోతే, కులం సర్టిఫికెట్ పొందడానికి ఎంతో ప్రయాస పడవలసి ఉంటుంది. కొన్ని కులాలకి ఎమ్మార్వో, కొన్ని కులాలకి ఆర్డీవో కుల సర్టిఫికెట్లు ఇవ్వాలట. ఇదెక్కడి రూలు! పైగా ఇద్దరు గజిటెడ్ ఆఫీసర్ల సంతకాలు పెట్టించుకునే స్తోమత వీరికి ఉందా? దానిని మార్చలేమా? ఈ దేశంలో తన అస్తిత్వానికి గుర్తింపు పొందడానికి, ఒక పౌరుడిగా గుర్తింపు పొందడానికి, దాని ద్వారా పాఠశాలలో చేరి, హాస్టల్ వసతి పొందడానికి వీలులేకపోవడం ఎంత దౌర్భాగ్యం. అన్నింటికీ అవసరమైన కుల సర్టిఫికెట్ పొందడానికి ఇన్ని కష్టాలా? కింది వర్గాల ప్రజల అవసరాల దృష్ట్యా ఒకసారి ఇలాంటి పాలనా సంస్కరణలు చేపట్టవలసి ఉంది.

ఈ కళాకారులు తాగే బీడీలపై, ఇతర వస్తువులపై జీఎస్టీలు, ఇతర పన్నులు వసూలు చేసే పాలకులు వీరిని పట్టించుకొని వారి జీవితాలను పట్టాలపైకి ఎక్కించలేరా? ప్రజల గురించి అనేక ఉద్యమాలు చేసేవారు వారి ఎజెండాలోకి ఇకనైనా వీరికి స్థానం కల్పిస్తారా? మామూలు మనుషుల గురించి, నిత్యం దోపిడీకి గురయ్యే ఇలాంటి 'చిన్న' మనుషుల గురించి మాట్లాడడం నామోషీగా భావించవద్దు. ఈ వ్యవస్థకు నిత్యం బలయ్యేవారి గౌరవం, గుర్తింపు, అస్తిత్వం కాపాడడమే సోదర పౌరధర్మం.

• జయధీర్ తిరుమలరావు
'ఆద్యకళ' మ్యూజియం

(ఆగస్టు 8న హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉపకుల/తెగల వారితో ముఖాముఖి. సాయంత్రం 6 గంటలకి ఆడిటోరియంలో జరిగే సమావేశంలో రాష్ట్ర మంత్రి సీతక్క, సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి బి. సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు.)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com



పదోన్నతుల లెక్క తేలింది..

- 73 మంది స్కూల్ అసిస్టెంట్లకు హెడ్మాస్టర్లుగా..
- 273 మంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా..

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతుల లెక్క తేలింది. వరంగల్ జిల్లాలో మొత్తం 25 మంది స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెడ్మాస్టర్లుగా పదోన్నతులు కల్పించనున్నారు. అయితే నల్లబెల్లి మండలంలోని ముచ్చింపుల జడ్పీహెచ్ఎస్, పర్వతగిరి మండలంలోని వడ్లకొండ జడ్పీహెచ్ఎస్ జీరో స్ట్రెంత్ పాఠశాలలు కావడంతో రెండు పోస్టులను మినహాయించారు. దీంతో వరంగల్ జిల్లాలో మొత్తం 23 మంది స్కూల్ అసిస్టెంట్లు గెజిటెడ్ హెడ్మాస్టర్లుగా పదోన్నతులు పొందనున్నారు. 127 మంది ఎస్జీటీ తత్సమాన కేటగిరి నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందనున్నారు. హనుమకొండ జిల్లాలో మొత్తం 50 మంది స్కూల్ అసిస్టెంట్లు గెజిటెడ్ హెడ్మాస్టర్లుగా పదోన్నతులు పొందనుండగా 146 మంది ఎస్జీటీ తత్సమాన కేడర్ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందనున్నారు. మొత్తంగా రెండు జిల్లాల్లో సుమారుగా 350మంది ఉపాధ్యాయులు వివిధ కేడర్లలో పదోన్నతులు పొందనున్నారు. ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియకు హైకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులతో తాత్కాలిక బ్రేక్ వేసింది. ఈ నెల 11న వాదన పూర్తయి ఉత్తర్వులు ఇచ్చిన తర్వాతనే పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా బుధవారంతో హెడ్మాస్టర్ల పదోన్నతులకు వెబ్ ఆప్షన్ల ఎంపిక పూర్తి చేసి గురువారం (ఆగస్టు 7న) పదోన్నతులు కల్పించాల్సి ఉండగా ఇప్పుడు కోర్టు ఉత్తర్వులతో ఆ ప్రక్రియ 11 వరకు నిలిచిపోయింది.

పాఠశాలల్లో ఆటల పండుగ



- రెండు నెలల పాటు కొనసాగనున్న పోటీలు
- మండల, జోనల్, జిల్లా స్థాయిల్లో నిర్వహణ
- ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అవకాశం
- అండర్ -14, అండర్ -17 విభాగాల్లో పోటీలు
- ఎస్జీఎఫ్ సెక్రెటరీల నియామకం ఎప్పుడు?
- హనుమకొండలో సెక్రెటరీ పోస్టు కోసం ఐదుగురు పోటీ

ఈ నెల రెండోవారం నుంచి షురూ

హనుమకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆటల పండుగ మొదలుకానున్నది. రెండు నెలల పాటు అన్ని పాఠశాలల్లో ఆటలే ఆటలు. విద్యార్థులు ఈ ఆటల పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. కిందటేడు కన్నా ఈ సారి మరింత ఘనంగా ఆటల పోటీలను నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ సమాయత్తం అవుతోంది. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే. క్రీడల వల్ల విద్యార్థులు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందుతారు. ప్రస్తుత పోటీ ప్రపంచలో క్రీడల కన్నా, చదువుకే తల్లిదండ్రులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అనేకమంది విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న క్రీడా ప్రతిభ వెలికిరావడం లేదు.

క్రీడల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారిని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేట్లు చేయడానికి పాఠశాల స్థాయి నుంచే సానబట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తోంది. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన నూతన క్రీడా పాలసీలోనూ పాఠశాల స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.

రెండో వారం నుంచి..

ఇందులో తొలిమెట్టుగా అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి ఆటల పోటీలను ఈనెల రెండోవారంలో పూర్తి చేయాలని రాష్ట్ర విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. జోనల్ స్థాయి పోటీలు ఆగస్టు మూడో వారంలో పూర్తి చేయాల్సి ఉంటుంది. సెప్టెంబర్ రెండో వారంలో జిల్లా స్థాయి పోటీలను నిర్వహించాలని విద్యా శాఖ ఆదేశించింది. ఆయా పోటీలు ఒక్కోస్థాయిలో రెండు రోజుల పాటు కొనసాగుతాయి.

ఇందు కోసం క్రీడా మైదానాలను సిద్ధం చేస్తున్నారు. క్రీడా పోటీల నిర్వహణకు ప్రభుత్వ పాఠశాలల్లోని కోచ్‌లకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను మండల, జోనల్ స్థాయిలో నిర్వహించి ఇందులో విజేతలైనవారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అండర్ -14, అండర్ -17 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు.

ఎస్జీఎఫ్ కార్యదర్శుల నియామకం ఎప్పుడు?

ఒక పక్క పాఠశాలల్లో ఆటల పోటీల నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయించిన గడువు దగ్గర పడుతున్నా.. వీటి నిర్వహణను పర్యవేక్షించాల్సిన స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) కార్యదర్శులు లేరు. ఆరు జిల్లాల్లో ప్రస్తుతం ఉన్న ఎస్జీఎఫ్ కార్యదర్శుల రెండేళ్ల కాలపరిమితి ముగిసింది. వీరి స్థానంలో కొత్త కార్యదర్శిని నిమించాల్సి ఉంది. హనుమకొండ జిల్లాలో ఈ పోస్టు కోసం ఇప్పటికే అయిదుగురు ముందుకు వచ్చారు. వీరి దరఖాస్తులను పరిశీలించి వీరిలో అర్హులైన ఒకరిని ఎంపిక చేయాల్సి ఉంది. కానీ ఈ ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు. కొత్త ఎస్జీఎఫ్‌ను నియామకమైతే తప్ప ఆటల పోటీల నిర్వహణకు సంబంధించిన కార్యప్రణాళిక ఖరారు కాదు. క్రీడల పట్ల ఆసక్తి ఉండడమే కాకుండా క్రీడా నేపథ్యం ఉండి, పోటీలను సమర్థవంతంగా నిర్వహించగలిగే వ్యక్తినే ఎస్జీఎఫ్ సెక్రెటరీగా నియమించేందుకు జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఎస్జీఎఫ్ సెక్రెటరీ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులైన ఒకరిని నాలుగైదు రోజుల్లో నియమించనున్నట్లు తెలుస్తోంది. వరంగల్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో సైతం కొత్త ఎస్జీఎఫ్ సెక్రెటరీల నియామకం జరగలేదు. హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కేజీబీలు, ఆదర్శ పాఠశాలలు మొత్తం 819 ఉన్నాయి. వీటిలో 1,13,136మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.



మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

రేవంత్‌రెడ్డి ఆంధ్ర కోవర్టు

- ఏపీకి నీళ్లు ఇచ్చేందుకే బనకచర్లకు ఓకే చెప్పారు..
- కాళేశ్వరంపై సమగ్ర సమాచారం ప్రజలకు తెలపాలి
- ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఏకపక్షం
- మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నరేందర్

6

చారిత్రక ఆలయాలను అభివృద్ధి చేయాలి

- ఇందుకోసం ఉమ్మడి జిల్లాకు రూ.185కోట్లు ఇవ్వాలి
- ఎంపీ కావ్యతో పాటు ఎమ్మెల్యేల విజ్ఞప్తి
- కేంద్ర పర్యాటక శాఖ మంత్రికి వినతి పత్రం
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి
- 'ప్రసాద్' పథకం కింద పునరుద్ధరణకు హామీ




కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

హనుమకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చారిత్రక ఆలయాలు, కాకతీయ వారసత్వ సంపదను పునరుద్ధరించాలని ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్యే బస్వరాజు సారయ్యతో కలిసి వరంగల్ ఎంపీ కడియం కావ్య కేంద్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను అభ్యర్థించారు. బుధవారం వీరు ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని పలు ఆలయాల అభివృద్ధిపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. చారిత్రకంగా ఎంతో సుప్రసిద్ధమైన ఈ ఆలయాల అభివృద్ధికి రూ.185కోట్లను ఇవ్వాలని కోరారు. తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలంటే ఆలయాల పునరుద్ధరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. హనుమకొండ వేయిస్తంభాల గుడి కల్యాణ మండపంలో మిగిలిపోయిన మరమ్మతు పనులు, విగ్రహ ప్రతిష్ఠాపన, పార్కింగ్, శౌచాలయాల కోసం రూ.75కోట్లు, భద్రకాళి ఆలయంలోని మహామండప పునర్నిర్మాణం, పర్యాటక సదుపాయాల కోసం రూ.100కోట్లు, చిల్పూర్‌లోని శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయం (తెలంగాణ తిరుపతి)లో భక్తుల వసతికి గదులు, కొండపైకి రవాణామార్గం కోసం రూ.9.97కోట్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని నపాక ఆలయం, కోటగుళ్లు, రెడ్డిగుడి ప్రత్యేక శిలపై నిర్మితమైన ఆలయాల పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని కోరారు. అలాగే వరంగల్ కోటలో ఉన్న 14 ఆలయాల పునరుద్ధరణ పనులకు కూడా నిధులు ఇవ్వాలని కోరారు. మొత్తం రూ.185 కోట్లతో ఆలయాల పునరుద్ధరణ పనులు చేపడితే వరంగల్ నగరం ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని అన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రాచీన ఆలయాలను ప్రసాద్ పథకంలో చేర్చుతానని హామీ ఇచ్చారు. ఇందుకు ఎంపీతో పాటు ఎమ్మెల్యేలు కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్యతో పాటు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. అలాగే రైల్వేస్టేషన్ ఆవరణలో నూతన బస్‌స్టేషన్ కోసం స్థలం కేటాయించాలని, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధి చేయాలని కోరారు. కాజీపేట బస్‌స్టేషన్ ఏర్పాటు ఆవశ్యత గురించి వివరించారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించారని, ప్రజా రవాణా దృష్ట్యా బస్‌స్టాండ్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు.



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

జయశంకర్ ముందుచూపు గొప్పది

- సామాజిక, ప్రజాస్వామ్య తెలంగాణను ఆకాంక్షించారు
- దక్షిణాదిలో తెలంగాణ రాష్ట్రం వెనుకబాటులో ఉంది..
- హెచ్‌సీయూ రిటైర్డు ప్రొఫెసర్ నరసింహారెడ్డి

కేయూ క్యాంపస్ ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ వెనుకబడి ఉందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం రిటైర్డు ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి అన్నారు. బుధవారం కేయూ సెనేట్ హాల్‌లో ప్రొఫెసర్ జయశంకర్ 13వ స్మారక ఉపన్యాసం జరిగింది. వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన 'దక్షిణ భారతదేశం సామాజిక అభివృద్ధిలో వివక్ష' అనే అంశంపై ఉపన్యాసం జరిగింది. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన నరసింహారెడ్డి మాట్లాడుతూ.. విద్య, వైద్యం ప్రజాశ్రేయస్సులో కీలకమన్నారు. జయశంకర్ సామాజిక, ప్రజాస్వామ్య తెలంగాణను అకాంక్షించారని తెలిపారు. అసమానతలు రూపుమాపేందుకు కృషి చేశారని అన్నారు. మౌలికవసతులు, (మిగతా 6లో..)

గొప్ప ఉద్యమకారుడు జయశంకర్

- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్



జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్

హనుమకొండ టౌన్, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు కృషిచేసిన గొప్ప వ్యక్తి జయశంకర్ అని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ కొనియాడారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో జయశంకర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్, గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌లతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, జయశంకర్ కుటుంబ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకే అంకితం

తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు, మలిదశ ఉద్యమానికి దిక్సూచిగా నిలిచిన జయశంకర్ జీవితం తెలంగాణకే అంకితమని బీఆర్ఎస్ (మిగతా 6లో..)

గద్దర్ స్ఫూర్తిని కొనసాగించాలి...

- జీవితమంతా ప్రజల కోసమే వెచ్చించాడు
- ప్రముఖ రచయిత, ఓయూ ప్రొఫెసర్ కంచ ఐలయ్య
- గద్దర్ విగ్రహం ఏర్పాటుకు కృషి: 'గద్దర్ గళం' ఫౌండర్ సత్తయ్య



గద్దర్ వర్ధంతి సభలోమాట్లాడుతున్న కంచ ఐలయ్య

బాలసముద్రం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా గాయకుడు గద్దర్ స్ఫూర్తిని యువతరం కొనసాగించాలని ప్రముఖ రచయిత, ప్రొఫెసర్ కంచ ఐలయ్య పిలుపు నిచ్చారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బుధవారం గద్దర్ ద్వితీయ వర్ధంతి సభను 'గద్దర్ గళం' ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రముఖ రచయిత పసునూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన కంచ ఐలయ్య మాట్లాడుతూ దేశ సాంస్కృతిక చరిత్రలో చెరగని స్థానం గద్దర్‌ది అని అన్నారు. జీవించి ఉన్నంత కాలం ప్రజల కోసమే పోరాటం చేయడంతోపాటు తన ఆట పాటలతో చైతన్యపర్చిన స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. తొలిరోజుల్లో బుల్లెట్‌ను నమ్ముకున్నప్పటికీ ఆ తర్వాత అంబేద్కర్ మార్గంలోకి తన ఆలోచన విధానాన్ని మల్చుకొని బ్యాలెట్‌నే నమ్మాడని అన్నారు. శ్రమ నుంచి పాటలు పుడతాయని, ఉత్పత్తి కులాల నుంచి సంపద పుడుతుందని స్పష్టం చేసిన గాయకుడు గద్దర్ అని అన్నారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ దేశంలో చదువుకున్న వారే ప్రజలను మోసం చేశారని, చదువురాని నిరక్షరాస్యులు, ఏ మోసం తెలియని వారు గద్దర్‌ను నమ్మేవారని పేర్కొన్నారు. అదే విషయాన్ని తన బాణీతో పాటలు కట్టి పాడుతూ బహుజనులను చైతన్యపర్చిన మహనీయుడని కొనియాడారు. గద్దర్ గళం ఫౌండర్ చైర్మన్ కొల్లూరి సత్తయ్య మాట్లాడుతూ గద్దర్ పీడిత తాడిత వర్గాల కోసం పోషించిన పాత్ర అనిర్వచయమని అన్నారు. చారిత్రక వరంగల్‌లో గద్దర్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్, టీజీ వీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్‌కుమార్, బీఎస్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ కాడపాక రాజేందర్, ప్రజా సంఘాల నాయకులు రామంచ శ్రీను, సాయిని నరేందర్, ప్రొఫెసర్ వీరస్వామి, అసనాల శ్రీనివాస్, బండి మొగిలి, టీఎస్‌స్వామి, మన్నె బాబురావు, రామంచ భరత్, తాళ్ల సునిల్ తోపాటు విద్యార్థులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కేంద్రం ఆమోదం తెలుపాలి

రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో పాల్గొన్న మంత్రి

వరంగల్‌సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కేంద్రం ఆమోదం తెలుపాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ డిమాండ్ చేశారు. బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని కోరుతూ జరిగిన ధర్నాలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రాహుల్‌గాంధీ ప్రజలకిచ్చిన వాగ్దానం మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సంకల్పిస్తే బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. 70 సంవత్సరాల చరిత్రలో ఎవరూ చేయని సాహసం చేసి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఈ ప్రభుత్వం రాష్ట్రంలో కుల గణన చేసి బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని తీర్మానం చేసి పంపితే కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చుకుంటే ప్రధానమంత్రికి ఏమి ఇబ్బందని ప్రశ్నించారు.

బీసీలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. తెలంగాణకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కలిసి వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె హితవు పలికారు. లేదంటే తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్‌లకు తగిన గుణపాఠం బీసీలే చెబుతారని మంత్రి స్పష్టం చేశారు. బీసీలు ఆర్థిక, సామాజిక, ఉద్యోగ, ఉపాధి, రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని, కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో జరిగే ఈ పోరాటానికి బీఆర్ఎస్, బీజేపీ ప్రజాప్రతినిధులు సైతం మద్దతు తెలుపాలని కోరారు.



ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లు కోసం జరిగిన ధర్నాలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

10న జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న హనుమకొండ జేఎన్ఎస్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి వీరన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ జిల్లాస్థాయి సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో నిర్వహించనున్న ఎంపికపోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 23, 24 తేదీల్లో కుమరంభీం జిల్లా కేంద్రంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు ఈనెల 10న ఉదయం 9గంటలకు జేఎన్ఎస్‌లోని బాల్‌బ్యాడ్మింటన్ కోర్టులో రిపోర్టు చేయాలని వీరన్న ప్రకటలో పేర్కొన్నారు. మరిన్నివివరాలకు సెల్ 9849201467 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

రాఖీ పర్వదినానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హనుమకొండ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వరలక్ష్మి వ్రతం, రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 8నుంచి 11వ తేదీ వరకు వరంగల్ రీజియన్ పరిధిలోని 9డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు బుధవారం ఆర్ఎం డి.విజయభాను ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ బస్టాండ్ నుంచి ఉప్పల్ వరకు అదనపు బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 7న 70 బస్సులు, 8న 130 బస్సులు, 9న 105 బస్సులు, 11న 130 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సిబ్బంది ప్రయాణికుల రద్దీని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులు ఏర్పాటుతోపాటు టెంట్లు, తాగునీటి సదుపాయం, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనపు బస్సులు ప్రయాణికుల రద్దీని బట్టి 24 గంటలు రద్దీని పర్యవేక్షిస్తూ బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అక్కా చెల్లెళ్ల అనుబంధాన్ని బలోపేతం చేసే పండుగ రాఖీ పండుగకు మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి కేయూ హాస్టళ్లు, మెస్‌లకు సెలవులు

కేయూ క్యాంపస్ ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో హాస్టళ్లు, మెస్‌లకు ఆగస్టు 8 నుంచి 18 వరకు షార్ట్‌టర్మ్ సెలవులను ప్రకటించారు. ఈ మేరకు కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ సర్క్యులర్ విడుదల చేశారు. సెలవులలో హాస్టల్‌లో రిపేర్, రెనోవేషన్ పనులు చేపడుతామని వెల్లడించారు. విద్యార్థులు తమ గదుల్లోని సామానులను ఖాళీ చేయాలని సూచించారు. ఆగస్టు 15 వరకు మెస్, హాస్టళ్లను ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. హాస్టళ్ల అడ్మిషన్లను కళాశాల అడ్మిషన్లతో అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. నియమిత రెన్యూవల్ ఫీజులు చెల్లించుకున్న వారికి వసతి, మెస్ సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు.

జయశంకర్ ముందుచూపు గొప్పది

(5వ పేజీ తరువాయి)



మాట్లాడుతున్న హెచ్‌సీయూ ప్రొఫెసర్ నరసింహారెడ్డి

తలసరి ఆదాయం, స్థూల జాతీయోత్పత్తిని అభివృద్ధిగా చెప్పలేమన్నారు. అన్ని వర్గాలకు మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. తెలంగాణలో సంక్షేమ దృక్పథం రావాలని అన్నారు. యువతలో సామర్థ్యం లోపిస్తోందన్నారు. అభ్యసన స్థాయి పెరగాలని అన్నారు. బాలికలు, మహిళల్లో రక్తహీనత పెరుగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆల్కహాల్ వినియోగం పెరుగుతోందన్నారు.

శాసనమండలి డిప్యూటీ స్పీకర్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ తెలంగాణ స్వాప్నికుడు, మానవతావాది జయశంకర్ అని కొనియాడారు. జయశంకర్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో 12 స్మారక ఉపన్యాసాలు నిర్వహించినట్లు తెలిపారు. కేయూ లో జయశంకర్ పేరుతో బంగారు పతకాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. రిటైర్డు ప్రొఫెసర్, ట్రస్టు వైస్ చైర్మన్ ఎ.శంకరయ్య మాట్లాడుతూ.. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో జయశంకర్ ప్రావీణ్యుడని అన్నారు. వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కేయూ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు సిద్ధమవుతున్న క్రమంలో నిధులు ప్రభుత్వం ఇవ్వాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. జయశంకర్ స్ఫూర్తి గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు, విభాగాధిపతులు, ఉద్యోగులు, విద్యార్థి నేతలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సర్వీస్‌ల మంజూరు వేగవంతం చేయాలి

● టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సర్వీసుల మంజూరును వేగవంతం చేయాలని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిల్‌ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఎస్ఏవోలు, ఏఏవోలతో హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. హెచ్‌టీ సింగిల్ విండో పాలసీలో భాగంగా టీజీ ఐపాస్, నాన్ టీజీ ఐపాస్ సర్వీస్‌ల మంజూరు కాలపరిమితికిలోబడి త్వరగతిన మంజూరుచేయాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలున్న లూజ్‌లైన్లు, వంగిన స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ల గద్దెలను గుర్తించి అందుకు తగినట్టుగా కార్యాచరణ రూపొందించుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉండే సిబ్బంది విధిగా భద్రతా పరికరాలు ధరించాలని సూచించారు. పొలంబాట కార్యక్రమం ఉధృతంగా చేపట్టి విద్యుత్ ప్రమాదాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ల తరలింపు డిపార్టుమెంట్ వాహనంలోనే తరలించాలన్నారు. డైరెక్టర్లు మధుసూదన్, ప్రభాకర్, సీఈలు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుమల్‌రావు, రావ్‌చౌహాన్, అశోక్, వెంకటరమణ, చరణ్‌దాస్‌లు పాల్గొన్నారు.




సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

దేవాదుల పైప్‌లైన్ లీక్

ఊవ్వెత్తున ఎగిసిన నీరు

శాయంపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకోడెపాక శివారులో దేవాదుల పైప్‌లైన్ బుధవారం లీకైంది. దీంతో గంటల తరబడి నీరు వృథాగా పోయింది. దీంతో వాటర్ పౌంటైన్‌ను తలపించింది. పైప్‌లైన్ నుంచి నీరు ఆకాశాన్ని తాకుతుందా అనే విధంగా ఎగిసిపడింది. అయితే లీకైన చోట 11 కేవీ విద్యుత్ లైన్ ఉండడం, లైన్‌పై భారీగా నీరు ఎగిసిపడడంతో ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అని స్థానిక రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయంపై దేవాదుల ఏఈ కార్తీక్‌ను ఫోన్‌లో సంప్రదించగా పెద్దకోడెపాక తాళ్ల వద్ద లీకేజీ అవడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి, మోటార్‌లను ఆఫ్ చేయడం జరిగిందని, బ్యాక్ ఎండ్ వాటర్ పోవడానికి సమీపంలో ఉన్న వాల్స్ ఓపెన్ చేయడం జరిగిందన్నారు. నీరు మొత్తం పోయాక మరమ్మతు చేయిస్తామన్నారు.



పెద్దకోడెపాక శివారులో వృథాగా పోతున్న నీరు

సైకియాట్రీ వైద్యుడిపై విచారణ?

ఎంజీఎంలో పీజీ వైద్యులను వేధిస్తున్నాడని ఆరోపణలు

వరంగల్ మెడికల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి మానసిక విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ వైద్యుడి ప్రవర్తనపై కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఓ విచారణ కమిటీని నియమించినట్లు విశ్వసనీయ సమాచారం. సదరు సైకియాట్రీ వైద్యుడు పీజీల పట్ల అసభ్యకరంగా, అనుచితంగా మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది. అర్ధ రాత్రి వేళ అసభ్యకరమైన మొబైల్ సందేశాలను కూడా పంపుతున్నట్లు సమాచారం. అతడి ఆగడాలు భరించలేక కేఎంసీ ప్రిన్సిపాల్‌కు పీజీలు మొర పెట్టుకున్నట్లు సమాచారం.

నిత్యం బాడీ షేమింగ్‌కు పాల్పడుతున్నట్లు పీజీ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మగ, ఆడ పీజీ విద్యార్థులు మాట్లా డుకుంటే అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు సమాచారం. విద్యాబుద్ధులు నేర్పాల్సిన అధ్యాపకుడే విద్యార్థులను వేధించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పీజీ విద్యార్థిని ప్రీతి ఘటన మరవకముందే పాఠాలు చెప్పే ప్రొఫెసర్ వేధింపులకు దిగుతున్న సంఘటనను కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. ఐదుగురు సభ్యులతో విచారణ కమిటీ నివేదిక ఆధారంగా సదరు వైద్యుడిపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రైలు కిందపడి సెంట్రింగ్ కార్మికుడి ఆత్మహత్య



బర్ల మధు (ఫైల్)

గిర్మాజీపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్-కాజీపేట రైల్వే మార్గంలోని దర్గా రైల్వేగేటు వద్ద బుధవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో బర్ల మధు(27) అనే సెంట్రింగ్ కార్మికుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపారు. హనుమకొండ జిల్లా కాజీపేట దర్గా గాంధీనగర్‌కు చెందిన బర్ల మధు సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నట్లు సీఐ చెప్పారు. మంగళవారం రాత్రి ఇంట్లో భోజనం చేసి ఇంటి మిద్దెపై భాగంలో నిద్రించిన మధు.. వ్యక్తిగత కారణాలతో ఇంటికి సమీపంలో ఉన్న రైల్వే గేటు వద్ద బుధవారం తెల్లవారుజామున రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం మిద్దెపై మధు కనిపించకపోవడం, దర్గా రైల్వేగేటు వద్ద మృతదేహం ఉందనే సమాచారంతో కుటుంబసభ్యులకు అక్కడికి వెళ్లి చూడగా మధుగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. ఎంజీఎం మార్చురీలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తండ్రి బర్ల కుమారస్వామికి అప్పగించి, హెడ్‌కానిస్టేబుల్ ఎస్.రవీందర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. కాగా, వ్యక్తిగత కారణాలతోనే మధు ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి ఫిర్యాదు చేశాడని తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు సమన్వయంతో చేయాలి

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15వతేదీన నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవం ఏర్పాట్లను వివిధశాఖల అధికారులు సమన్వయంతో చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో బుధవారం స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, మునిసిపల్, జిల్లా గ్రామీణాభివృద్ధి, వైద్య, ఆరోగ్య, విద్యుత్, అగ్నిమాపక, తదితర శాఖల అధికారులు కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. హనుమకొండలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఆగస్టు 15వ తేదీన నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవం రోజున వేదిక, బారికేడింగ్, స్టాల్స్ ఏర్పాటు, విద్యుద్దీపాల అలంకరణ, తాగునీటి సౌకర్యం, గ్యాలరీ, సాంస్కృతిక కార్యక్రమాలు, తదితర ఏర్పాట్లన్నీ 14వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు.

వివిధ డిపార్ట్‌మెంట్ల వారిగా ఆయా శాఖలకు సంబంధించిన అంశాలతో రూపొందించిన స్టాల్స్‌ను ఆకట్టుకునేలా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, డీఆర్‌డీఓ మేన శ్రీను, సీపీఓ సత్యనారాయణరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

నిర్లక్ష్యంగా వాహనం నడిపిన డ్రైవర్‌కు ఏడాది జైలు

వరంగల్ లీగల్, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): అతి వేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ మొదటి అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రావణ స్వాతి చింతాడ బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. 2020 అక్టోబరు 9న ఉదయం 5 గంటలకు హనుమకొండ పోస్టల్ కాలనీకి చెందిన బీటెక్ చదువుతున్న విద్యార్థి బోడ జశ్వంత్ హైదరాబాద్ నుంచి హనుమకొండకు ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్నాడు. అదే సమయంలో రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియా వద్ద గల హనుమాన్ టెంపుల్ దగ్గరకు రాగానే ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా యూ టర్న్ తీసుకున్నాడు. ఈ క్రమంలో అటువైపుగా వస్తున్న జశ్వంత్ ద్విచక్రవాహనం ఆటో తగిలి కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో రోడ్డుపై వెళ్తున్న వారు చూసి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా ఎంజీఎంకు తరలించారు. చికిత్సపొందుతూ ఆస్పత్రిలో మరణించాడు.

విషయం తెలు సుకున్న మృతుడి తండ్రి బోడ హరిలాల్ ప్రమాదానికి కారణమైన కాజీపేట రహమత్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ మరుపట్ల తారయ్యపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధి స్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ వి.రాజేష్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారులుగా ఎస్సై కె.కుమారస్వామి, సీఐ పి.కిషన్, దర్యాప్తు అధికారులుగా వ్యవహరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్ . దుర్గాబాయి కేసు వాదించారు.

గొప్ప ఉద్యమకారుడు జయశంకర్

(5వ పేజీ తరువాయి)

హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ సమాజాన్ని ఉద్యమ బాటలో నడిపిన గొప్ప వ్యక్తి శయశంకర్‌సార్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు చెన్నం మధు, సంకు నర్సింగరావు, నాయకులు జనార్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతి



అజ్మీరా బేగం(ఫైల్)

కరీమాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ అండర్ రైల్వేగేటు ప్రాంతం శంభునిపేట గిరిప్రసాద్ నగర్‌లో బుధవారం రాత్రి ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ ఉపాధ్యాయురాలు మృతి చెందింది. వివరాల్లోకి వెళితే... హనుమకొండ వేయిస్తంభాల దేవాలయం ప్రాంతంలో ఉంటున్న అజ్మీరా బేగం(40) దూపకుంట రోడ్‌లో గల మైనారిటీ గురుకుల పాఠశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉర్దూ టీచర్‌గా పనిచేస్తుంది. బుధవారం సాయంత్రం విధులు ముగించుకొని ఆటోలో హనుమకొండకు వచ్చేందుకు పాఠశాల వద్ద ఆటో ఎక్కింది. అదే ఆటోలో మరో ముగ్గురు టీచర్లు కూడా ఉన్నారు. ఆటో సరిగ్గా గిరిప్రసాద్ నగర్‌కు చేరుకోగానే రోడ్డుపై ఓ కుక్క అడ్డు రావడంతో డ్రైవర్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో అజ్మీరా బేగం తలకు బలమైన గాయాలు కావడంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ అజ్మీరా బేగం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మరో ఉపాధ్యాయురాలు ఆఫ్రీన్‌కు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. కాగా, ఆటోడ్రైవర్ పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ప్రమాద ఘటనపై మిల్స్‌కాలనీ పోలీసులను అడుగగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే పెద్ది జన్మదిన వేడుకలు

హనుమకొండ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డిని దాస్యం వినయ్ భాస్కర్ శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పేరుకారి శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి ఆంధ్ర కోవర్టు

- ● ఏపీకి నీళ్లు ఇచ్చేందుకు బనకచర్లకు ఓకే చెప్పారు
- ●కాళేశ్వరంపై సమగ్ర సమాచారం ప్రజలకు తెలపాలి
- ●ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఏకపక్షం
- ●మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నరేందర్

హనుమకొండ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలకు బూటకపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఆంధ్ర కోవర్టుగా మారి, ఆంధ్రకు నీళ్లు ఇచ్చేందుకు బనకచర్లకు ఓకే చెప్పారని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ ఆరోపించారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కుట్రపూరితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు, బీఆర్ఎస్ నేతలపై దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత 420 హామీలు, ఆరు గ్యారంటీలు ఇచ్చి అమలు చేతగాక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని దమ్మూ, ధైర్యం ఉంటే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగంపై ప్రమాణం చేసి సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. ఘోష్ కమిషన్ ఇచ్చింది కేవలం నివేదిక మాత్రమేనని, కమిషన్‌కు రాజ్యాంగబద్ధత లేదని, కోర్టు తీర్పు కాదని తెలిపారు. కాళేశ్వరంపై సమగ్ర సమచారం ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. కాళేశ్వరంలో మూడు పిల్లర్లు కుంగితే సరిచేయకుండా మొత్తం ప్రాజెక్టునే బద్నాం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజల కోసమే జీవించే నేత కేసీఆర్ రైతాంగం మేలు కోరి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే కేసీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నదని విమర్శించారు. కాళేశ్వరం వేదికగా ప్రజా గొంతుకలను ప్రజాస్వామ్య వాదులను ఏకం చేసి కాళేశ్వరం ప్రయోజనాలు ప్రపంచానికి చాటి చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు చెన్నం మధు, సంకు నర్సింగరావు, బీఆర్ఎస్ నాయకులు జనార్ధన్ గౌడ్, పులి రజినీకాంత్, హరి రమాదేవి, నయీమొద్దీన్, జానకీ రాములు, వినిల్‌రావు, దేవమ్మ, తస్లీమా, ఇస్మాయిల్, ఖలీల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2151	1521
పల్లికాయ (సూక)	6100	3450
పల్లికాయ (పచ్చిది)	5000	1575
కందులు	5818	3022
పెసళ్లు	7022	3022
పత్తి	7720	5300
పసుపు (కాడి)	11759	9534
పసుపు (గోల)	10600	8700
తేజ మిర్చి	11300	8500
తేజ ఏసీ	13500	11500
వండర్‌హాట్	12000	6000
వండర్‌హాట్ ఏసీ	15500	11500
యూఎస్341ఏసీ	13700	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	5000	3000

- వరంగల్ వ్యవసాయం

ఫొటో జర్నలిస్టులకు పోటీలు

వడ్డెపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో స్టాఫ్ ఫొటో జర్నలిస్టులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు వేముల నాగరాజు తెలిపారు. బుధవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీల్లో పాల్గొనే ఫొటోగ్రాఫర్లు ఈనెల 7 నుంచి 11 వరకు ఫొటోలు పంపించాలని కోరారు. బెస్ట్ న్యూస్ పిక్చర్, ఫీచర్, కల్చరల్ విభాగాలలో 8/12 సైజులలో ఫొటోలను పోటీల కోసం ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు, తృతీయ బహుమతి రూ.3వేలతో పాటు షీల్డ్, సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కన్సోలేషన్ బహుమతి కింద రూ.వెయ్యి నగదుతోపాటు షీల్డ్ అందిస్తామని స్పష్టం చేశారు.

పోటీలలో పాల్గొనే ఫొటో జర్నలిస్టులు ఫొటోలను నేరుగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించాలని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్లు : 90002 83008 / 99854 10386లలో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, ఫొటో జర్నలిస్టులు గోకారపు శ్యామ్, సంపెట సుధాకర్, వీరగోని హరీష్‌తో పాటు సీనియర్ జర్నలిస్టులు బొడిగె శ్రీను, వరప్రసాద్, బూర్ల నరేందర్, విష్ణు వర్ధన్, నయీంపాష తదితరులు పాల్గొన్నారు.



రికవరీ చేసిన సొత్తును చూపిస్తున్న పోలీసులు

చోరీ కేసులో ముగ్గురు మైనర్ల అరెస్టు

ములుగు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఓ వైన్స్ షాపులో చోటుచేసుకున్న చోరీ కేసులో ముగ్గురు మైనర్లను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సురేష్ వివరాలు వెల్లడించారు. ఈనెల 3న అర్ధరాత్రి ములుగు జిల్లా కేంద్రంలోని రెడ్డి వైన్స్ షాపులో చోరీ జరిగింది. క్యాంటీన్ గ్రిల్స్‌ను తొలగించి లోపలికి చొరబడి రూ.15 వేల విలువగల సిగరెట్ ప్యాకెట్లు తీసుకొని వైన్స్ షాపులోకి వెళ్లారు. కౌంటర్‌లో ఉన్న రూ 1.60 లక్షల నగదును, రూ. 22,200 విలువ గల మద్యం సీసాలను అపహరించారు.

సీసీ ఫుటేజ్ ఆధారంగా దొంగతనానికి పాల్పడిన ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకుని విచారించగా నిందితులు నేరాన్ని అంగీకరించారు. చోరీ చేసిన సొమ్ము నుంచి రూ. 2 వేల నగదు, రూ. వెయ్యి విలువ గల సిగరెట్ ప్యాకెట్లు, రూ. 2,320 విలువ గల మద్యాన్ని జల్సాలకు వాడుకున్నట్లు సీఐ తెలిపారు. మిగిలిన నగదు, మద్యం బాటిళ్లు, సిగరెట్ ప్యాకెట్లను రికవరీ చేశామన్నారు. నిందితులను జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరు పర్చినట్లు వెల్లడించారు.

ఆయారే తీజ్!

గిరిజన తండాల్లో సంబరాలకు రెడీ


వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని రామోజీ కుమ్మరి గూడెం తండాలో ఓ ఇంటి ముందు ఏర్పాటు చేసిన డాగ్డో (మంచె) పై బుట్టలు

- ఈ నెల 7న పెద్ద ఎత్తున పండుగ
- గిరిజనుల సంప్రదాయ పండుగల్లో తీజ్ ముఖ్యమైనది
- పెండ్లి కాని యువతులకు ఎంతో ప్రాధాన్యత
- దేవతలకు నైవేద్య సమర్పణ, జంతు బలులు
- రాఖీ పండుగకు ముందే నిర్వహించడం ఆనవాయితీ
- తొమ్మిది రోజుల పూజల తర్వాత చెరువులో నిమజ్జనం

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : తండాలకు తీజ్ సంబురం రానే వచ్చింది. తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా జరిగే పండుల్లో గిరిజనుల తీజ్ - (బతుకమ్మ) పండుగ ఒకటి. లంబాడ గిరిజనుల (బంజారాలు) సంప్రదాయ మొలకల పండుగను రాఖీ పౌర్ణమి పండుగకు ముందుగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పెండ్లి కాని ఆడ బిడ్డల ఆటపాటలు, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధాలు, భక్తి భావంతో చేసే తొమ్మిది రోజుల మేళవింపే నవ దాడేరి తీజ్ (బతుకమ్మ) పండుగ. శ్రావణ మాసంలో గిరిజనులు తీజ్ వేడుకలను తమ సంస్కృతిని ప్రతిబింబించేలా జరుపుకుంటారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న తండాల్లో దాదాపు తీజ్ ఉత్సవాలకు సిద్ధమవుతున్నారు.

ముగ్గురికి నివేదిన..

తీజ్ ఉత్సవాల్లో ముగ్గురికి నివేదన సమర్పించడం గిరిజనులకు సంప్రదాయంగా వస్తోంది. మేర మయాడీ, దండి యాడీ, సేవాభాయి వీరికి వారి సంప్రదాయాల్లో పూజలు చేసి తీజ్ ఉత్సవాలు చేస్తారు. పెండ్లి కాని యువతులు తమకు మంచి వరుడు రావాలని, తండావాసుల పాడి పంటలు, పిల్లా పాపలు చల్లంగా ఉండాలని వేడుకుంటూ తొమ్మిది రోజుల పాటు వీరిని ఆరాదిస్తారు. మేర మయాడీ, దండి యాడీలకు చివరి రోజు జంతు బలి ఇస్తారు. సేవా భాయికి బియ్యం, నెయ్యి, పాలతో నైవేద్యం తయారు చేసి పెడతారు. ఒక గుంతలో సేవాభాయికి సంబంధించిన బుట్టను వేసి నిప్పులతో దూపం వేసి సంప్రదాయ పద్ధతిలో పూజా తంతు నిర్వహిస్తారు.

ఏడుగురు దేవతలు..

లంబాడ తెగ గిరిజనులకు ఏడుగురు స్త్రీ దేవతలు ఉన్నారు. మెరామ, హింగళ, తుల్జా, కేంకాళి, తీజ్, మత్రాళ్, సీత్ల అనే దేవతల పేర్ల మీదుగా నిర్వహించేవి ప్రధాన పండుగలు. మెరామ దేవత తండాను రక్షిస్తే, తీజ్ దేవత పంటలను కాపాడుతుందని నమ్ముతారు. సీత్ల దేవత పశు సంపదను వృద్ధి చేస్తుందని, మత్రాళ్ దేవత పిల్లలు అంటు వ్యాధుల బారిన పడకుండా రక్షిస్తుందని విశ్వసిస్తారు. వివిధ ప్రాంతాల్లో ఉండే బంధువులంతా పండుగల సందర్భంగా కలుసుకుని ఆత్మీయత, అనురాగాలను పంచుకుంటారు. యుక్త వయస్సు ఉన్న గిరిజన యువతులు విద్య, ఉద్యోగ, సంసారిక జీవితం, పుట్టినింటితో పాటు మెట్టినిల్లు కూడా అష్ట ఐశ్వర్యాలు, సుఖ సంతోషాలతో తుల తూగాలంటూ ప్రతి ఏటా మొలకల పండుగ నిర్వహిస్తారు.

పండుగ విశిష్టత..

తీజ్ (బతుకమ్మ) పండుగను గిరిజనులు తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. ఆయా రోజుల్లో యువతులు రొట్టెలు, ఆకుకూరలు మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. బుట్టలు ఎందరు ఉంచినా అందులో ఐదుగురు యువతులు మాత్రమే నిష్ఠతో పూజ చేస్తారు. చివరి రోజు యువతులు మొలకల బుట్టలను తలపై పెట్టుకుని చెరువు వద్దకు వెళ్తారు. అప్పటికే అక్కడ సంప్రదాయ పద్ధతిలో రుమాలాలు తలకు చుట్టుకొని పెద్ద మనుషులు కూర్చుంటారు. యువతులు బుట్టల్లోని కొన్ని మొలకలను తలపాగాలో వేస్తారు. అనంతరం బుట్టలకు పూజలు చేసి చెరువులో వదులుతారు. తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత పెద్ద మనుషుల కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకుంటారు. యువతులను కూడా పీటలపై కూర్చోబెట్టి పెద్ద మనుషులు వారి కాళ్లు కడిగి ఆశీర్వదిస్తారు. పుట్టిన ప్రతి గిరిజన యువతికి పెండ్లి జరిగే నాటికి తీజ్ పండుగను ఆ కుటుంబ సభ్యులు నిర్వహించడం ఆనవాయితీ. దీనికి తోడు తీజ్ పండుగకు వచ్చిన ఆడపడుచు రాఖీ పండుగ రోజున తన సోదరుడికి రాఖీ కట్టి తిరిగి వెళ్లిపోవడం అనాధిగా వస్తున్న ఆచారమని చెపుతున్నారు.

రేగి చెట్టుకు పూజలు చేసి..

పెండ్లి కాని యువతులు రేగిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి తీజ్ వేడుకలను ప్రారంభిస్తారు. అంతకు ముందే తండాల్లో పెద్దలు ప్రతి ఇంటి నుంచి గోధుమలు సేకరించి రోజంతా నీళ్లలో నానబెడతారు. పెండ్లి యువతులు చిన్న చిన్న వెదురు బుట్టల్లో పుట్టమన్ను, గోవు పిడకల చూర్ణాన్ని కలిపి నాయక్ (పూజారి) ఇంటికి తీసుకు వస్తే ఆయన భార్య ఆ బుట్టలో నానబెట్టిన గోధుమలు వేసి అలుకుతుంది. అనంతరం పూజలు చేసి బుట్టలను డాగ్డో (మంచె) పై ఉంచి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక జలాలు చల్లుతూ ఉత్సవాలు నిర్వహిస్తారు.

ఐదు బుట్టలు ప్రత్యేకం..

తండాలో కొంత మంది కలిసి ఓ ఇంటి వద్ద డాగ్డో (మంచె)ను ఏర్పాటు చేస్తారు. దానిపై ఇంటికో బుట్టలో గోధుమలు వేసి బుట్టలన్నీ మంచెపై ఉంచుతారు. ఇలా తొమ్మిది రోజుల పాటు రోజు నీటిని పోస్తూ మొలకలు వచ్చేలా పెంచుతారు. పదో రోజున వైభవంగా తండా చెరువులో నిమజ్జనం చేసేందుకు తీసుకెళ్తారు. ఈ బుట్టల్లో ఓ ఐదు బుట్టలు ప్రత్యేకంగా ఉంటాయి. వాటిని ఇంటి బిడ్డలు మాత్రమే దించాలనేది వీరి నమ్మకం. వాటిని దించిన తర్వాతనే మిగతా బుట్టలను సైతం దింపి ఊరేగింపుగా తీసుకెళ్తారు.

ఆడబిడ్డల పండుగే తీజ్..



ఆడబిడ్డలను ఆరాధ్యంగా పూజించడమే తీజ్ పండుగను నిదర్శనం. పెండ్లి కానీ యువతులు మంచి మగడు రావాలని, పాడి పంటలు చల్లంగా ఉండి తండావాసులు సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుతూ నమ్ముకుంటాం. నా వయసు 75 సంవత్సరాలు మా తండ్రుల కాలం నుంచి ఈ పండుగను రాఖీ పౌర్ణమికి ముందు నిర్వహిస్తాం. యువతులు పెద్దల ఆశీర్వాదాలు తీసుకోవాలి. ఆడబిడ్డల కాళ్లు కడిగి ఆ ఇంటిల్లి పాది ఆశీర్వాదం తీసుకోవడమే ముఖ్యమైన ఘట్టం.

- భూక్యా ద్వాలీ, రామోజీ కుమ్మరిగూడెం తండా

గిరిజనుల ముఖ్యమైన పండుగ..



గిరిజనుల ముఖ్యమైన పండుగల్లో తీజ్ ఒకటి. తీజ్ ఉత్సవాలకు ప్రభుత్వం నిధులు ఇస్తే మరింత ఉత్సాహంగా జరుపుకుంటాం. కరువు కాటకాల నుంచి కాపాడాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని వేడుకుంటాం. ఈ నెల 7న చివరి రోజు ఎంతో దేదివ్యమానంగా, సంబరాలతో నిమజ్జనం చేస్తాం.

- బానోతు వీరన్న, ప్రైవేటు టీచర్

'పీవోపీ'కి చెబుదాం.. బై బై..




చిన్న వడ్డెపల్లి చెరువులో గణేష్‌ల నిమజ్జనం చేస్తున్న దృశ్యాలు (ఫైల్)

- చెరువుల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల నిమజ్జనంపై పీసీబీ నిషేధం
- ప్రత్యేక కొలనులను ఏర్పాటు చేసుకోవాలంటున్న పీసీబీ
- మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలంటున్న పర్యావరణ హితులు
- ఇప్పటి వరకు దృష్టి సారించని అధికారయంత్రాంగం

వరంగల్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27 నుంచి వినాయక నవరాత్రి వేడుకలు ప్రారంభమవుతున్నాయి.. ఈ నేపథ్యంలో గణపతి నిమజ్జనం కోసం తాత్కాలిక చెరువులు, కుంటలను ఏర్పాటు చేసుకుని అందులో నిమజ్జనం చేయాలని గత మంగళవారం రాష్ట్ర పర్యావరణ శాఖ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ జారీచేసిన ఆదేశాలు కనీసం సొంత జిల్లాలోనైనా అమలవుతాయా...? అని పర్యావరణ వేత్తలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణమండలి సవరించిన మార్గదర్శకాల ప్రకారం వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం తాత్కాలిక చెరువులు, కుంటలను ఏర్పాటు చేసుకొని అందులో నిమజ్జనం చేయాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) స్థానిక అధికారులను ఆదేశించింది. గణేష్ నవరాత్రి వేడుకల్లో పీవోపీ విగ్రహాలను కాకుండా బంక మట్టి విగ్రహాలను వినియోగించాలని పీసీబీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఇదిలా ఉంటే అధికార యంత్రాగం మాత్రం ఇంకా దృష్టి సారించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మట్టి వినాయకులే...

మట్టితో చేసిన వినాయకులను ప్రతిష్ఠించాలని పర్యావరణ హితులు కోరుతున్నారు. పీవోపీ విగ్రహాలను చెరువులలో నిమజ్జనం చేయవద్దని, చెరువులలోని చేపలు, ఇతర జలచరాలు మృత్యువాత పడుతన్నాయని చెరువుల పరిరక్షణ కమిటీ నాయకులు, మత్స్యకార సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆ చెరువుల నీటిని వినియోగిస్తే క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన రోగాల బారిన పడుతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పదివేల విగ్రహాలు

గ్రేటర్ వరంగల్ పరిధిలోనే చిన్నవి, పెద్దవి కలిపి సుమారు పదివేల విగ్రహాల వరకు నిమజ్జనం చేస్తారు. అందులో సగానికి పైగా పీవోపీ విగ్రహాలే ఉంటాయి. ముఖ్యంగా చిన్న వడ్డెపల్లి చెరువు, ఉర్సు చెరువు, పద్మాక్షమ్మ గుండం, కట్టమల్లన్న చెరువు, హనుమకొండ, కాజీపేట తదితర ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. ఏటా వేలాది విగ్రహాలు నిమజ్జనం చేయడం వల్ల ఆ చెరువుల్లో నీటిని వినియోగించే ఆస్కారం లేకుండా పోతోంది. చెరువు చుట్టుపక్కల ఉన్న వారికి కూడా ఈ నీటి ఊటతో బోరు బావుల్లో చేరుతోంది. తద్వారా వారికి కూడా క్యాన్సర్ బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. చేపలు చనిపోవడంతో మత్స్యకారులు ఉపాధిని కోల్పోతున్నారు. అందులోని చేపలను తిన్నా క్యాన్సర్ బారిన పడతారని పర్యావరణ వేత్తలు అంటున్నారు.

ఇంకా నెలరోజులే సమయం

వినాయక నవరాత్రుల వేడుకలకు నెలరోజుల సమయం మాత్రమే ఉంది. నవరాత్రులంటే యువతకు క్రేజ్. ఇప్పటికే సన్నాహాలు చేస్తున్నారు. పూజలందుకునే వినాయక విగ్రహం, మండపం, అలంకరణ, నిత్య పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఊరేగింపు, ప్రసాద వితరణ, నిధుల సేకరణ తదితర అంశాలపై ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

మత్స్యకారులు ఉపాధిని కోల్పోతున్నారు..



పీవోపీ విగ్రహాలు చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల కాలుష్య సాగరాల్లా మారుతున్నాయి. రసాయనాల వల్ల చెరువుల్లోని చేపలు చనిపోతున్నాయి. దీంతో మత్స్యకారుల ఉపాధి దెబ్బ తింటోంది. ప్రభుత్వం పీవోపీ విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేకంగా కొలను తయారు చేసి అందులో నిమజ్జనం చేయాలి. తద్వారా ఎవరికీ నష్టం జరుగకుండా ఉంటుంది.

- బయ్యా స్వామి, ముదిరాజ్ మహాసభ అర్బన్ అధ్యక్షుడు

క్యాన్సర్ లాంటి రోగాలను కొని తెచ్చుకోవడమే..




పీవోపీ విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయకూడదు. దాంతో క్యాన్సర్ లాంటి రోగాల బారిన పడుతారు. ఇప్పటికైనా అధికార యంత్రాగం స్పందించి పీవోపీతో తయారుచేసిన విగ్రహాలను చెరువుల్లో కాకుండా ప్రత్యేకంగా తయారు చేసిన కొలనులో వేసేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే పర్యావరణాన్ని పరిరక్షించ నట్లవుతుంది.

- పెరుమాళ్ల లక్ష్మణ్, చెరువుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు

తూములకు తూట్లు.. కాల్వలకు గండ్లు..

- లక్నవరం ఆధునికీకరణ పనులకు మోక్షమెప్పుడు?!
- లీకేజీలతో వృథాగా పోతున్న జలాలు
- పేరుకుపోయిన పూడిక, పిచ్చిమొక్కలు
- ఏటా ఎండుతున్న చివరి ఆయకట్టు


లక్నవరం చెరువు


లక్నవరం చెరువు తూములకు మరమ్మతు చేస్తున్న కార్మికులు(ఫైల్)

గోవిందరావుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తూట్లుపడ్డ కాల్వలు, ధ్వంసమైన తూములను శాశ్వత ప్రాతిపదికన మరమ్మతు చేసి రైతుల కష్టాలను తీర్చడంలో జాప్యం జరుగుతోంది. కాకతీయల ఏలుబడిలో 800 ఏళ్లక్రితం సాగునీటి కష్టాలను తీర్చేందుకు గోవిందరావుపేట మండలం బుస్సాపురం సమీపంలో కొండల నడుమ లక్నవరం చెరువును 555 హెక్టార్ల విస్తీర్ణంలో నిర్మించారు. వరదనీటిని ఒడిసిపట్టేందు కోసం వ్యూహాత్మకం నిర్ణయం తీసుకున్నారు. స్థానికంగా వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పటికీ ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల వరద లక్నవరం సరస్సులోకి చేరేలా ఏర్పాట్లు చేశారు. సరస్సు నీటినిల్వ సామర్థ్యం 2.1 టీఎంసీలు కాగా, ఆయకట్టులో అధికారికంగా 8794ఎకరాలు, అనధకారికంగా మరో 3వేల ఎకరాల భూములు సాగవుతున్నాయి. చెరువు ఆయకట్టు మొత్తానికి నీటిని అందించేందుకు 80కిలోమీటర్ల మేర కాల్వలను తవ్వించారు.

రంగాపూర్, కోట, శ్రీరాంపతి, నర్సింహులు-1, నర్సింహులు-2 వంటి మొత్తం ఐదు కాల్వలున్నాయి. నీటి తటాకాల నిర్మాణంలో అప్పటి పాలకులు తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఇందుకు నిదర్శనంగా లక్నవరం అద్దం పడుతోంది. నైజాం కాలంలో చివరిసారిగా మరమ్మతు జరిగిన లక్నవరం తూములు క్రమేణా శిథిలమైపోయాయి. ఏటా వర్షాలు, వరదలకు కాల్వలు కూడా ఎక్కడికక్కడ తెగిపోయాయి. చెరువులో పూడిక తీయకపోవడంతో సుమారు లక్ష క్యూబిక్ మీటర్ల మేర పేరుకుపోయింది. కాల్వలు కూడా గడ్డి, పిచ్చి మొక్కలతో మూసుకుపోయాయి. ఇలా ప్రతీ పంటకాలంలో 150 క్యూబిక్ మీటర్ల నీరు వృథాగా పోతోంది. ఈ నీరు వెయ్యి ఎకరాలను సాగులోకి తెస్తుందని అంచనా. లీకేజీలతో ముందే నీరు అడుగంటి చివరి ఆయకట్టుకు అందక ప్రతిసారీ సుమారు వందల ఎకరాల వరిపంట ఎండిపోయి రైతులు నష్టపోతున్నారు.

తాత్కాలిక మరమ్మతు

రాళ్లతో కట్టిన తూములను ప్రభుత్వం తాత్కాలికంగా మరమ్మతు చేయించింది. గత ఏడాది జూన్‌లో తూముల లోపల రాళ్లు కూలిపడ్డాయి. దీంతో నీళ్ల భారీగా లీకయ్యాయి. వెంటనే అప్రమత్తమైన నీటిపారుదల శాఖ అధికారులు రూ.22 లక్షలతో తాత్కాలికంగా మరమ్మతు చేశారు. నైజాం కాలంలో అవలంబించిన పద్ధతులను పాటిస్తూ డంగు సున్నం, కరక్కాయ, బెల్లం మిశ్రమాన్ని ఉపయోగించి రిపేర్ పనులు పూర్తి చేశారు. ఇటు వ్యవసాయ పరంగా, అటు పర్యాటకంగా బహుళ ప్రయోజనకారిగా ఉన్న లక్నవరం చెరువును పరిరక్షించేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

అటకెక్కిన ప్రతిపాదనలు

ములుగు జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు క్యాడ్‌వామ్(సీఎడీడబ్ల్యూఎం) పథకంలో భాగంగా 2017లో రూ.20 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారు. అయినా ఎలాంటి స్పందన కనిపించలేదు. ఏళ్లు గడుస్తున్నా కొద్దీ కాల్వలు, తూములు ధ్వంసం కావడం, వ్యయం అంతకంతకూ పెరగడంతో రెండేళ్లక్రితం సమగ్ర సర్వే చేసిన అధికారులు రూ.30 0కోట్లతో మరోసారి ప్రతిపాదనలు పంపారు. తూములకు స్కిల్‌వాల్ నిర్మించడంతోపాటు పంట కాల్వల్లో 80కిలోమీటర్ల మేర గైడ్ వాల్, వరద కాల్వలకు మత్తళ్లు, డ్రెయినేజీ నిర్మించడం, కట్టల బలోపేతం చేయడం, దుంపెల్లిగూడెం నుంచి బుస్సాపురం మీదుగా రంగాపూర్ వరకు పంటకాల్వ పొడవునా రోడ్డు నిర్మాణం చేపట్టడాన్ని ఆ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. సరస్సు వద్ద నిత్యం పర్యవేక్షణ కోసం 20 మంది లష్కర్లతో పాటు మరో ఇద్దరు వాచ్‌మన్లను నియమించాలని కూడా ప్రతిపాదించారు. కానీ ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు.

గోదావరి జలాలను మళ్లిస్తాం

లక్నవరం చెరువు సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. రామప్ప నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా గోదావరి జలాలను మళ్లించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాం. భూసేకరణ ప్రక్రియ పూర్తి కావచ్చింది. కాల్వలు, తూములను శాశ్వత ప్రాతిపదికన మరమ్మతు చేసి రెండు పంటలకు సరిపడా నీటిని అందిస్తాం.

- మంత్రి ధనసరి సీతక్క


లక్నవరం చెరువు నీటిని విడుదల చేస్తున్న మంత్రి సీతక్క (ఫైల్)

లక్నవరం అభివృద్ధికి ప్రణాళిక

లక్నవరం చెరువు అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాం. నీటి వృథాను పూర్తిస్థాయిలో అరికడితే ఆయకట్టులోని మొత్తం పొలాలలో ఏడాదికి రెండు పంటలు పండుతాయి. గత సంవత్సరం తూముల లోపల మరమ్మతులు చేపట్టి కొంతమేరకు లీకేజీలకు అడ్డుకట్ట వేశాం.

- శ్రీనివాస్, డీఈఈ

ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదాములను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెలవారి సాధారణ తనిఖీలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఈవీఎం గోదాములను తనిఖీ చేశారు. ఈవీఎం గోదాముల వద్ద పోలీస్ భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణ అంశాల గురించి ఈ సందర్భంగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్‌సింగ్, ఇతర అధికారులు ఉన్నారు.



ఈవీఎం గోదాముల ఎదుట కలెక్టర్, అదనపు కలెక్టర్



కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

పాతుకుపోయిన ఆర్‌ఐలను బదిలీ చేయండి

కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చిన జేఏసీ నాయకులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న ఆర్ఐ(రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల)ను బదిలీ చేయాలనిది జాయింట్ కౌన్సిల్ ఆఫ్ మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్(జేఏసీ) నాయకులుబుధవారం జీడబ్ల్యూఎంసీ కమిషన్ చహత్ బాజ్‌పాయ్‌ని కలిసి వినతి పత్రం అందించారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'ఆర్ఐలా ? వసూల్‌రాజాలా.. ?అనే వార్తకు వారు స్పందించి కమిషనర్‌ను కలి సి మాట్లాడారు. గ్రేటర్ మునిసిపల్ ప్రధాన కార్యాలయంతో పాటు కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాలు, టౌన్‌ప్లానింగ్, క్యూసీ, ఇంజనీరింగ్ విభాగాలలో 6 ఏళ్లకంటే ఎక్కువ కాలం ఒకే చోట పని చేస్తున్న వారికి స్థానచలనం కల్పించాలని కోరారు. జూనియర్ అసిస్టెంట్ నుంచి సూపరింటెండెంట్ వరకు ఒకే స్థానంలో మూడేళ్లకంటే ఎక్కువ కాలం పని చేసిన వారికి బదిలీ చేయాల్సి ఉండగా, కొందరు లాంగ్ స్టాండింగ్ ఒకే చోట పనిచేస్తున్నా స్థానభ్రంశం కల్పించకపోవడం వల్ల విమర్శలు వస్తున్నాయన్నారు. మూడేళ్లు దాటిన ఆర్ఐలను, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లను వెంటనే ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని జేఏసీ నాయకులు డిమాం డ్ చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జేఏసీ అధ్యక్షుడు బొట్ల రమేష్, ప్రధాన కార్యదర్శి బాకం సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్, ఉపాధ్యక్షుడు పోశాల స్వామిగౌడ్, గౌరవ అధ్యక్షుడు ఏల్పుల ధర్మరాజు, కార్యదర్శి బాలునాయక్, సత్యం ఉన్నారు.

ఎంజీఎంకు వైద్య పరికరాల పంపిణీ

వరంగల్ మెడికల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు నిత్యం వివిధ వ్యాధులతో బాధపడే పేద రోగులకు సేవలు అందించడం కోసం సుబేదారిలోని కాకతీయ హైస్కూల్ 1990 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఒక డీ ఫీబ్రిలేటర్, 12 వీల్ చైర్లు ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్ కుమార్, డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఆర్మూల సమక్షంలో బుధవారం ఎంజీఎం ఆర్ఎంవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ హైస్కూల్ తరుపున పి.సత్యనారాయణ, ఎస్.విజయ్ కుమార్, శ్రీనివాస్, చిట్టి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రయోజకులుగా తయారు చేయాలి

కేయూ క్యాంపస్ ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులను సామాజిక ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ స్పీకర్ డాక్టర్ బండా ప్రకాశ్ ఉద్బోధించారు. బుధవారం ఆయన చదువుకుని పీహెచ్‌డీ డాక్టరేట్ పొందిన మాతృవిభాగం ప్రభుత్వ పాలనశాస్త్రం, మానవీయ శాస్త్ర విభాగాన్ని సందర్శించారు. విభాగాధిపతి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులతో మాట్లాడారు. విభాగం పనితీరు, విద్యార్థుల బోధన, పరిశోధన అంశాలపైచర్చించారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన సమాచారాన్ని, సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీవోఎస్ చైర్మన్ డాక్టర్ చీకటి శ్రీను, ఉమాశంకర్, మోహన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత

కాజీపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట బంధం చెరువు సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి గంజాయితో పట్టుబడ్డారు.. ఎస్సై వి. లవన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట బంధం చెరువు సమీపంలో బుధవారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేశారు. అతడిని పట్టుకుని పరిశీలించగా కిలో ఎండు గంజాయి లభించిందని తెలిపారు. వివరాలు అడగ్గా బిహార్ రాష్ట్రం సమస్తిపూర్‌కు చెందిన సంజయ్‌కుమార్ అని తెలిపాడన్నారు. బిహార్‌లో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి కాజీపేటలో ఎక్కువ ధరకు అమ్మేందుకు తీసుకువచ్చినట్లు ఒప్పుకున్నారు. పట్టుబడిన గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.53 వేలు ఉంటుందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం నగరంలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. మడికొండ సబ్‌స్టేషన్ పరిధిలోని మడికొండ ఇండస్ట్రీయల్ ఏరియాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, కడిపికొండ సబ్ స్టేషన్ పరిధిలోని అమ్మవారిపేట, భట్టుపల్లి, కొత్తపల్లి, సూర్యకుటీర్, బోడగుట్ట, కడిపికొండ, ఆర్‌జీకే, అయోధ్యపూర్ ఏరియాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆదే విధంగా నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యానగర్, ప్రెసిడెన్సీ స్కూల్ ఏరియాలో ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

మడికొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మడికొండ గ్రామ రైతుల పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లు దుండగులు చోరీలకు పాల్పడుతున్నారని రైతులను అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఈ సందర్భంగా రైతులతో గ్రామ పోలీస్ అధికారి జి.జయరాజు బుధవారం ప్రత్యేకంగా సమావేశమై పలు సూచనలు చేశారు. దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌లు దొంగిలించి అందులోని కాపర్‌ను తీసి, ఆయిల్ చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. రైతులంతా అప్రమత్తంగా ఉండాలని, చోరీలకు పాల్పడుతున్న వివరాలు ఆచూకీ తెలిస్తే మడికొండ పోలీస్ స్టేషన్‌లోనైనా, మొబైల్‌నంబర్ 95054 81940 సమాచారం ఇవ్వాలని తెలిపారు.

16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలతోపాటు 21వ తేదీన శోభాయాత్ర నిర్వహించనున్నట్లు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం హనుమకొండ ఏసీపీ నర్సింహారావును కలిసి ఆహ్వానపత్రం అందించి వేడుకల్లో పాల్గొనాలని కోరారు. 16న వడ్డెపల్లి చర్చిరోడ్‌లోని వెంకటేశ్వర కాలనీ ఫేస్-2లో శ్రీకృష్ణుడి శోభాయమానంగా కొలువుదీర్చి శ్రీకృష్ణ జన్మాష్టమి, 21వ తేదీన ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు ఎస్‌వీ వెంకటాచార్య, రాధిక, శశికాంత్, దివ్య తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

16న బృందావనమాలి కృష్ణాష్టమి వేడుకలు

హనుమకొండలోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఈనెల 16వ తేదీన శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని చిన్నారులను ప్రోత్సహించేందుకు బృందావనమాలి పేరిట ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రోజా క్రియేషన్స్ డైరెక్టర్ ఆలేటి శ్యామ్‌సుందర్ తెలిపారు. శాస్త్రీయ, జానపద, నృత్య ప్రదర్శనలతోపాటు ప్రత్యేకంగా శ్రీకృష్ణ, గోపిక వేషాధారణలో ప్రదర్శనలు నిర్వహించి పాల్గొన్న చిన్నారులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 98494 04582 నెంబరు ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

జయశంకర్ జయంతి వేడుకలు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు బుధవారం జిల్లా కలెక్టర్‌లో ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో జయశంకర్ చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, డీఆర్‌డీఓ మేన శ్రీను, ఇతర జిల్లా అధికారులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ సార్ చేసిన సేవలను ఈ సందర్భంగా అధికారులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్‌కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, జయశంకర్ జయంతిని పురస్కరించుకుని హనుమకొండ బాలసముద్రం ఏకశిలాపార్కులో ఉన్న విగ్రహానికి బుధవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

● వరంగల్ కార్పొరేషన్: కొత్తపెల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలను పురస్కరించుకుని బుధవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఇంచార్జీ ఎస్ఈ మహేందర్, ఇన్‌చార్జి సీపీ రవీందర్ ఆడేకర్, హెచ్‌వో రమేష్, ఏవో శివలింగం, జేఏవో సరిత, సూపరింటెండెంట్ బాకం సంతోష్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పోలెపాక సంధ్య, చిన్న రాజు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జయశంకర్‌సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న అధికారులు

● రాంనగర్: స్వరాష్ట్రం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహోన్నతమైన వ్యక్తి జయశంకర్ అని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. ఆచార్య కొత్తపెల్లి జయశంకర్ 91వ జయంతిని బుధవారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు తిరుపతి, మధుసూదన్, మోహన్‌రావు, ప్రభాకర్, సీఈలు, సీజీఎంలు పాల్గొన్నారు.

● కాజీపేట : కాజీపేట చౌరస్తాలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. పలువురు నాయకులు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ సార్ చేసిన కృషిని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు నార్లగిరి రమేశ్, పాలడుగుల శివకుమార్, కుమ్మరి కోటిలింగం, ఎం.డి. అఫ్జల్, తేలు సారంగపాణి, ఎం.డి. ముస్సేన్, సోని, కోండ్ర శంకర్, శృంగవరపు బిక్షపతి, బరిగెల వినయ్ గబ్బెట కరుణ్ తపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

● వడ్డెపల్లి: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని బుధవారం హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ఎస్.మధు, అధ్యాపకులు డాక్టర్ లక్ష్మీకాంతం, రత్నమాల, ప్రొఫెసర్ సునిత, డాక్టర్ బండి యుగేంధర్‌తోపాటు విద్యార్థినిలు పాల్గొన్నారు.

నగరంలో వైభవంగా బోనాలు



బోనాలతో తరలివస్తున్న మహిళలు

జూలైవాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పవిత్ర శ్రావణమాస వేళ బుధవారం గ్రేటర్ 49వ డివిజన్‌లోని ఇందిరమ్మ కాలనీలో మహిళలంతా బోనాలతో సందడి చేశారు. శాస్త్రోక్తంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వైభవంగా బోనాలు నిర్వహించారు. మహిళలంతా బోనాలతో ఊరేగింపుగా నూతన ఆలయానికి తరలివచ్చి గ్రామ దేవతకు నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, ఆలయ చైర్మన్ బొల్లం విఠల్, వైస్ చైర్మన్ భీమారం యాదగిరి, కాలనీ అధ్యక్షుడు నారాయణగిరి శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శి సాంబరాజు కిరణ్, ప్రచార కార్యదర్శి బోడ రాము, ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి నరసింహా, సంపెట వెంకటేశ్వర్లు, సంపెట సుధాకర్, గొట్టె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

● మడికొండ: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి బోనాల వేడుకలను బుధవారం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. శివసత్తుల పూనకాలతో కడిపికొండ పరిడవిల్లింది. ముదిరాజ్ మహిళలు నెత్తిన బోనాలను ఎత్తుకొని డప్పుల దరువులకు అనుకరిస్తూ చేతిలో వేప కొమ్మలను పట్టకొని నృత్యాలు చేస్తూ ఊరి పొలిమేరలోని పెద్దమ్మతల్లి ఆలయానికి తరలి వెళ్లారు. అమ్మవారికి వస్త్రాలు, పప్పు, బెల్లం, పాయసం, బెల్లం శాక, కొబ్బరి కాయలు, నైవేద్యం సమర్పించుకున్నారు. తొలుత అమ్మవారికి అలంకరణ చేసి పూజ నిర్వహించి బలిహరణ చేశారు. గండ దీపం వెలిగించి అమ్మవారిని కొలిచారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరై ఆలయంలోని అమ్మవారిని దర్శించుకొని కొలిచి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎంపీటీసీ సాదినేని సుధాకర్‌తోపాటు ముదిరాజ్ కులస్థులు అధిక సంఖ్యలోపాల్గొని అమ్మవారిని కొలిచి పాడి పంటలతో అష్టైశ్వర్యాలతో చల్లంగా దీవించమని దేవదేవి పెద్దమ్మతల్లిని వేడుకున్నారు.

● మడికొండ మెట్టురామలింగేశ్వర స్వామి, సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో బుధవారం పోచమ్మ ఆలయంలో అమ్మవారికి పంచామృతంతో అభిషేకం చేశారు. దేవస్థానం తరుపున ఆలయ కార్యనిర్వహణ అధికారి మొదటిబోనం సమర్పించారు. శివాలయం కార్యనిర్వహణ అధికారి ఆర్.సునీత రామాలయం కార్యనిర్వహణ అధికారి ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు రాగిచేడు అభిలాష వర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ వర్మ తోపాటు భక్తుల పెద్దఎత్తున పాల్గొన్నారు.



గంటా రవికుమార్‌కు పూల మొక్క అందిస్తున్న చిన్నారులు

గోల్డెన్ ఓక్ స్కూల్‌లో ఇన్వెస్టిచర్ ఘనంగా వేడుకలు

హనుమకొండ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని గోల్డెన్ ఓక్ స్కూల్‌లో వార్షిక ఇన్వెస్టిచర్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గంటా రవికుమార్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు నాయకత్వ గుణాలు, క్రమశిక్షణ, సేవా దృక్పథం వంటి విలువలను పెంపొందించుకోవాలన్నారు. నాయకత్వం అనేది హోదా కాదు.. అది బాధ్యత అని సూచించారు.

నూతనంగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులకు అధికార బాధ్యతలు అప్పగించారు. హెడ్ బాయ్, హెడ్ గర్ల్స్, స్పోర్ట్స్‌హెడ్, కల్చరల్‌హెడ్, నాలుగు హౌస్‌ల కెప్టెన్‌లు వైస్‌కెప్టెన్లకు బ్యాడ్జీలు సాషెస్‌లను అందజేశారు. శివనగర్ ప్రిన్సిపాల్ మనోహర్‌రావు, కాపువాడ ప్రిన్సిపాల్ బాసాని దీప్తి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఇనిస్టిట్యూట్‌లో క్రీడా పోటీలు ప్రారంభం

కాజీపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌లోస్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం క్రీడా పోటీలను ప్రారంభించారు. మొదటగా క్యారమ్స్ సింగిల్స్, డబుల్స్ పోటీలను ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, ట్రెజరర్ జి.రాజేశ్వర్ రావులు ప్రారంభించారు. గురువారం నుంచి టేబుల్ టెన్నిస్, బిలియడ్స్, షటిల్, చెస్, డ్రాయింగ్, పెయింటింగ్, వ్యాసరచన, కల్చరల్ పోటీలు ప్రారంభమవుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఆగస్టు 15న విజేతలకు బహుమతులు అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుంచు ప్రశాంత్, ఎం.డి. చాంద్‌పాష, జె.దేవదాసు, రాజేంద్రప్రసాద్, ఎ. రఘుపతి, జి.భాస్కర్, సాంబయ్యలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

హసన్‌పర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం ఏసీపీ కలకోట్ల గిరికుమార్ అన్నారు. మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ క్రైం డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి అధ్యక్షతన సైబర్ జాగ్రత్త దినోత్సవం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సైబర్ క్రైం ఏసీపీ గిరికుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిజిటల్ అరెస్టు, నకిలీ పెట్టుబడుల పేరిట మోసాలు, లోన్ యాప్స్, సైబర్ కాల్స్ ఏపీకే ఫైల్స్, సోషల్ మీడియా ప్రకటనల సంబంధించి క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలతో డబ్బులు కట్ చేస్తున్న విధానాన్ని వివరించారు. ఫొటోలు మార్ఫింగ్ చేసి కొరియర్ సంస్థ నుంచి ఫోన్ కాల్స్ మొదలగు అంశాలలో జరిగే మోసాల విధానం గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రిపోర్టు చేసే విధానం గురించి విద్యార్థినులకు తెలియజేశారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత గురించి అవగాహన పెంచడం కోసం పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థినులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ యాజన్, ఎస్సైలు వి.చరణ్‌కుమార్, బి.శివకుమార్, కోఆర్డినేటర్లు శ్వేత, పి.ప్రత్యూషరెడ్డి, వివిధ విభాగాధిపతులు డాక్టర్ ఇ.సుదర్శన్, డాక్టర్ కె.మహేందర్, డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ ఎన్.శ్రీవాణి, ప్రశాంత్, ఏవో వేణుగోపాలస్వామి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 12 మందికి జరిమానా

వరంగల్ క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 12మంది వాహనదారులను బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ రూ.10700 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ జి.సీతారెడ్డి తెలిపారు. ఆదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని ఆరుగురికి రూ.4వేల జరిమానా విధించినట్లు సీఐ వెల్లడించారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం

విశ్వసనీయ సమాచారంతోనే మీడియాకు మనుగడ

కేయూ క్యాంపస్ ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విశ్వసనీయమైన సమాచారంతోనే మీడియా మనుగడ సాధ్యం అవుతుందని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. బుధవారం కేయూ జర్నలిజం విభాగం, బీబీసీ తెలుగు న్యూస్ నేతృత్వంలో విద్యార్థులకు ఔట్‌రీచ్ సదస్సును ఎస్డీఎల్‌సీఈ న్యూ సెమినార్ హాల్‌లో నిర్వహించారు. దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్ అధ్యక్షతన జరిగిన సదస్సులో రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీబీసీ న్యూస్‌లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ట్రైనింగ్ అండ్ కల్చర్ బీబీసీ న్యూస్ ఇండియా విభాగాధిపతి ఇక్బాల్ అహ్మద్ కీలక ఉపన్యాసం చేశారు. 2017లో బీబీసీ 6భాషల్లో విస్తరించిందన్నారు. బీబీసీలో మంచి వేతనంతో పాటు గుర్తింపు లభిస్తుందన్నారు. సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. ఏఐచాట్, జీపీటీతో పాటు అత్యాధునిక టెక్నాలజీతో విషయ పరిజ్ఞానం పెరుగుతోందని చెప్పారు. విభాగాధిపతి డాక్టర్ సంగాని మల్లేశ్వర్ మాట్లాడుతూ.. ట్రైనింగ్ స్కీంతో విద్యార్థుల మంచి మెళకువలు నేర్చుకున్నారని అన్నారు. కార్యక్రమంలో భిక్షాలు, కంజర్ల నరసింహరాములు, శ్రీకాంత్, వంగాల సుధాకర్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, ఈర్ల సురేందర్, ప్రణబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గొర్లకాపర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

హసన్‌పర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు గొర్ల కాపర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని గొర్లు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల రమేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గొర్ల కాపర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని బుధవారం స్థానిక తహసీల్దారు చల్ల ప్రసాద్‌కు అందజేశారు. మండల అధ్యక్షుడు భాషబోయిన ఓదేలు, కార్యదర్శి పిడుగు రాజేందర్, కన్నెబోయిన రాజయ్య, జక్కుల ఓదేలు, దేవరబోయిన కుమార్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు



రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

న్యూశాయంపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలో ఈ నెల 20, 21, 22 తేదీలలో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం మహాసభల వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో వేలాదిమంది బలిదానం చేసి వీరోచితంగా పోరాడిన చరిత్ర సీపీఐది అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మీ, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్, జక్కు రాజుగౌడ్, సారంగపాణి, కొట్టెపాక రవి, బత్తిని సదానందం తదితరులు పాల్గొన్నారు.

● కాజీపేట : భారత కమ్యూనిస్టు పార్టీ కాజీపేట మండల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరిగే రాష్ట్ర స్థాయి మాహాసభల పోస్టర్‌ను కాజీపేటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పేదలకోసం నిరంతరం కృషి చేసే పార్టీ సీపీఐ అని అన్నారు.

వంద సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ ప్రజా ఉద్యమంలో ముందుంటుందన్నారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్ నాయకులు శంకర్‌నాయక్, సారంగపాణి, ఎం. భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీదేవిని ఇలా అలంకరించాలి..!

వరలక్ష్మీవ్రతం రోజున మహిళలందరూ లక్ష్మీదేవి పూజ చేస్తూ ఉంటారు. కొంతమంది పటాన్ని పూజిస్తే మరికొంతమంది మాత్రం అమ్మవారే స్వయంగా వచ్చి కూర్చున్నట్లు ఏర్పాటు చేస్తారు. ఆ దేవికి పట్టుచీర, ఆభరణాలు, పూలు అలంకరించి మురిసిపోతుంటారు. పూజ చేసే ముందు అమ్మవారిని అందంగా ఎలా కొలువుదీర్చాలో తెలుసుకుందాం...



- బజారు నుంచి అమ్మవారి ముఖం, చేతులు తెచ్చుకోవాలి. లేదంటే ఇంట్లోనే బియ్యప్పిండితో తయారు చేసుకోవచ్చు.
- ఇత్తడి లేదా రాగి చెంబును తీసుకోవాలి. దానికి పై భాగంలో ఒక కర్రను తాడుతో కట్టాలి.
- అమ్మవారిని ఏర్పాటు చేయాలనుకున్న ప్రదేశంలో ఒక టేబుల్ లేదా పీట వేసి దాని మీద ఒక బిందె పెట్టాలి. దీనిమీద కర్ర కట్టిన చెంబును ఉంచాలి. కర్ర ముందువైపునకు ఉండేలా చూసుకోవాలి.
- జరీ డిజైన్ ఉన్న జాకెట్ గుడ్డను తీసుకుని చిన్న చిన్న కుచ్చిళ్లతో మడతపెట్టాలి. రెండు చివరలా అలాగే మధ్య భాగంలో క్లిప్‌లు పెడితే కుచ్చిళ్లు విడిపోవు. ఇలా తయారుచేసుకున్న కుచ్చిళ్లను చెంబు వెనక నుంచి కర్ర మీదుగా ముందుకు వేలాడదీయాలి. చివరల ఉన్న క్లిప్పులను తీసివేసి కుచ్చిళ్లను గుండ్రంగా వచ్చేలా అందంగా సర్దాలి. ఈ కుచ్చిళ్లను మొదటి చెంబు పై భాగానికి కలుపుతూ లేస్ లేదా దారంతో గట్టిగా కట్టాలి. కర్ర మీద కుచ్చిళ్లను చక్కగా పరచాలి. తరవాత పొడవైన హారం, పెద్ద లాకెట్ ఉన్న నెక్లెస్ అమర్చాలి. నడుము భాగంలో ముత్యాల గొలుసు లేదా చిన్న నెక్లెస్‌ను వడ్డాణంలా పెట్టవచ్చు.
- పై చెంబులో కొబ్బరికాయను పెట్టి దాని మీద అమ్మవారి ముఖాన్ని అమర్చాలి. కర్రకు ఇరువైపులా అమ్మవారి చేతులు పెట్టాలి. ఈ రెండు చేతులకూ గాజులు వేయాలి. తరవాత ఒక పెద్ద పూల దండను తీసుకుని తలపై నుంచి భుజాల మీదుగా వేలాడదీయాలి. ఒక కార్డ్ బోర్డును గుండ్రంగా కత్తిరించి దానికి బంగారు రంగులో మెరిసే కాగితాన్ని అంటించాలి. దీన్ని అమ్మవారి తల వెనక జాగ్రత్తగా అమర్చాలి.
- కొన్ని కాగితాలను గుండ్రంగా చుట్టి బంతి మాదిరి తయారు చేయాలి. ఇలా రెండు బంతులు తయారు చేసి మొదటి బిందెకు ఇరుపక్కలా కుచ్చిళ్ల కింద అమర్చాలి. ఇలా చేయడం వల్ల అమ్మవారు పీట మీద కూర్చున్న అనుభూతి కలుగుతుంది.

అతిథి

చేనేతకు పూర్వ వైభవం అప్పుడే!



ఒక శాస్త్రవేత్తగా తెలుగువారి కీర్తి ప్రతిష్ఠలను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లిన వ్యక్తి **డాక్టర్ సుచిత్ర ఎల్లా**. భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకురాలిగా శాస్త్ర ప్రపంచంలో ఆమెకు వేరే పరిచయం అవసరం లేదు. కొవిడ్ సమయంలో భారత్ బయోటెక్ కోట్ల సంఖ్యలో వ్యాక్సిన్ డోస్‌లను తయారుచేసి అనేకమంది ప్రాణాలు కాపాడినందుకు గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఆమెను 'పద్మభూషణ్' పురస్కారంతో సత్కరించింది. వ్యాక్సిన్ల పరిశోధనలతో నిత్యం హడావుడిగా ఉండే సుచిత్రను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం... చేనేత, హస్తకళలకు ప్రత్యేక సలహాదారురాలిగా నియమించింది. గురువారం అంతర్జాతీయ చేనేత దినోత్సవం నేపథ్యంలో ఆమె 'నవ్య'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

వ్యాక్సిన్ల తయారీ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో కీర్తిని సాధించిన మీరు హఠాత్తుగా హస్తకళలు, చేనేత రంగం వైపు రావటం చాలామందికి ఆశ్చర్యం కలిగించింది. దీని వెనుక కారణమేదైనా ఉందా?

మీరే కాదు. చాలా మంది నన్ను ఈ ప్రశ్న అడిగారు. వృత్తిపరంగా పైకి ఎదగటం నాణానికి ఒక పార్శ్వం మాత్రమే. మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అభిమానం, కళల పట్ల అభినివేశం ఉండటం మరో పార్శ్వం. మన పూర్వీకులు వ్యవసాయదారులు. వారు పత్తిని పండించి ఉంటారు. దాని ద్వారా బట్టలు నేసి ఉంటారు. కొన్ని వేల ఏళ్లుగా ఇది మనకు ఒక వారసత్వంగా వస్తోంది. అంటే ఈ సంస్కృతి సంప్రదాయాలు మన డీఎన్‌ఏలోనే ఉన్నాయి. మనం ఆచరించే సంప్రదాయాలు, జరుపుకొనే పండుగలు మన జీవితంలో విడదీయరాని ఒక భాగం. వీటన్నింటినీ నేను చిన్నప్పటి నుంచీ చూస్తూ పెరిగాను. అంతే కాదు... నాకు హస్తకళలు అన్నా.. చేనేత దుస్తులన్నా ప్రత్యేకమైన అభిమానం. చిన్నప్పటి నుంచి అందమైన హస్తకళలు ఎక్కడ కనిపించినా వాటిని కొని ఆఫీసులోనో, ఇంట్లోనో పెట్టుకోవటం అలవాటు. మా ఆఫీసుకు వచ్చేవారు వాటిని చూసి ప్రశంసిస్తున్నప్పుడు చాలా గర్వంగా అనిపిస్తుంది. మా కంపెనీ తరఫున మేము ఎవరికైనా బహుమతి ఇవ్వాలన్నా మన హస్తకళారూపాలను ఇస్తాం. అందువల్ల నాకు హస్తకళలు, చేనేత దుస్తులు కొత్త కాదు. అవి అంటే నాకు ప్రత్యేకమైన ఆసక్తి ఉంది కాబట్టే సలహాదారుగా నన్ను నియమించారు.

చేనేత వస్త్రాలపై మీకు ఆసక్తి ఎప్పటి నుంచి?

నాన్నగారు ప్రభుత్వ ఉద్యోగి. అందువల్ల దేశంలో అనేక ప్రాంతాల్లో నేను పెరిగాను. మేము ఏ రాష్ట్రంలో ఉన్నా నాన్నగారు ఆ రాష్ట్రంలో అందుబాటులో ఉన్న చేనేతలను మాకు కొనేవారు. మేము వాటినే కట్టుకొనేవాళ్లం. మేము చెన్నైలో స్థిరపడిన తర్వాత ధర్మవరం, వెంకటగిరి తదితర చేనేత చీరల గురించి తెలిసింది. మా అమ్మమ్మ ఎప్పుడూ వెంకటగిరి చీరలే కట్టుకుంటూ ఉండేది. ఆ చీరల మృదుత్వం నాకు ఇప్పటికీ జ్ఞాపకమే. ఇక్కడ మీకు ఒక విషయం చెప్పాలి... దక్షిణ భారత దేశంలో ఉన్న రాష్ట్రాలలో వాతావరణ పరిస్థితులను గమనిస్తే... వేడి ఎక్కువగా ఉంటుంది. తేమ కూడా ఎక్కువే. ఇలాంటి వాతావరణ పరిస్థితులకు చేనేత వస్త్రాలే హాయిగా ఉంటాయి. అందుకే ఒకప్పుడు తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో చేనేత పరిశ్రమకు మంచి ఆదరణ లభించింది. కేవలం ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలోనే వెయ్యికి పైగా కోఆపరేటివ్ సొసైటీలు ఉండేవంటే- వీటికి ఎంత ఆదరణ ఉండేదో అర్థం చేసుకోవచ్చు. కానీ పరిస్థితుల ప్రభావంవల్ల వీటికి ఆదరణ తగ్గుతూ వచ్చింది. చేనేత దుస్తులకు మళ్లీ ఆదరణ కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ఎందుకంటే అది మనందరి వారసత్వ సంపద. దీనిని మనం వదిలేసుకోకూడదు.

సలహాదారుగా నియమితులైన తర్వాత ఏఏ ప్రాంతాలను సందర్శించారు. మీ అనుభవాలేమిటి?

ఏప్రిల్ చివరలో నన్ను నియమించారు. పదవిని చేపట్టిన తర్వాత పరిస్థితులను అర్థం చేసుకోవటానికి నెల పట్టింది. ఏపీలో 34 చేనేత క్లస్టర్స్ ఉన్నాయి. వీటిలో గత రెండు నెలలలో 10 క్లస్టర్స్‌ను సందర్శించాను. మిగిలిన వాటిని కూడా త్వరలోనే సందర్శిస్తాను. కొన్ని విషయాలు గమనించాను. చేనేత కార్మికులందరూ తమ ఇళ్ల నుంచే పని చేస్తారు. అదే వారికి జీవనాధారం. వీరి స్థితిగతులు బాగుపడాలంటే కోఆపరేటివ్ మోడల్‌ను బలంగా అమలు చేయాలి. వీరందరికీ అవసరమైన ముడి సరుకు అందించటం, రుణ, మౌలిక సదుపాయాలు కల్పించటం, సాధన సంపత్తి, నేసిన దుస్తులకు జాతీయంగా, అంతర్జాతీయంగా బ్రాండింగ్ చేయటం చాలా కీలకమైన అంశాలు.

> ఒకప్పుడు తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో చేనేత పరిశ్రమకు మంచి ఆదరణ లభించింది. కానీ పరిస్థితుల ప్రభావంవల్ల వీటికి ఆదరణ తగ్గుతూ వచ్చింది. చేనేత దుస్తులకు మళ్లీ ఆదరణ కల్పించాల్సిన బాధ్యత మనందరి పైనా ఉంది. ఎందుకంటే అది మనందరి వారసత్వ సంపద. దీనిని మనం వదిలేసుకోకూడదు.

మన చేనేతకు పూర్వ వైభవం తీసుకురావాలంటే ఏం చేయాలి?

మనకు ఏఏ ప్రాంతాలు చేనేతలకు ప్రసిద్ధో తెలుసు. ఇప్పటికీ ఆ ఊళ్లు ఉన్నాయి. తరతరాలుగా నేతను నమ్ముకున్న కుటుంబాలు ఉన్నాయి. కానీ వారి సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. కొత్త తరం ఈ వృత్తిలోకి



రావటం లేదు. ఎందుకంటే వారికి లాభసాటిగా అనిపించటం లేదు. క్రమం తప్పకుండా ఆదాయం వస్తుందనే భరోసా వారికి కలగటం లేదు. నేత నేయటానికి ప్రత్యేకమైన నైపుణ్యం కావాలి. సాధారణంగా అది కుటుంబ వారసత్వంగా వస్తుంది. కొత్త తరం వారు ఆ వారసత్వ బాధ్యత తీసుకోవటానికి ఇష్టపడటం లేదు. నేను కేవలం ఆంధ్రప్రదేశ్ గురించి మాత్రమే చెప్పటం లేదు. నాకు కాంచీపురం ప్రాంతం బాగా తెలుసు. కొన్ని వేల ఏళ్లుగా అక్కడ పట్టు చీరలు నేస్తున్నారు. ఈమధ్య కాలంలో కాంచీపురం చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లి చూస్తే- కొత్త తరం వారు ఈ వృత్తిలోకి రావటం లేదు. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనే వెయ్యికి పైగా కోఆపరేటివ్ సొసైటీలు ఉండేవి. ఇవి 50 శాతం పైగా తగ్గిపోయాయి. అంటే ఈ సొసైటీలకు కూడా ఆదరణ తగ్గిందని అర్థం చేసుకోవాలి. మౌలిక సదుపాయాల రూపకల్పనకు పెట్టుబడులు, సంప్రదాయ పద్ధతులను అనుసరిస్తూనే కొత్త కొత్త టెక్నాలజీల సాయం తీసుకోవటం వంటి అనేక చర్యలు చేపట్టాల్సి ఉంది.

చేనేతలు చాలా ఖరీదనే అభిప్రాయం కూడా ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. చేనేతలకు ఆదరణ తగ్గటానికి ఇది కూడా ఒక కారణమా?

నా ఉద్దేశంలో చేనేత వస్త్రాలు అంత ఖరీదు కాదు. మీకు ఒక ఉదాహరణ చెబుతా. అందమైన ఆరు గజాల చేనేత చీర వెయ్యి రూపాయలకు దొరుకుతుంది. ఆరు గజాలంటే ఐదున్నర మీటర్లు. ఇంత తక్కువ రేటుకు దొరుకుతున్నా... చేనేతలు ఖరీదనే అభిప్రాయం కొందరిలో నాటుకుపోయింది. దీనికి మరో కోణం కూడా ఉంది. సాధారణం నేత పనివారు చిన్న చిన్న బృందాలుగా పని చేస్తారు. దీనివల్ల ఎక్కువ ఉత్పత్తి ఉండదు. ముడి సరుకుల కొనుగోలు.. మార్కెటింగ్.. బ్రాండింగ్‌కు సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. దీనివల్ల ఖరీదు కూడా ఎక్కువే ఉంటుంది. అలా కాకుండా కోఆపరేటివ్ పద్ధతిలో ఉత్పత్తి భారీగా పెరిగితే ఓవర్‌హెడ్స్ తగ్గుతాయి. వ్యాక్సిన్ల విషయంలో కూడా అంతే. ఉత్పత్తి తక్కువగా ఉంటే ధర ఎక్కువగా ఉంటుంది. ఉత్పత్తి భారీగా ఉండే ధర గణనీయంగా తగ్గిపోతుంది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

మానసిక ప్రశాంతతకు, చక్కని జ్ఞాపక శక్తికి ధ్యానం ఉపకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ధ్యానం చేసేటప్పుడు ఇతరత్రా ఆలోచనలు రాకుండా మనసు స్థిరంగా ఉండాలంటే ఏమి చేయాలో తెలుసుకుందాం...

ధ్యానం చేసేటప్పుడు ఇవి గుర్తుంచుకోవాలి..!

- ధ్యానం కోసం నిశ్శబ్దంగా ఉండే ప్రదేశాన్ని ఎంచుకోవాలి. పచ్చని చెట్ల మధ్య గాలి బాగా వీచే చోట ధ్యానానికి ఉపక్రమించడం



మంచిది. ఉదయాన్నే లేదా సాయంత్రం వేళ ఇంట్లో ప్రశాంతంగా ఉండే చోట కూర్చుని ధ్యానం చేసుకోవచ్చు.
- ధ్యానం చేస్తూ పక్షులు చేసే శబ్దాలు వినాలి. వీచే గాలితోపాటు చెట్లు, పూలు, మట్టి తదితరాలతో కూడిన ప్రకృతి నుంచి వచ్చే సువాసనలను ఆస్వాదించాలి. దీనివల్ల మనసు ప్రశాంతంగా మారుతుంది. శారీరక అలసట తగ్గుతుంది.
- ధ్యానం చేసేటప్పుడు వచ్చే ఆలోచనలకు అడ్డుకట్ట వేసేందుకు శ్వాస మీద దృష్టి నిలపాలి. ఉచ్ఛ్వాస, నిశ్వాసాలను లెక్కిస్తూ ఉంటే ప్రయోజనం ఉంటుంది.
- కళ్లు మూసుకుని ఇష్టమైన ప్రదేశాలను గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నం చేయాలి. వర్షం, సూర్యోదయం, సూర్యాస్తమయం, చెట్లతో నిండిన అడవి లాంటి వాటిని ఊహిస్తూ ఉండాలి. దీనివల్ల వేరే ఆలోచనలు రాకుండా ఉంటాయి.
- ఆలోచనలు ప్రారంభమవుతున్నప్పుడే వాటి నుంచి మనసును మరల్చాలి. రోజూ పది నిమిషాలు ఇలా చేస్తూ ఉంటే అనవసరమైన ఆలోచనలు రావడం క్రమంగా తగ్గుతుంది.

అన్నంలో ప్రొటీన్లు పోకుండా...

కౌన్సెలింగ్

డాక్టర్! తెల్ల అన్నంలో పిండి పదార్థాలు మినహా ప్రొటీన్లు ఉండవని అంటూ ఉంటారు. ఇదెంత వరకూ నిజం? పిల్లల్లో ఎదుగుదల లోపాలకు ఈ అంశమే కారణమా?

- ఓ సోదరి, హైదరాబాద్

అన్నం తింటే లావైపోతాం. దీన్లో పిండిపదార్థాలు, చక్కెరలు మాత్రమే ఉంటాయి అనేది ఇప్పటివరకూ మనకున్న నమ్మకం. కానీ అన్నంలో ప్రొటీన్ల శాతం క్రమంగా పెరుగుతోందని పరిశోధనల్లో వెల్లడైంది. అటుకులు, మరమరాలు, బ్రౌన్ రైస్, పారాబాయిల్డ్ రైస్, పాలిష్‌డ్ రైస్.. ఇలా దక్షిణ భారతదేశంలో వాడుకలో ఉండే బహురూప బియ్యం మీద జరిపిన పరిశోధనల ద్వారా బియ్యాన్ని



ప్రొటీన్ డైట్‌లో భాగం చేసుకోవచ్చనే వాస్తవం తెలిసింది. అయితే బియ్యంలో పోషకనష్టం జరగకుండా ఉండాలంటే తెల్లగా పాలిష్ పట్టకూడదు. బియ్యాన్ని పాలిష్ పట్టడం వల్ల పైపొరల్లో ఉండే బి1, బి2, బి6 విటమిన్లు నష్టపోయి పిండి పదార్థాలు మాత్రమే మిగిలిపోతాయి. కాబట్టి సన్నబియ్యం బదులుగా మర ఆడించని లేదా ఒక పట్టు బియ్యం, దంపుడు బియ్యం తినటం అలవాటు చేసుకోవాలి. అలాగే పోషకాహార లోపం పెద్దలతో పాటు పిల్లల్లో కూడా పెరుగుతోంది. అందుకు కారణం పదార్థాల్లోని పోషకాల పట్ల అవగాహన లేకపోవడమే!

ఐదేళ్లలోపు 39% మంది పిల్లల్లో వయసుకు తగిన ఎత్తు పెరగకపోవటమనే లోపం మన దేశంలో ఎంతోకాలంగా కొనసాగుతోంది. ఈ లోపానికి జన్యుపరమైన, వంశపారంపర్యమైన ఇతరత్రా కారణాలతోపాటు పోషకాహారలోపం కూడా ఓ ప్రధాన కారణమని పరిశోధనల్లో వెల్లడైంది. ఈ పోషకాహారలోపంలో కీలకమైంది తగినంత ఎదుగుదలకు తోడ్పడే ప్రొటీన్ ఆహారంలో ఉండకపోవటం. ఇందుకు ప్రధాన కారణం ఏ పదార్థాల్లో ప్రొటీన్లు, ఇతర పోషకాలు ఉంటాయో అవగాహన లేకపోవటమే! ఈ దిశగా ఆలోచించి ప్రొటీన్లు ఎక్కువగా ఉండే మాంసాహారం మీద పరిశోధన చేసినప్పుడు ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. వేర్వేరు మాంసాల్లోని ప్రొటీన్ల పరిమాణాల్లో, ఒకే జంతువులోని వేర్వేరు శరీర భాగాల్లోని ప్రొటీన్ పరిమాణాల్లో హెచ్చుతగ్గులున్నట్టు తెలిసింది. ఈ పరిశోధన ఆధారంగా విడుదలచేసిన ఫుడ్ టేబుల్ ఆధారంగా పిల్లలకు ఆహారం అందించగలిగితే ప్రొటీన్ లోపాన్ని అరికట్టవచ్చు.

- డాక్టర్. పి.ఉదయ్ కుమార్
ఎన్ఐఎన్ శాస్త్రవేత్త,
నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్
(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్)
హైదరాబాద్.

అందంగా ఉండాలని అమ్మాయిలు ఎన్నో చేస్తారు. అయితే ఎక్కువగా ముఖం మీద మాత్రమే శ్రద్ధ పెడతారు. దాంతో మోచేతులు, మోకాళ్లు, మడమలు వద్ద చర్మం నల్లగా మారుతుంది. ఈ నల్లదనాన్ని ఎలా పోగొట్టుకోవాలో తెలుసుకుందాం..

మోచేయి నలుపు పోవాలంటే..

- కలబందతో ఈ నలుపును వదిలించవచ్చు. కలబంద గుజ్జును మోచేతులు, మోకాళ్లు, మడమలు మీద రాయాలి. ఇరవై నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. రోజుకు రెండుసార్లు ఇలా చేస్తే మంచి ఫలితముంటుంది.
- ఒక చెంచా ఆలివ్ నూనెలో కొంచె పంచదార వేసి కలిపి. ఈ మిశ్రమాన్ని నల్లగా మారినా చర్మం మీద రాసి మర్దన చేయాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. పంచదార స్క్రబ్‌ల పనిచేసి మృతకణాలను తొలగిసస్తుంది. క్రమంగా నలుపు తగ్గిపోతుంది.



- కొబ్బరి నూనె కూడా ఈ నలుపును తగ్గిస్తుంది. రోజూ మోచేతులు, మోకాళ్లు, మడమలకు కొబ్బరి నూనె కొంచెంసేపు మర్దన చేయాలి. కొబ్బరి నూనెలో కొద్దిగా నిమ్మరసం కూడా కలపవచ్చు. ఇలా చేసిన మంచి ఫలితముంటుంది.
- నిమ్మకాయ సహజ బ్లీచింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఇందులోని విటమిన్ సి చర్మం మీద ఉన్న మృత కణాలను తొలగించడంలో సమర్థంగా పనిచేస్తుంది. నిమ్మకాయ ముక్కలను మోచేతులు, మోకాళ్ల మీద రుద్దితే మంచి ఫలితముంటుంది.
- పెరుగులోని లాక్టిక్ యాసిడ్ చర్మాన్ని తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. మోచేతులు, మోకాళ్ల మీద పెరుగు రాసి 15 నుంచి 20 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. వారానికి మూడుసార్లు ఇలా చేసి తరువాత కొబ్బరి నూనెతో మర్దన చేయాలి. రోజూ ఇలా చేస్తే క్రమంగా చర్మం నలుపు మాయమవుతుంది.
- బంగాళాదుంప ముక్కను మోకాళ్లు, మోచేతుల మీద 5 నిమిషాల పాటు రుద్దాలి. తరువాత నీటితో శుభ్రం చేయాలి. తరచూ ఇలా చేయడం వలన మంచి ఫలితం ఉంటుంది.

---

2 నిమిషాల్లో చీర కట్టుకోవచ్చా?

శ్రావణ శుక్రవారం దగ్గరకు వచ్చేస్తోంది. వరలక్ష్మీ వ్రతానికి ఆడవారు చీరలు కట్టుకుంటారు. అయితే యువతులు, కొత్తగా పెళ్లైన వారు చీర కట్టుకోవడానికి నానా తంటాలు పడతారు. ఎంత ప్రయాస పడిన కుచ్చిళ్లు ఎగుడుదిగుడు అవుతాయి. పెళ్లిళ్లు, ఫంక్షన్లకు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి. ఇలాంటి సమస్యలకు పరిష్కారంగా నేటి యువత చీర ప్రీ ప్లీటింగ్ చేయించుకుంటారు. అంటే ముందుగా చీర పవిట కుచ్చిళ్లు, నడుము కుచ్చిళ్లు ముందుగానే సిద్ధం చేసి ఉంచుకోవడం అన్నమాట. దీని వలన రెండే నిమిషాల్లో చీరను సింగారించుకోవచ్చు. అదెలాగో తెలుసుకుందాం..

ముందుగా కొలతలు తీసి పెట్టుకుంటే సులభంగా చీరను ప్రీ ప్లీటింగ్ చేసుకోవచ్చు. ఇందుకోసం పవిట ఎంత పొడవు కావాలో చూసుకుని గుర్తుగా ముందే ఒక పిన్ పెట్టుకోవాలి. అలాగే కుచ్చిళ్ల కోసం చీరను కట్టు చెంగు నుంచి నడుము చుట్టూ ఒక చుట్టు తిప్పి ఒక పిన్ పెట్టుకోవాలి. ఇంకో వైపు కూడా అంతే పవిట నుంచి నడుము వరకు చీరను తిప్పి ఒక్కడి నుంచి ఒక మూర పొడవు వదిలేసి పిన్ పెట్టుకోవాలి.



చీర పవిట చెంగును తీసుకొని పెద్దవి లేదా చిన్నవి కావాల్సినన్ని కుచ్చిళ్లు పెట్టుకొని పిన్స్ పెట్టేయాలి. ఇప్పుడు వాటిని ఐరన్ చేయాలి.



ఇప్పుడు భుజం నుంచి ముందు వైపుకు చీరను సిద్ధం చేసుకోవాలి. ఇందు కోసం భుజం దగ్గర పెట్టుకున్న పిన్ దగ్గర నుంచి మన చేతితో ఒక మూర పొడవు మేర చీరను ముందు భాగం కోసం తీసుకుని ఆ కుచ్చిళ్లను పక్క ఫోటోలో చూపిన విధంగా కొంచెం దూరంగా జరిపి ఐరన్ చేసుకోవాలి.



తరువాత నడుము కుచ్చిళ్లు కోసం పెట్టుకున్న రెండు పిన్‌ల మధ్య ఉన్న చీరతో కుచ్చిళ్లు పోసుకుని టేబుల్ మీద పెట్టి ఐరన్ చేసుకోవాలి.



ఇప్పుడు ఈ కుచ్చిళ్లను అలా ఉంచి కట్టు చెంగు వైపున మిగిలిన చీరను జాగ్రత్తగా ఈ కుచ్చిళ్ల వద్దకు తెచ్చి వీటి మీద మడత పెట్టాలి. పవిట వైపు మిగిలి ఉన్న చీరను కూడా అలాగే చేయాలి. తరువాత పవిట కుచ్చిళ్లు మినహా చీరను చతురస్రాకారంలో మడత పెట్టాలి. తరువాత పవిట కుచ్చిళ్లను జాగ్రత్తగా చీర చుట్టు తిప్పి మడత పెట్టేయాలి.

జాగ్రత్తలు :
- ఐరన్ చేసేటప్పుడు చీర రకాన్ని బట్టి ఉష్ణోగ్రత సరి చూసుకోవాలి.
- ఐరన్ స్టీమ్ వాడితే కుచ్చిళ్లు బాగా కుదురుతాయి.



నేరెళ్ల విజయలక్ష్మీ
6309725522



కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

రాహుల్ డైరెక్షన్‌లోనే కాంగ్రెస్ ఢిల్లీ డ్రామా

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఎద్దేవా
- ముస్లింలకు 10 శాతం తీసేస్తే బీసీ బిల్లుకు మద్దతిస్తామని వెల్లడి

గోదావరిఖని/ కాగజ్‌నగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై రాహుల్ గాంధీ డైరెక్షన్‌లోనే ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ డ్రామాలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. ఆ పార్టీ నాయకులు యాక్టర్లు, పెయిడ్ ఆర్టిస్టులుగా మారారన్నారు. పెద్దపల్లి జిల్లా గంగానగర్, కుమరం భీం జిల్లా కాగజ్ నగర్‌ల్లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేసి, అసెంబ్లీలో బీసీ బిల్లు పెట్టి.. ఇప్పుడు ఢిల్లీకెందుకెళ్లారని ప్రశ్నించారు. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు తీసేస్తే తాము బీసీ బిల్లుకు మద్దతిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాని అభ్యర్థి ఓబీసీ నేత అని ప్రకటించాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి కేసీఆర్ కుటుంబానికి చెందిన నలుగురే బాధ్యులని, ఈటలకు సంబంధం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సీబీఐ విచారణ జరిపించాలని ఆయన చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టును మాజీ సీఎం కేసీఆర్ ఏటీఎంలా వాడుకున్నారని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి వద్ద గోదావరిపై బ్యారేజీ కట్టి ఆదిలాబాద్ జిల్లాకు నీళ్లు తరలించాలన్నారు.

బీసీలకు న్యాయం చేయడం కన్నా.. గాంధీ కుటుంబ అనుగ్రహం కోసమే పాట్లు

- రేవంత్ ప్రసంగంలో రాహుల్, సోనియా జపమే
- మోదీని విమర్శిస్తే సూర్యుడిపై ఉమ్మేసినట్లే: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ చేసిన ధర్నాలో బీసీలకు న్యాయం చేయడం కన్నా గాంధీ కుటుంబం అనుగ్రహం పొందాలనే తపన సీఎం రేవంత్ రెడ్డిలో అధికంగా కనిపించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 31 నిమిషాల రేవంత్ రెడ్డి ప్రసంగంలో 50% కంటే ఎక్కువగా రాహుల్, సోనియా జపం చేయడానికే సరిపోయిందని విమర్శించారు. బుధవారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్ గురించి కాంగ్రెస్ నేతలు మాట్లాడంలేదని, ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని బీసీలకు హామీ ఇచ్చినట్లుగా బడ్జెట్‌లో నిధులు కేటాయించడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజావ్యతిరేకత వస్తుందని తెలిసే బీసీల పేరుతో డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. అశాస్త్రీయమైన సర్వే చేసి ముస్లింలకు 10% రిజర్వేషన్లు కల్పించి బీసీలకు అన్యాయం చేయాలనుకుంటున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ముస్లింలు 50 రిజర్వ్‌డ్ సీట్లలో పోటీ చేసి 31 స్థానాలు గెలిచారని గుర్తు చేశారు. కాంగ్రెస్.. మజ్లిస్ చెప్పినట్లు ఆడుతోందని ఆరోపించారు. నెహ్రూ హయాంలో కాకా కాలేకర్ కమిషన్, ఇందిర హయాంలో మండల్ కమిషన్ నివేదికలను విస్మరించింది కాంగ్రెస్సేనని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీని సీఎం రేవంత్ విమర్శిస్తే సూర్యుడిపై ఉమ్మివేసినట్లేనని, మరో 30 సంవత్సరాల వరకూ కాంగ్రెస్ ఈ దేశంలో అధికారంలో రాదని ఆయన అన్నారు. తెలంగాణలో నడిచేది ఇందిరమ్మ పాలన కాదని, బకాయిల పాలన కొనసాగుతోందని బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులకు బకాయిగా ఉన్న రూ.600 కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా

- బీసీలపై ఆ పార్టీది మొసలి కన్నీరు
- హిందువులను మైనారిటీలుగా చేసే కుట్ర: సంజయ్



న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు 10% రిజర్వేషన్లు కల్పించేందుకే కాంగ్రెస్ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. బీసీలకు న్యాయం చేయాలన్న నిజాయితీ లేదని, బీసీలపై ఆ పార్టీ మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు. ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ధర్నాకు సోనియా, ఖర్గే, రాహుల్ రాలేదని, వాళ్ల కార్యక్రమం ఫ్లాప్ షోగా సాగిందన్నారు. మోదీ ప్రభుత్వం ఇప్పటికే బీసీలకు 27% రిజర్వేషన్లు అమలు చేస్తోందని చెప్పారు. 42% రిజర్వేషన్లలో ముస్లింలకు 10% కల్పిస్తే.. బీసీలకు అదనంగా వచ్చేది 5% మాత్రమేనని, పక్కా ప్లాన్ ప్రకారమే మెజారిటీ హిందువులను మైనారిటీలుగా చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తాము మతపరమైన రిజర్వేషన్లకు విరుద్ధమని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లుగా బీసీలకే పూర్తిగా 42% రిజర్వేషన్లు అమలు చేస్తామంటే తాము బిల్లుకు మద్దతు ఇస్తామని, లేకపోతే తీవ్రంగా వ్యతిరేకిస్తామని చెప్పారు. దేశాన్ని 50 ఏళ్ల పాటు ఏలిన కాంగ్రెస్ ప్రధానమంత్రి పదవిని బీసీలకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీలో బూర్గుల నుంచి నేటి తెలంగాణలో రేవంత్ రెడ్డి వరకు ఒక్కరినైనా బీసీని ముఖ్యమంత్రిని చేసిందా అని నిలదీశారు. ఒక బీసీని ప్రధానిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందని, కేంద్రంలో 27 మంది బీసీలకు మంత్రిపదవులు ఇచ్చామని, పలు రాష్ట్రాల్లో బీసీ ముఖ్యమంత్రులను నియమించామని తెలిపారు. తెలంగాణలో సగం జనాభా బీసీలు ఉంటే రాష్ట్ర క్యాబినెట్‌లో సగం మంది బీసీలకు ఎందుకు అవకాశా లివ్వలేదని నిలదీశారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్ లేదని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముస్లింలు లేకుండా బీసీలకే 42% రిజర్వేషన్లను కల్పిస్తారా? అని అసెంబ్లీలో తాము అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ సమాధానమివ్వలేదని తెలిపారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

అందరూ బాగుండేలా చూస్తా



బాలకృష్ణ

సినీ కార్మికుల సమ్మె నిర్ణయంతో ప్రస్తుతం టాలీవుడ్‌లో నెలకొన్న పరిస్థితులు తెలిసిందే. ఈ నేపథ్యంలో పలువురు నిర్మాతలు బుధవారం నందమూరి బాలకృష్ణను కలిశారు. ఈ సమావేశంలోని కీలక అంశాలను నిర్మాత ప్రసన్నకుమార్ మీడియాకు తెలిపారు. 'నిర్మాత బాగుండాలని బాలకృష్ణ ఎప్పుడూ చెబుతుంటారు. అదే విషయాన్ని మరోసారి గుర్తు చేశారు. వర్కింగ్ డేస్ ఎంత ఎక్కువ అయితే అంత మంచిదన్నారు. అవసరం మేరకే కార్మికులను తీసుకోవాలని సూచించారు. అటు నిర్మాతలు, ఇటు కార్మికులు అంతా బాగుండేలా తాను చూసుకుంటానన్నారు. థియేటర్ల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఏడాదికి నాలుగు సినిమాల్లో నటిస్తానని చెప్పారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మాటిచ్చారు' అని ప్రసన్నకుమార్ తెలిపారు.

రేపటితో సమస్య పరిష్కారమవుతుందని ఆశిస్తున్నా: సి కల్యాణ్

నిర్మాత సి.కల్యాణ్‌తో ఫిల్మ్ ఫెడరేషన్ ప్రతినిధులు బుధవారం సమావేశమయ్యారు. అనంతరం సి.కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ "ఇప్పటివరకూ పరిశ్రమలో ఏర్పడిన సమస్యలను సినిమా వాళ్లే పరిష్కరించుకున్నారు. ఒకప్పుడు దర్శకుడు దాసరి నారాయణ రావు ఇలాంటి సమస్యలను పరిష్కరించేవారు. ఇప్పుడున్న సినీ ప్రముఖులు ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారు. సినిమా వాళ్లకు ప్రభుత్వంతో పనిలేదు. టికెట్ల పెంపు కోసమే ప్రభుత్వాన్ని నిర్మాతలు సంప్రదిస్తారు. ఫిల్మ్ ఫెడరేషన్ కార్మికులకు అభద్రతా భావం లేదు. నిర్మాత విశ్వప్రసాద్ ఇక్కడ కార్మికులకు టాలెంట్ లేదనడం కరెక్ట్ కాదు. రేపటిలోగా ఈ సమస్య పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నాను' అని సి.కల్యాణ్ పేర్కొన్నారు.

నాకు సినీ కార్మికులపై ఎలాంటి కోపం లేదు: విశ్వ ప్రసాద్

'సినీ కార్మికులపై నాకు ఎలాంటి కోపం లేదు. నేను ఆవేశం, బాధతో ఆ వ్యాఖ్యలు చేయలేదు. పరిశ్రమలో జరుగుతున్న వ్యవహారంపైనే మాట్లాడాను. ఒక్కరు చేయాల్సిన పనిని ఇరవై మంది చేస్తామనడం సమంజసం కాదు. టాలీవుడ్‌లో స్కిల్ వర్కర్స్‌కు లోటు ఉంది. నేనయితే స్కిల్ ఉన్న వారితోనే సినిమాలు చేయాలనుకుంటున్నాను. అయితే పరిశ్రమలో నా ఒక్కడి నిర్ణయం నడవదు కాబట్టి, అందరం కలసి ఓ నిర్ణయం తీసుకుంటాము' అని నిర్మాత విశ్వప్రసాద్ పేర్కొన్నారు.

ఈ సమ్మెతో మాకు సంబంధం లేదు: వద్దే కరుణాకర్ రెడ్డి

'తెలుగు చలనచిత్ర పరిశ్రమలో జరుగుతున్న సమ్మెకి, తెలంగాణ సినిమా ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌లో ఉన్న కార్మిక సంఘాలకు సంబంధం లేదు' అని ఫెడరేషన్ అధ్యక్షుడు వద్దే కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. 'ఈ సమ్మె మా దృష్టికి రాలేదు. మా ఛాంబర్ తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో అనుసంధానమై ఉంది. చలన చిత్ర నిర్మాతల మండలితోనే కలిసి పని చేస్తాం. తెలంగాణ ఫెడరేషన్‌లోని వారు అన్ని విభాగాల్లోనూ పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారు. వివాదాన్ని తెలంగాణ కార్మిక శాఖ కమిషనర్‌కు, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లాం' అని అన్నారు.

శక్తిమంతమైన పాత్రలో మనోజ్



మంచు మనోజ్ హీరోగా హనుమ రెడ్డి యక్కంటి ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. మోతుకూరి భరత్, నల్ల గంగుళ వెంకట్‌రెడ్డి నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు మేకర్స్. 'డేవిడ్ రెడ్డి' అనే టైటిల్‌తో వస్తున్న ఈ సినిమాను 1897 నుంచి 1922 మధ్యకాలంలో జరిగే హిస్టారికల్ యాక్షన్ డ్రామాగా రూపొందిస్తున్నారు. తన కెరీర్‌లో మునుపెన్నడూ పోషించనటువంటి శక్తిమంతమైన పాత్రలో మనోజ్ కనిపించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉన్న ఈ చిత్రం త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనుంది.



వారి కథల స్ఫూర్తితో..

'ముప్పై రోజుల్లో ప్రేమించడం ఎలా' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న డైరెక్టర్ మున్నా ధులిపూడి నుంచి వస్తోన్న మరో చిత్రం 'బ్యాడ్ గర్ల్స్'. 'కానీ చాలా మంచోళ్లు' దీని ట్యాగ్‌లైన్. అంచల్‌గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్న లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. సూర్య, మొయిన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శశిధర్ నల్లా, ఎమ్మాడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రం టైటిల్ మోషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. దర్శకులు చందూ మొండేటి, శివ నిర్వాణ, కృష్ణ చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దర్శకుడు శివ నిర్వాణ మాట్లాడుతూ 'నలుగురు కొత్త అమ్మాయిలను పెట్టి సినిమా తీయడం నిజంగా సాహసమే' అని అన్నారు. చిత్ర దర్శకుడు మున్నా మాట్లాడుతూ 'అమ్మాయిలకు పెళ్లికి ముందు ఉండే స్వేచ్ఛ, ఆ తర్వాత ఉండదు. అలాంటి చాలా మంది అమ్మాయిల కథల స్ఫూర్తితో ఈ సినిమా తీశాను' అని అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ఇది కుటుంబ కథా చిత్రం. ప్రతి ఫ్యామిలీ చూసి ఎంజాయ్ చేయాలని కోరుతున్నాం' అని అన్నారు.

హృదయాలను హత్తుకుంటుంది



\- నటుడు ప్రవీణ్

'ఈ సినిమాలో కథను నడిపించే పరమేశ్ అనే పాత్రలో కనిపిస్తాను. నా క్యారెక్టర్‌లో వినోదంతో పాటు భావోద్వేగాలూ ఉంటాయి.. మన జీవితంలోకి వచ్చిన మంచి స్నేహితుడు అనివార్య కారణాల వల్ల వెళ్లిపోవాల్సి వస్తే మనసుకు బాధ కలుగుతుంది. ఈ తరహా భావోద్వేగం ఈ సినిమాలో కూడా ఉంటుంది. ఇది అందరి హృదయాలను హత్తుకుంటుంది' అని అన్నారు నటుడు ప్రవీణ్. ఆయన ముఖ్యపాత్రలో నటించిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్‌జే శివ దర్శకత్వంలో లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మించారు. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రవీణ్ చిత్ర విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'కథలో హారర్, థ్రిల్లర్, మైథాలజీ ఇలా అన్ని అంశాలూ ఉన్నాయి. దర్శకుడు సినిమాను చాలా క్లారిటీగా తెరకెక్కించారు. సినిమాలో తిండిపోతు దెయ్యం పెట్టే ఇబ్బంది చాలా వినోదాత్మకంగా, భావోద్వేగంగా ఉంటుంది. నిర్మాత శిరీష్ మా సినిమాను చూసి మంచి కథను ఎంచుకున్నారు అని ప్రశంసించారు. ఆయనకు బాగా నచ్చింది. అందుకే ఎస్వీసీ సంస్థ ద్వారా విడుదల చేస్తున్నాం' అని ప్రవీణ్ అన్నారు.




అందుకే దేనికీ స్పందించను

\- చిరంజీవి

'మనల్ని ఎవరైనా మాటలు అంటే మన మంచే వారికి సమాధానం చెబుతుంది. అందుకే నేను దేనికీ స్పందించను. మంచి చేసుకుంటూ వెళ్తాను. నాలాగా మంచి చేసే నా తమ్ముళ్లకు సాయంగా ఉంటాను' అని అన్నారు మెగాస్టార్ చిరంజీవి. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫీనిక్స్ ఫౌండేషన్, చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హీరో తేజా సజ్జా, హీరోయిన్ సంయుక్త అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'నేను కొన్ని రోజులుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నాను. ఈ మధ్య ఓ నాయకుడు నన్ను అకారణంగా మాటలు అన్నాడు. ఆ తర్వాత ఆయన ఓ ప్రాంతానికి వెళ్తే.. అక్కడ ఓ మహిళ ఆయనకు ఎదురు తిరిగింది. 'చిరంజీవి అన్నని మాటలు అనాలని మీకు ఎందుకు అనిపించింది' అంటూ భావోద్వేగానికి గురైంది. ఆ వీడియో చూసి ఆమె గురించి వివరాలు కనుక్కున్నాను. ఒకప్పుడు చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ద్వారా ఆమె బిడ్డ ప్రాణాలు నిలిచాయని, అందుకే నేనంటే ఆమెకు గౌరవమని తెలిపింది. ఆ మాటలు విని నా హృదయం ఉప్పొంగింది. ఇలాంటి కార్యక్రమాలు ఎవరు చేసినా, ఎప్పుడు చేసినా నన్ను పిలవండి. నేను మీకు అందుబాటులో ఉంటాను' అని అన్నారు. కార్యక్రమంలో ఫీనిక్స్ గ్రూప్ ఛైర్మన్ సురేశ్ చుక్కపల్లి తదితరులు మాట్లాడారు.

బెట్టింగ్ కాదు.. గేమింగ్ యాప్

\- విజయ్ దేవరకొండ



తాను ప్రమోట్ చేసింది బెట్టింగ్ యాప్ కాదని, గేమింగ్ యాప్ అని నటుడు విజయ్ దేవరకొండ వివరించారు. దేశంలో బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్ రెండూ వేర్వేరుగా ఉన్నాయని చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన కేసులో విజయ్ దేవరకొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం తిరిగి వెళ్లే సమయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ప్రమోట్ చేసిన ఏ23 యాప్ గేమింగ్‌కు సంబంధించినదని, అన్ని అనుమతులతో కొనసాగుతున్నదని చెప్పారు. ఏ23 యాప్ తెలంగాణలో ఓపెన్ కాదని తెలిపారు. అన్ని అనుమతులు, న్యాయపరమైన అంశాల్ని పరిశీలించిన తర్వాతే తాను లీగల్‌గా ఉన్న గేమింగ్ యాప్స్‌ను మాత్రమే ప్రమోట్ చేసినట్లు ఆయన వెల్లడించారు. గేమింగ్ యాప్స్ కంపెనీతో చేసుకున్న కాంట్రాక్ట్, యాప్స్ నుంచి జరిగిన లావాదేవీలకు సంబంధించి అన్ని వివరాలను ఈడీ అధికారులకు అందించానని విజయ్‌దేవరకొండ తెలిపారు. కాగా, ఈడీ హైదరాబాద్ జోనల్ జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం సుమారు 4 గంటల పాటు విజయ్ దేవరకొండను విచారించింది. అవసరమైతే మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని ఈడీ అధికారులు చెప్పి పంపించారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

'చిత్రాలయం' కొత్త సినిమా



చిత్రాలయం స్టూడియోస్ బేనర్‌పై వేణు దోనెపూడి నిర్మాతగా గుణి మంచికంటి దర్శకత్వంలో కొత్త సినిమా ప్రారంభమైంది. ఈ చిత్రానికి కొండల్ జిన్నా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రారంభోత్సవానికి చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి రమేశ్ ప్రసాద్ అక్కినేని స్క్రిప్ట్‌ను అందించగా, ఆదిశేషగిరి రావు క్లాప్ కొట్టారు. కె.ఎస్.రామారావు కెమెరా స్విచ్చాన్ చేశారు. పి. మహేశ్ బాబు గౌరవ దర్శకత్వం వహించారు. నేపాల్ రాజవంశానికి చెందిన సమృద్ధి ఈ చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. టీను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

సిరాజ్ మియా ఆగయా..

స్వస్థలానికి స్టార్ పేసర్ ● అభిమానుల సాదర స్వాగతం



హైదరాబాద్: భారత జట్టు స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ ఇంగ్లండ్ పర్యటనను విజయవంతంగా ముగించుకొని హైదరాబాద్ విచ్చేశాడు. బుధవారం ఇక్కడకు చేరుకున్న సిరాజ్‌కు విమానాశ్రయంలో పెద్ద సంఖ్యలో అభిమానులు సాదర స్వాగతం పలికారు. అంతకుముందు ఫీల్డింగ్ కోచ్ దిలీప్‌తోపాటు సిరాజ్ లండన్ నుంచి తెల్లవారుజామున ముంబైలో దిగాడు. ఎయిర్‌పోర్టులో పలువురు ఫ్యాన్స్ సిరాజ్‌ను ఆటోగ్రాఫ్‌లతోపాటు సెల్ఫీలకోసం అడగడం కనిపించింది. ముంబైలో దిగిన వెంటనే మరో విమానంలో సిరాజ్ హైదరాబాద్ బయలుదేరాడు. ఇంగ్లండ్‌తో జరిగిన అన్ని (5) టెస్టుల్లోనూ ఆడిన సిరాజ్ మొత్తం 23 వికెట్లు తీసి రెండు జట్లలో టాప్ బౌలర్‌గా నిలిచాడు. ముఖ్యంగా చివరి టెస్టులో తొమ్మిది వికెట్ల ప్రదర్శనతో జట్టు చిరస్మరణీయ విజయం అందుకోవడంలో 31 ఏళ్ల హైదరాబాదీ కీలక భూమిక పోషించాడు. మరీ ముఖ్యంగా..విజయానికి ఇంగ్లండ్ ఏడు పరుగుల దూరంలో నిలిచి టీమిండియాను ఆందోళనకు గురి చేసిన తరుణంలో ఓ అద్భుత యార్కర్‌తో అట్కిన్సన్‌ను బౌల్డ్ చేసిన సిరాజ్ ఇంగ్లండ్ ఆశలకు తెరదించాడు. హైదరాబాద్ విమానాశ్రయంలో దిగిన సిరాజ్..సోదరుడు స్వయంగా నడుపుతుండగా కారులో ఇంటికి వెళ్లిపోయాడు. మరోవైపు సిరాజ్‌ను సన్మానించేందుకు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఏర్పాట్లు చేస్తోంది. 'సిరాజ్‌తో ఇంకా మాట్లాడలేదు. అయితే అతడు నగరంలో కొద్ది రోజులు ఉంటున్నందున తప్పకుండా సన్మానిస్తాం' అని హెచ్‌సీఏ అధికారి ఒకరు తెలిపారు.

కెరీర్ బెస్ట్ ర్యాంక్

ఇంగ్లండ్‌తో ఆఖరి టెస్టును భారత్ గెలవడంలో కీలకపాత్ర పోషించిన మహ్మద్ సిరాజ్ ర్యాంకింగ్స్‌లో మరింత ముందుకెళ్లాడు. బుధవారం ఐసీసీ ప్రకటించిన తాజా టెస్టు ర్యాంకింగ్స్.. బౌలర్ల జాబితాలో సిరాజ్ ఏకంగా 12 స్థానాలు ఎగబాకాడు. తద్వారా 15వ ర్యాంక్‌తో మొదటిసారి టాప్-15లో నిలిచాడు. సిరాజ్‌కు కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ర్యాంక్ కావడం విశేషం. గతేడాది జనవరిలో 16వ ర్యాంక్ సాధించడమే సిరాజ్‌కు అత్యుత్తమం. ఇక, ఇంగ్లండ్‌తో సిరీస్‌లో కేవలం మూడు టెస్టులే ఆడిన బుమ్రా నెంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. మరో పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ 25 స్థానాలు ఎగబాకి 59వ ర్యాంక్‌లో నిలిచాడు. బ్యాటర్లలో యశస్వీ జైస్వాల్ మూడు స్థానాలు మెరుగై 5వ ర్యాంక్‌కు చేరాడు. పంత్ ఓ స్థానం చేజారి 8వ స్థానంలో ఉన్నాడు. ఇంగ్లండ్ బ్యాటర్లు రూట్, బ్రూక్ వరుసగా తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

నువ్వు గొప్పోడివి

సిరాజ్‌కు కోహ్లీ సోదరి ప్రశంస

ఓవల్‌లో జరిగిన చివరి టెస్టులో సూపర్ బౌలింగ్‌తో అదరగొట్టిన సిరాజ్‌ను కోహ్లీ సోదరి భావనా కోహ్లీ ధింగ్రా ప్రశంసల్లో ముంచెత్తింది. 'అభిమానులను అలరించడంలో క్రికెట్ ఎప్పుడూ విఫలం కాదు. మనలో స్ఫూర్తి నింపుతూ, ఆత్మవిశ్వాసం కల్పిస్తూ, నమ్మకం పెంచి, సానుకూల దృక్పథం కలిగించే హీరోలు ఎప్పుడూ ఈ ఆటలో ఉంటారు. అలాంటి వారిలో నీవు ఒకడివి' అని ఇన్‌స్టాలో భావన ఉద్వేగభరిత పోస్ట్ చేసింది. లార్డ్స్‌లో ఉద్విగ్నభరితంగా ఉన్న, ఓవల్ మ్యాచ్‌లో సంబరాలు చేసుకుంటున్న సిరాజ్ ఫొటోలను ఆ పోస్ట్‌కు జత చేసింది.

ఆర్‌టీఐ నుంచి తప్పించుకొన్న బీసీసీఐ!

న్యూఢిల్లీ: నూతన క్రీడా బిల్లు ద్వారా బీసీసీఐకు భారీ ఊరట లభించింది. క్రీడా మంత్రిత్వ శాఖ చేసిన సవరణల ప్రకారం బీసీసీఐ.. సమాచార హక్కు (ఆర్‌టీఐ) పరిధిలోకి రాదు. దీంతో బయట వ్యక్తులు డిమాండ్ చేసే వివరాలను వెల్లడించాల్సిన పనిలేదు. ఈ నెల 23న కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ లోక్‌సభలో ప్రవేశపెట్టిన జాతీయ క్రీడా పాలన బిల్లులోని క్లాజ్ 15(2) ప్రకారం.. ప్రభుత్వం నుంచి నిధులు, సదుపాయాలు అందుకొంటున్న జాతీయ క్రీడా సమాఖ్యలు మాత్రమే ఆర్‌టీఐ పరిధిలోకి వస్తాయని స్పష్టంగా ఉంది. అత్యంత ధనిక బోర్డుగా గుర్తింపు పొందిన బీసీసీఐ.. నిధుల కోసం ప్రభుత్వంపై ఏమాత్రం ఆధారపడదు. సొంతంగానే మైదానాలు, మౌలిక వసతులను ఏర్పాటు చేసుకొంటోంది. మిగతా సమాఖ్యల తరహాలోనే భారత బోర్డును సమాచార హక్కు పరిధిలోకి తీసుకురావాలన్న డిమాండ్ కొంతకాలంగా బలంగా వినిపిస్తున్నా.. బీసీసీఐ మాత్రం ససేమిరా అంటోంది. కొత్త క్రీడా బిల్లులో ఈ సవరణ బీసీసీఐకు అనుకూలం కానుంది.

కర్మ ఎవర్నీ వదిలిపెట్టదు!

● స్టోక్స్‌కు అశ్విన్ చురక



న్యూఢిల్లీ: 'కర్మ' ఎవరినీ వదలిపెట్టదని, అది వెంటాడుతూనే ఉంటుందని ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్‌నుద్దేశించి భారత జట్టు మాజీ స్పిన్నర్ అశ్విన్ అన్నాడు. ఇంగ్లండ్‌తో మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టెస్ట్ తొలిరోజు ఆటలో భారత కీపర్ పంత్ తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. కుడి పాదానికి ఫ్రాక్చర్ అయినా పంత్ రెండో రోజు బ్యాటింగ్‌కు దిగాడు. ఈ నేపథ్యంలో..గాయపడిన వారి స్థానంలో సబ్‌స్టిట్యూట్ ఆటగాడిని అనుమతించే విధానం టెస్ట్ క్రికెట్‌లో ప్రవేశపెట్టాలని భారత జట్టు కోచ్ గంభీర్ సూచించాడు. కానీ గంభీర్ సూచన 'హాస్యాస్పదం'గా ఉందంటూ స్టోక్స్ కొట్టి పారేశాడు. అయితే చివరి టెస్ట్‌లో ఇంగ్లండ్‌కూ అదే పరిస్థితి ఎదురైంది. భుజం గాయమైనా ఇంగ్లండ్ పేసర్ వోక్స్ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగాల్సి వచ్చింది. దీనిపై అశ్విన్ స్పందిస్తూ 'నీ కర్మ నీపై తక్షణమే ప్రభావం చూపుతుంది. నువ్వు ఏది విత్తుతావో అదే నీకు దక్కుతుంది' అని వ్యాఖ్యానించాడు.

నాకు కాదు.. రూట్‌కు ఇవ్వాల్సింది

ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డుపై బ్రూక్



లండన్: డ్రాగా ముగిసిన భారత్, ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌లో తనకు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు దక్కడంపై ఇంగ్లిష్ స్టార్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ స్పందించాడు. ఆ అవార్డుకు నిజమైన అర్హుడు జో రూట్ అని అన్నాడు. ఇంగ్లండ్ క్రికెట్ జట్టు సంప్రదాయం ప్రకారం సదరు సిరీస్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' ఎవరికివ్వాలన్నది ఇరుజట్ల కోచ్‌లు నిర్ణయించాలి. దీంతో బ్రూక్‌ను టీమిండియా కోచ్ గంభీర్, గిల్‌ను ఇంగ్లండ్ కోచ్ మెకల్లమ్ ఎంపిక చేయడంతో ఇద్దరికి కలిపి అవార్డు ఇచ్చిన సంగతి తెలిసిందే. 'ఈ సిరీస్‌లో రూట్ చేసినన్ని పరుగులు నేను చేయలేదు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌కు రూట్ అర్హుడు. అతనికే ఇవ్వాల్సింది' అని బ్రూక్ తెలిపాడు. ఐదు మ్యాచ్‌ల ఆ టెస్టు సిరీస్‌లో 9 ఇన్నింగ్స్‌ల్లో బ్రూక్ 53.44 సగటుతో 481 రన్స్ చేయగా.. రూట్ 67.12 సగటుతో 537 పరుగులు కొల్లగొట్టాడు.

చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ నేటికి వాయిదా

చెన్నై: అగ్ని ప్రమాదం కారణంగా చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నీ ఆరంభాన్ని గురువారానికి వాయిదా వేశారు. వాస్తవంగా పోటీలు బుధవారం మొదలు కావాలి. అయితే, టోర్నీ నిర్వహిస్తున్న హయత్ రీజెన్సీ హోటల్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో అర్ధరాత్రి హోటల్‌లో ఉన్న వారిని ఖాళీ చేయించారు. ఆటగాళ్లందరూ సురక్షితంగా ఉన్నారని నిర్వాహకులు తెలిపారు. ఒకరోజు ఆలస్యం కావడంతో.. విశ్రాంతి దినాన్ని షెడ్యూల్ నుంచి తొలగించినట్టు చెప్పారు. తెలుగు గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, ద్రోణవల్లి హారికతోపాటు ప్రముఖ అంతర్జాతీయ ఆటగాళ్లు కూడా ఈ టోర్నీలో పాల్గొంటున్నారు.

స్విటోలినాను చంపేయాలి!

బెట్టింగ్ రాయుళ్ల ఆన్‌లైన్ వేధింపులు



మాంట్రియల్: ఓ మ్యాచ్‌లో ఓడడంతో ఉక్రెయిన్ ప్లేయర్ ఎలెనా స్విటోలినా ఆన్‌లైన్ వేధింపులను ఎదుర్కోవాల్సి వచ్చింది. మాంట్రియల్ ఓపెన్ క్వార్టర్స్‌లో నవోమి ఒసాక చేతిలో వరల్డ్ నెం.13 స్విటోలినా 2-6, 2-6తో ఓడింది. దీంతో గ్యాంబ్లర్లు.. ఆన్‌లైన్‌లో ఆమెను కించపరిచే సందేశాలు పంపారు. ఆమెను రష్యా చంపేయాలని కోరుకొంటున్నట్టు ఓ బెట్టింగ్ రాయుడు రాశాడు. అంతేకాకుండా స్విటోలినా భర్త, నల్లజాతీయుడైన గేల్ మోన్‌ఫిల్స్‌ను ఉద్దేశించి జాతివివక్ష వ్యాఖ్యలు చేశాడు. ఆయా స్క్రీన్‌షాట్లను షేర్ చేసిన స్విటోలినా.. ఇన్‌స్టాలో ఘాటుగా రిప్లై ఇచ్చింది. 'ఓ మహిళ.. అందునా అమ్మపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి సిగ్గుగా లేదా? మీ అమ్మే ఈ మెసేజ్‌లను చూస్తే తప్పకుండా అసహ్యించుకొంటుందని పేర్కొంది. స్విటోలినా ఓడిపోవడంతో ఆమెపై బెట్టింగ్ పెట్టిన వ్యక్తులు అసహనంతో ఈ మెసేజ్‌లు చేసినట్టు తెలుస్తోంది.

పేద విద్యార్థినికి పంత్ సాయం



న్యూఢిల్లీ: పేద విద్యార్థినికి సాయం చేసిన టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ తన దయార్ద్ర హృదయాన్ని చాటుకొన్నాడు. కర్ణాటకలోని బెళగావికి చెందిన జ్యోతి అనే విద్యార్థిని డిగ్రీ కాలేజీలో చేరడానికి ఆర్థిక సాయం చేశాడు. జ్యోతి తండ్రి చిన్న టీ కొట్టు నడుపుతున్నాడు. 83 శాతం మార్కులతో ఇంటర్ పాసైన జ్యోతి.. బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బీసీఏ) డిగ్రీలో చేరాలనుకొంది. కానీ, పేదరికంతో ఫీజు కట్టే పరిస్థితి లేదు. ఈ విషయం ఊళ్లోని ఓ వ్యక్తికి చెప్పడంతో.. అతడు తన మిత్రుడి ద్వారా బాలిక స్థితిని పంత్ దృష్టికి తీసుకెళ్లాడు. తక్షణం స్పందించిన రిషభ్.. తొలి సెమిస్టర్ ఫీజు రూ.40 వేలను కాలేజీ ఖాతాలో జమచేశాడు. తన చదువుకు సాయం చేసిన పంత్‌కు జ్యోతి కృతజ్ఞతలు తెలిపింది. ఈ విషయం బయటకు రావడంతో పంత్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది.

ఆసియా బాక్సింగ్ ఫైనల్స్‌కు నలుగురు

బ్యాంకాక్: ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి నలుగురు ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. నీరజ్ (75 కిలోలు), ఇషాన్ (90+ కి), మహిళల్లో యాత్రి (57 కి), ప్రియ (60 కి) సెమీఫైనల్స్‌లో తమ ప్రత్యర్థులను ఓడించి తుదిపోరులో నిలిచారు. ఇక, మిగతా భారత బాక్సర్లలో హర్ష్ (60 కి), మయూర్ (90 కి), రాకీ (85 కి), అంకుష్ (64 కి), మహిళల్లో భావన శర్మ (48 కి), పార్థవి గ్రేవాల్ (60 కి), వర్ణంజల్ యాదవ్ (65 కి), శృతి (75 కి) సెమీఫైనల్స్‌లో ఓటమిపాలై కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు.

యూఎస్ ఓపెన్ సింగిల్స్ విజేతకు రూ. 43 కోట్లు

● భారీగా పెరిగిన ప్రైజ్‌మనీ

న్యూయార్క్: టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్ స్లామ్ యూఎస్ ఓపెన్ ప్రైజ్‌మనీ భారీగా పెరిగింది. పురుషులు, మహిళల సింగిల్స్ విజేతలకు ఇచ్చే ప్రైజ్‌మనీని గతంలో కంటే ఏకంగా 39 శాతానికి పెంచారు. నిరుడు సింగిల్స్ చాంపియన్ రూ. 31.57 కోట్లు తీసుకోగా.. ఇకనుంచి విజేతకు రికార్డుస్థాయిలో రూ. 43.86 కోట్లు దక్కనుంది. రన్నరప్‌నకు రూ. 21.93 కోట్లు లభించనుంది. సెమీఫైనలిస్టులు రూ. 11 కోట్లు చొప్పున అందుకోనున్నారు. ఓవరాల్ టోర్నీ ప్రైజ్‌మనీ రూ. 745 కోట్లు. 4 గ్రాండ్‌స్లామ్స్‌లో యూఎస్ ఓపెన్ ప్రైజ్‌మనీనే అధికం. సింగిల్స్ విజేతలకిచ్చే ప్రైజ్‌మనీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రూ. 20 కోట్లు, ఫ్రెంచ్ ఓపెన్‌లో రూ. 25 కోట్లు, వింబుల్డన్‌లో రూ. 35 కోట్లుగా ఉంది. యూఎస్ ఓపెన్ ఈనెల 24న మొదలుకానుంది.

బంతికి వేజ్‌లైన్ పూశారు

టీమిండియాపై పాక్ మాజీ క్రికెటర్ అక్కసు



కరాచీ: ఇంగ్లండ్‌పై ఓవల్ టెస్ట్‌లో భారత జట్టు చారిత్రక విజయాన్ని జీర్ణించుకోలేని పాకిస్థాన్ మాజీ పేసర్ షబ్బీర్ అహ్మద్ అవాకులు చవాకులు పేలాడు. '80 ఓవర్ల తర్వాత కూడా ఆ బంతి కొత్తదానిలా మెరిసిందంటే భారత ఆటగాళ్లు దానికి వేజ్‌లైన్ పూసి ఉంటారు. ఆ బంతిని అంపైర్లు ల్యాబ్‌కు పంపి పరీక్షించాలి' అని షబ్బీర్ అక్కసు వెళ్లగక్కాడు. అయితే షబ్బీర్ వ్యాఖ్యలపై నెటిజన్లు మండిపడుతున్నారు. అనుమానాస్పద బౌలింగ్ కారణంగా అంతర్జాతీయ క్రికెట్ నుంచి నిషేధానికి గురైన షబ్బీర్‌కు టీమిండియా గురించే మాట్లాడే అర్హత లేదని దుయ్యబట్టారు.

బిజినెస్

వడ్డీ కోతకు ట్రంపే అడ్డు!

రెపో రేటు యథాతథంగా కొనసాగింపు



● ద్రవ్యోల్బణం అంచనా 3.1 శాతానికి కుదింపు
● ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్ష

ముంబై: పండగ సీజన్‌లో వడ్డీరేట్లు మరింత తగ్గుతాయని ఎదురుచూస్తున్న రుణగ్రహీతల ఆశలపై ట్రంప్ సుంకాలు నీళ్లు చల్లాయి. అమెరికా అధ్యక్షుడి అస్థిర వాణిజ్య విధానాలు, భారత్‌పై రెట్టింపు సుంకాల వడ్డనతో పొంచి ఉన్న ముప్పు దృష్ట్యా ఈ సారి కీలక రెపోరేటును యథాతథంగా కొనసాగించాలని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా నిర్ణయించింది. అలాగే, వడ్డీరేట్లపై తటస్థ దృక్పథాన్ని కూడా యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ఎంపీసీ తెలిపింది. వర్షపాతం ఆశాజనకంగా ఉండడంతో పాటు పండగ సీజన్ కొనుగోళ్లు ఆర్థిక వృద్ధికి ఊతమివ్వనున్నప్పటికీ, అంతర్జాతీయ వాణిజ్య సవాళ్లు ఇంకా కొనసాగుతున్నాయని ఆర్‌బీఐ గవర్నర్ అన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఆర్‌బీఐ రెపో రేటును 1% తగ్గించింది. ఈ ప్రయోజనం ఆర్థిక వ్యవస్థకు బదిలీ అయ్యే ప్రక్రియ ఇంకా కొనసాగుతోందన్నారు. టారిఫ్‌ల అనిశ్చితి తొలిగితే, వచ్చే సమీక్షలో రెపోరేటును మరో 0.25 శాతం తగ్గించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

వృద్ధి- ద్రవ్యోల్బణం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధిరేటును గతంలో అంచనా వేసిన 6.5 శాతంగా కొనసాగిస్తున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. అంతర్జాతీయ సవాళ్లు, అనిశ్చితులు పెరుగుతున్నప్పటికీ భారత్ స్థిర ధరలతో నిలకడగా వృద్ధి చెందుతోందని సంజయ్ మల్హోత్రా అన్నారు. ఈ సారి సాధారణ స్థాయి కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశాలు, ధరలు తగ్గుముఖం పట్టడం, ఉత్పత్తి సామర్థ్య వినియోగం పెరగడం, సానుకూల ఆర్థిక పరిస్థితులు దేశీయ ఆర్థిక కార్యకలాపాలకు మద్దతివ్వనున్నాయని ఆర్‌బీఐ పేర్కొంది. దేశీయ సేవల రంగం చురుకుగా వృద్ధి చెందుతున్నదని, మున్ముందు నెలల్లో నిర్మాణం, వాణిజ్యం పుంజుకోనుందని ఆర్‌బీఐ ఈ సందర్భంగా ప్రస్తావించింది.

● ఈ ఆర్థిక సంవత్సరానికి వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాను మాత్రం గతంలో ప్రకటించిన 3.7 శాతం నుంచి 3.1 శాతానికి తగ్గించింది. అయితే, ఈ జూన్‌లో ఆరేళ్ల కనిష్ఠ స్థాయి 2.1 శాతానికి జారుకున్న ద్రవ్యోల్బణం ఆర్థిక సంవత్సరాంతంలో మళ్లీ ఎగబాకి 4 శాతం దాటవచ్చునని ఆర్‌బీఐ గవర్నర్ హెచ్చరించారు.

ద్రవ్యోల్బణంపై సుంకాల ప్రభావం ఉండదు

రిటైల్ ద్రవ్యోల్బణంపై అమెరికా సుంకాల ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని మల్హోత్రా అన్నారు. ఒకవేళ అమెరికాపై భారత్ ప్రతీకార సుంకాలు విధిస్తే కొంత ప్రభావం పడే అవకాశం ఉన్నప్పటికీ, మన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవచ్చన్నారు. వినియోగదారుల ధరల సూచీలో (సీపీఐ) 50 శాతం ఆహారోత్పత్తులేనని.. అంతర్జాతీయ పరిణామాలతో వాటి ధరలకు సంబంధం లేదన్నారు.

ట్రంప్ వ్యాఖ్యకు దీటైన స్పందన

భారత్ మృత ఆర్థిక వ్యవస్థ అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యకు ఆర్‌బీఐ గవర్నర్ తనదైన శైలిలో స్పందించారు. భారత ఆర్థిక వ్యవస్థ పరిస్థితి చాలా బాగుందని, ప్రపంచ ఆర్థిక వృద్ధిలో అమెరికా కంటే భారత్ పాత్రే అధికమని ఆయన అన్నారు. ఈ సారి మన జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగా ఉండవచ్చు. 2025లో ప్రపంచ జీడీపీ వృద్ధిరేటు 3 శాతంగా ఉండవచ్చని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) అంచనా వేసింది. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో భారత్ వాటా 18 శాతంగా ఉండగా.. అమెరికా వాటా దాదాపు 11 శాతమేనని మల్హోత్రా అన్నారు. మన దేశం వేగంగా వృద్ధి చెందుతున్న నేపథ్యంలో మున్ముందు ప్రపంచ వృద్ధితో మన వాటా మరింత పెరగనుందన్నారు.

ట్రెజరీ బిల్లుల్లో పెట్టుబడులకూ సిప్

చిన్న మదుపరులకు ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులను మరింత సులభతరం చేసేందుకు ఆర్‌బీఐ మరో కీలక నిర్ణయం తీసుకుంది. క్రమానుగత పెట్టుబడి పథకాల (సిప్) ద్వారా రిటైల్ మదుపరులు ప్రభుత్వ ట్రెజరీ బిల్లుల్లో పెట్టుబడి పెట్టేందుకు తన రిటైల్ డైరెక్ట్ ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తేవాలనుకుంటోంది. ఇన్వెస్ట్‌మెంట్, రీ-ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్లతో కూడిన ఆటో-బిడ్డింగ్ వసతిని రిటైల్ డైరెక్ట్ వేదిక ద్వారా ప్రవేశపెట్టనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. తద్వారా మదుపరులు ట్రెజరీ బిల్లుల ప్రాథమిక వేలంలో ఆటోమేటిక్‌గా బిడ్లను సమర్పించే వెసులుబాటు లభిస్తుంది.

ఖాతాలు, లాకర్ల క్లెయిమ్‌ల సెటిల్మెంట్ సరళం

మృతి చెందిన కస్టమర్లకు చెందిన బ్యాంక్ ఖాతాలు, లాకర్ల క్లెయిమ్ సెటిల్‌మెంట్ విధానాలను ప్రామాణీకరించనున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ తెలిపారు. చనిపోయిన కస్టమర్ల నామినీల క్లెయిమ్‌ల పరిష్కారాన్ని మరింత సరళీకరించడమే తమ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ముసాయిదా చర్చా పత్రాన్ని త్వరలోనే జారీ చేయనున్నట్లు ఆయన చెప్పారు.

జీడీపీ, ఐఐపీ, సీపీఐకి కొత్త ప్రామాణిక సంవత్సరం

స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ), పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ), వినియోగదారుల ధరల సూచీలకు (సీపీఐ) బేస్ ఇయర్‌ను మార్చనున్నట్లు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు వెల్లడించింది. జీడీపీ, ఐఐపీకి 2022-23 ఆర్థిక సంవత్సరాన్ని, సీపీఐకి 2024ను బేస్ ఇయర్‌గా ప్రతిపాదించింది. ఆయా సూచీల మదింపు పద్ధతిని నవీకరించడంతో పాటు అదనపు డేటా చేర్చడం ద్వారా ఆర్థిక వ్యవస్థలో జరుగుతున్న నిర్మాణాత్మక మార్పులను మరింత సూక్ష్మంగా గ్రహించేందుకు ప్రామాణిక సంవత్సరాలను కాలానుగుణంగా మార్చడం జరుగుతుందని లోక్‌సభకు కేంద్ర గణాంక శాఖ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చింది.

వచ్చే ఏడాది ఇండోసోల్ సోలార్ ఐపీఓ

హైదరాబాద్ : స్థానిక శిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఐపీఓకు సిద్ధమవుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం ఐపీఓ ఉంటుందని శిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ సీఎండీ ఎన్ విశ్వేశ్వర రెడ్డి చెప్పారు. ఒకవేళ ఏ కారణం చేతైనా ఇండోసోల్ సోలార్ ఐపీఓ కుదరకపోతే శిరిడీ సాయి ఎలక్ట్రికల్ ఐపీఓ ఉంటుందన్నారు. సోలార్ ఫొటోవోల్టాయిక్ (పీవీ) మాడ్యూళ్ల తయారీ కోసం ఇండోసోల్ సోలార్ నెల్లూరు జిల్లాలోని కరేడు వద్ద ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. ఈ ప్లాంటులో వచ్చే ఏడాది చివరి కల్లా 1,000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన సోలార్ పీవీల ఉత్పత్తి ప్రారంభమవుతుందని విశ్వేశ్వర రెడ్డి తెలిపారు. ఈ ప్లాంటుకు కేంద్ర ప్రభుత్వం పీఎల్ఐ పథకం కింద రూ.5,175 కోట్ల ప్రత్యేక ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నట్టు చెప్పారు. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు కోసం రూ.69,000 కోట్లు ఖర్చు చేయబోతున్నట్టు వెల్లడించారు.

రూ.3.5 లక్షల కోట్లు హాంఫట్

రెండో రోజూ నష్టాలే

ముంబై: ఆర్‌బీఐ రెపోరేటును యథాతథంగా కొనసాగించిన నేపథ్యంలో స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టపోయింది. సెన్సెక్స్ 166.26 పాయింట్ల నష్టంతో 80,543.99 వద్ద ముగియగా నిఫ్టీ 75.35 పాయింట్ల నష్టంతో 24,574.20 వద్ద ముగిసింది. దీంతో బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ రూ.3.50 లక్షల కోట్లు దిగజారి రూ.445.19 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 18 షేర్లు నష్టాలతో ముగిశాయి. ఒక్క బ్యాంకెక్స్ తప్ప మిగతా అన్ని సూచీలు నష్టాలతో ముగిశాయి. ఆర్‌బీఐ నిర్ణయం ప్రభావంతో వడ్డీరేట్లపై ఎక్కువగా ఆధారపడిన ఆటో, రియల్టీ, బ్యాంకింగ్ కంపెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి. కొన్ని కౌంటర్లయితే ఐదు శాతం వరకు నష్ట పోయాయి. సుంకాల భయం వెంటాడుతున్నా నిఫ్టీకి 24,500 వద్ద గట్టి మద్దతు లభించే అవకాశం ఉందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ సంస్థ రీసెర్చి హెడ్ వినోద్ నాయర్ అంచనా.

లిస్టింగ్‌లో సత్తా చూపిన ఎన్ఎస్‌డీఎల్

ఇటీవల ఐపీఓకు వచ్చిన ఎన్ఎస్‌డీఎల్ కంపెనీ షేర్లు బుధవారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్టయ్యాయి. రూ.800కు జారీ చేసిన ఈ కంపెనీ షేర్లు బీఎస్ఈలో 10 శాతం లాభంతో రూ.880 వద్ద లిస్టయ్యాయి. ఇంట్రాడేలో 18 శాతం లాభంతో రూ.943.75కు చేరినా చివరికి 17 శాతం లాభంతో రూ.936 వద్ద ముగిశాయి. దీంతో కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.18,720 కోట్లకు చేరింది. .

ఐదు ఐపీఓలకు లైన్ క్లియర్

ఐదు కంపెనీల ఐపీఓలకు సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వాటిలో ప్రిస్టేజ్ హాస్పిటాలిటీ వెంచర్స్, ఆనంద్ రాఠీ షేర్స్ అండ్ స్టాక్ బ్రోకర్స్, ఎస్ఎస్ఎఫ్ ప్లాస్టిక్స్ ఇండియా, గుజరాత్ కిడ్నీ అండ్ సూపర్ స్పెషాలిటీ, ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ కంపెనీలున్నాయి.


టీసీఎస్ ఉద్యోగుల వేతనాలు పెంపు

న్యూఢిల్లీ: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తన ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. వచ్చేనెల 1 నుంచి అమలులోకి వచ్చేలా 80% సిబ్బంది వేతనాలను పెంచుతున్నట్లు తెలిపింది. ఈ నిర్ణయంతో ప్రధానంగా జూనియర్, మధ్య స్థాయి (సీ3ఏ గ్రేడ్ వరకు) ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. ఈ ఏడాది 12,000 మందిని ఉద్యోగం నుంచి తొలగించనున్నట్లు టీసీఎస్ ఈ మధ్యనే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో కంపెనీ జీతాలను పెంచడం గమనార్హం.

స్టార్టప్‌లకు మద్దతుగా 100 కోట్ల నిధి

హైదరాబాద్: దేశానికి చెందిన అగ్రగామి వెంచర్ స్టూడియో బయోమి రూ.100 పెట్టుబడుల సమీకరణను పూర్తి చేసినట్టు ప్రకటించింది. బయోమి తన సమీకృత వ్యూహం, ప్రతిభ, మూలధన నమూనా ద్వారా ప్రతీ ఏడాది అధిక కట్టుబాటు గల స్టార్టప్‌లను గుర్తించి మద్దతు అందిస్తుంది. తొలి విడతలో బీవీఆర్ మోహన్ రెడ్డి (సైయెంట్), ప్రసాద్ యెర్నేని (ఎకోరెన్ ఎనర్జీ), అభినవ్ రెడ్డితో పాటు (గర్ కార్పొరేషన్) కొన్ని కుటుంబ గ్రూప్‌లను కూడా ఒక వేదిక పైకి తెచ్చింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




7వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	490
వరంగల్	442	గోదావరి	480
చిత్తూరు	513	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	99
వరంగల్	90	గుంటూరు	104
కరీంనగర్	90	ఒంగోలు	104
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	77
కర్నూలు	90	నెల్లూరు	82
విశాఖపట్నం	94	అనంతపురం	82
గోదావరి	99		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,02,330 ▲	93,800 ▲	1,26,000 ▲
విజయవాడ	1,03,700 ▲	97,500 ▲	1,16,700 ▲
విశాఖపట్నం	1,03,510 ▲	93,700 ▲	1,26,000 ▲
రాజమండ్రి	1,02,300 ▲	93,800 ▲	1,16,800 ▲
ప్రొద్దుటూరు	1,00,300 ▲	92,280 ▲	1,17,000 ▲
ముంబై	1,00,450 ▲	92,010 ▲	1,13,490 ▲

దివీస్ లాభం రూ.545 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి దివీస్ లేబరేటరీస్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను అందుకోలేక పోయాయి. ఈ కాలానికి కంపెనీ రూ.2,410 కోట్ల ఆదాయంపై రూ.756 కోట్ల స్థూల లాభం, రూ.545 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 14 శాతం, స్థూల లాభం 16.3 శాతం, నికర లాభం 27 శాతం పెరిగాయి. అయితే మార్కెట్ వర్గాలు ఈ త్రైమాసికంలో కంపెనీ రూ.2,437 కోట్ల ఆదాయంపై రూ.794.8 కోట్ల స్థూల లాభం, రూ.573.25 కోట్ల వరకు నికర లాభం నమోదు చేస్తుందని అంచనా వేశాయి. జూన్ త్రైమాసికంలో కంపెనీ స్థూల లాభ శాతం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 0.7 శాతం పెరిగి 31.4 శాతానికి చేరింది. క్యూ1 ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో బుధవారం బీఎస్ఈలో దివీస్ షేర్లు 4.29 శాతం నష్టపోయి రూ.6,134.25 వద్ద ముగిశాయి.

కిమ్స్ లాభాలకు గండి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక కృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లిమిటెడ్ (కిమ్స్) లాభాలకు గండి పడింది. జూన్ త్రైమాసికంలో కంపెనీ రూ.872 కోట్ల ఆదాయంపై రూ.79 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 27 శాతం, నికర లాభం మాత్రం 9.2 శాతం పడిపోయాయి. దీంతో కంపెనీ నిర్వహణాలాభం 26 శాతం నుంచి 22 శాతానికి తగ్గింది. ఇదే కాలంలో ఒక్కో పడకపై ఆస్పత్రికి వచ్చే సగటు ఆదాయం 11.8 శాతం పెరిగి రూ.43,011కు, ఒక్కో పేషెంట్‌పై వచ్చే సగటు ఆదాయం 9.8 శాతం వృద్ధితో రూ.1,53,094కు చేరినా క్యూ1లో కిమ్స్ హాస్పిటల్ నికర లాభం 9.2 శాతం పడిపోవడం విశేషం. బెంగళూరులో ఏర్పాటు చేసిన కిమ్స్ ఆస్పత్రి ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం నుంచి పని చేస్తుందని కంపెనీ తెలిపింది.

33 మందికి కొండా లక్ష్మణ్ అవార్డులు

» నేడు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రదానం

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న 33 మంది చేనేత వృత్తి కార్మికులు, డిజైనర్లను రాష్ట్ర ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులతో గురువారం సత్కరించనుంది. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో సుమారు వంద స్టాళ్లతో చేనేత ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్టు శైలజా రామయ్యర్ తెలిపారు. ఈ సందర్భంగా అవార్డులకు ఎంపికైన చేనేత కార్మికులు, వృత్తి నిపుణులు, డిజైన ర్లకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పురస్కారాలను ప్రదానం చేస్తారన్నారు. కాగా, చేనేత రంగానికి, నేతన్నల కుటుంబాలకు పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర నేతన్నలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ఖరీఫ్‌లో 4.71 లక్షల ఎకరాలకు సాగునీరు

» గోదావరి బేసిన్‌పై స్కైవమ్ నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో గోదావరి బేసిన్‌లోని భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల కింద 4.71 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని రాష్ట్రస్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీ (స్కైవమ్) నిర్ణయించింది. బుధవారం జలసౌధలో ఈఎన్‌సీ (జనరల్) మహ్మద్ అంజద్ హుస్సేన్ అధ్యక్షతన స్కైవమ్ కమిటీ రెండో సమావేశం జరిగింది. జలాశయాల్లో నీటి లభ్యత, అవసరాలపై చర్చించారు. ప్రస్తుతం నిల్వ పరిమితంగా 50.34 టీఎంసీలే ఉన్నందున 4,71,737 ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. ఇందులో 3,93,430 ఎకరాల్లో వరి పంటకు, 78,307 ఎకరాల్లో అరుతడి పంటలకు నీళ్లివ్వనున్నారు. కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నందున వాటి ద్వారా 10,30,082 ఎకరాల్లో వరి, 7,38,158 ఎకరాల్లో అరుతడి పంటలకు (మొత్తం 17.68 లక్షల ఎకరాలు) నీరివ్వాలని ఇప్పటికే నిర్ణయించిన సంగతి తెలిసిందే.

దేవాదాయశాఖ కార్యాలయంలో బదిలీలు

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయశాఖలో ప్రక్షాళన చేపట్టారు. సిబ్బంది - అధికారుల సీనియారిటీ ఖరారు, పదోన్నతులు, బదిలీలపై శాఖ డైరెక్టర్ వెంకట్రావు బుధవారం సమీక్షించారు. ఇతర విభాగాల నుంచి డిప్యూటేషన్ల రద్దు, పదోన్నతులపై సిబ్బంది ఆందోళన చేశారు. సీఎం, డిప్యూటీ సీఎం, దేవాదాయశాఖ మంత్రి వరకూ వెళ్లిన ఈ సమస్య పరిష్కారంపై వెంకట్రావు సహా శాఖ అధికారులు దృష్టి సారించారు. మరోవైపు, హైదరాబాద్‌లోని శాఖ ప్రధాన కార్యాలయంలో ఏళ్ల తరబడి ఒకే సెక్షన్‌లో కొనసాగుతున్న ఐదుగురు సూపరింటెండెంట్లను డైరెక్టర్ వెంకట్రావు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏ-సెక్షన్‌కు ఎన్ మల్లికార్జున్, బీ-సెక్షన్‌కు కె.గిరిధర్, సీ-సెక్షన్‌కు దుర్గా ప్రసాద్, డీ-సెక్షన్‌కు నిఖిల్ రాజ్ సక్సేనా, ఎఫ్-సెక్షన్‌కు బి.బాబు శంకర్‌లను బదిలీ చేశారు. మలి విడతలో సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లతోపాటు పలువురు ఉద్యోగుల బదిలీకి రంగం సిద్ధం చేశారు.

పంచాయతీల్లో పెండింగ్ బిల్లుల వివరాలివ్వండి

» డీపీఓలను కోరిన పీఆర్‌ఆర్‌డీ డైరెక్టర్ సృజన

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల వారిగా పెండింగ్ బిల్లుల వివరాలను సేకరించి పంపాలని కోరుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ సృజన అన్ని జిల్లాల పంచాయతీ అధికారులకు బుధవారం మెమో జారీ చేశారు. గ్రామాల్లో 2019-2024 మధ్యకాలంలో సర్పంచులు చేపట్టిన అభివృద్ధి పనులు, వాటికి సంబంధించిన బిల్లుల బకాయి వివరాలను పంపాలని అందులో పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులపై సుర్వి యాదయ్య సహా మరో 10 మంది మాజీ సర్పంచులు మానవ హక్కుల సంఘానికి (హెచ్‌ఆర్సీ) ఫిర్యాదు చేశారని.. దాని ఆధారంగా హెచ్‌ఆర్సీ పూర్తి వివరాలను కోరినట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు పూర్తి నివేదికను హెచ్‌ఆర్సీకి అందజేయాల్సి ఉంటుందని పీఆర్ డైరెక్టర్ వెల్లడించారు.

9 నుంచి నీట్ యూజీ కౌన్సెలింగ్

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం నిర్వహించే నీట్ యూజీ 2025 కౌన్సిలింగ్‌కు కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం కొత్త షెడ్యూల్‌ను ప్రకటించింది. ఆగస్టు 9న ప్రారంభమై అక్టోబరు-10తో ముగియనుంది. రాష్ట్రంలో కన్వీనర్, బీ, సీ కేటగిరి సీట్ల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ దాదాపు ముగిసింది. వాస్తవానికి జూలై 12న నీట్ షెడ్యూల్ ప్రకటించి విడుదల చేయగా స్థానికత అంశంపై పలువురు విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీం తీర్పు నేపథ్యంలో రాష్ట్ర కౌన్సెలింగ్‌ను కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం కొత్త షెడ్యూల్‌ను ప్రకటించింది. తెలంగాణలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 4090 ఎంబీబీఎస్ సీట్లుండగా, ప్రైవేటులో 4600 సీట్లున్నాయి.

4 రోజుల పాటు భారీ వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రాబోయే నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వాన పడుతుందని పేర్కొంది. గురువారం నల్గొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, వికారాబాద్, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఆ జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. అలాగే ఈనెల 10 వరకు పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీలో రసాభాస

» ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మైక్ లాక్కున్న మార్కెట్ చైర్మన్

» కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తల తోపులాట

ఆత్మకూరు(ఎస్), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ రసాభాసగా మారింది. నెమ్మికల్ గ్రామంలో నిర్వహించిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ హయాంలోనే ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందిందని, నదులను అనుసంధానం చేసి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్లివ్వడంతో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలమైందని అన్నారు. ఈ నేపథ్యంలో జగదీశ్ రెడ్డి ప్రసంగానికి కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుచెబుతూ వాదనకు దిగారు. తెలంగాణ ఉద్యమం పేరుతో బీఆర్‌ఎస్ పార్టీ వందల మంది ప్రాణాలను బలిగొందని, కేసీఆర్ కుటుంబం లక్షల కోట్లు దోచుకుందని విమర్శలకు దిగారు. అదే సమయంలో వేణారెడ్డి కలుగజేసుకుని, కాళేశ్వరం కాదది కూలేశ్వరం అని, పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, ఆత్మకూర్(ఎస్) మండలంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదని విమర్శిస్తూ జగదీశ్‌రెడ్డి నుంచి మైక్‌ను లాక్కున్నారు. దీంతో జగదీశ్‌రెడ్డి మరో మైక్‌ను తీసుకుని విమర్శలకు దిగారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు తోపులాటకు దిగారు. కలెక్టర్ కలుగజేసుకుని ఇది రాజకీయ వేదిక కాదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన వేదికని సర్దిచెప్పారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.

క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం యాప్ తేవాలి

» ఓలా, ఊబర్, రాపిడో డ్రైవర్ల ధర్నా

చిక్కడపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): క్యాబ్ డ్రైవర్ల కోసం నూతన యాప్ తేవాలని ఊబర్, ఓలా, రాపిడో క్యాబ్ డ్రైవర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కిలో మీటరు ప్రయాణానికి కనీస చార్జీ చెల్లించేలా రవాణా శాఖ జీవో ఎంస్ 46ను అమలు చేయాలని కార్మిక శాఖ కమిషన్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. తెలంగాణ యాప్ బేస్డ్ డ్రైవర్స్ ఫోరం నేతలు గాజుల కిరణ్, మహేందర్ మాట్లాడుతూ టాక్సీ, ఆటోలకు ఏకరీతిలో చార్జీలను ప్రభుత్వమే నిర్ధారించాలని కోరారు. అగ్రిగేటర్ కంపెనీలు.. నూతన క్యాబ్‌లకు కేటాయింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

ఫిలిప్పీన్స్‌కు 2 లక్షల టన్నుల బియ్యం

» తెలంగాణ సోనాకు అక్కడ మంచి డిమాండ్

» మన మొక్కజొన్నపైనా ఆసక్తి

» ఫిలిప్పీన్స్ వ్యవసాయ మంత్రితో ఉత్తమ్ భేటీ

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్ దేశానికి ఇప్పటివరకు 30 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి చేశామని, ఈ ఏడాది మరో 2 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం పంపేందుకు ఒప్పందం కుదిరిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం ఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ మంత్రి ఫ్రాన్సిస్కోతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఫిలిప్పీన్స్- తెలంగాణ మధ్య వాణిజ్య సంబంధాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సమావేశం అనంతరం మీడియాతో ఉత్తమ్ మాట్లాడారు. తెలంగాణలో పండించే ఆర్ఎన్ఆర్- 15048 (తెలంగాణ సోనా) రకం బియ్యానికి ఫిలిప్పీన్స్‌లో మంచి డిమాండ్ ఉందని, అందుకే ఎగుమతుల పరిధిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఈ చర్చల్లో కేవలం బియ్యమే కాకుండా, తెలంగాణలో పండే మొక్కజొన్న ఎగుమతిపైనా ఫిలిప్పీన్స్ ప్రభుత్వం ఆసక్తి చూపించిందని తెలిపారు. బియ్యంతో పాటు మొక్కజొన్న ఎగుమతులు మొదలైతే ఫిలిప్పీన్స్‌తో వాణిజ్య సంబంధాలు మరింత బలపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. తమ దేశానికి 20 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉందని ఫ్రాన్సిస్కో చెప్పారని, భవిష్యత్తులో ఈ వాణిజ్యాన్ని మరింత విస్తరించడానికి వీలుంటుందని ఉత్తమ్ వెల్లడించారు. ఫిలిప్పీన్స్ మంత్రిని తెలంగాణ పర్యటనకు ఆహ్వానించగా, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.



ఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయశాఖ మంత్రి ఫ్రాన్సిస్కోకు పుష్ప గుచ్ఛం అందచేస్తున్న మంత్రి ఉత్తమ్, డీఎస్ చౌహాన్

ఆ నలుగురు హామీ ఇచ్చారు

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్య.. ముఖ్యమంత్రిపై విమర్శల కొనసాగింపు

» డీకే శివకుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే రాజగోపాల్

హైదరాబాద్, న్యూఢిల్లీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తున్నారు. సోషల్ మీడియా జర్నలిస్టులపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తప్పుబడుతూ ఇటీవల ఎక్స్‌లో పోస్టు చేసిన రాజగోపాల్ రెడ్డి... సోషల్, డిజిటల్ మీడియాకు చెందిన ప్రతినిధులతో బుధవారం తన నివాసంలో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ తన భాష మార్చుకోవాలంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షాలను తిట్టడం మానేసి ప్రభుత్వం ఏం చేస్తుందో చెప్పాలని సూచించారు. 20 మంది సీమాంధ్ర కాంట్రాక్టర్లు రాష్ట్రంలో దోచుకు తింటున్నారని ఆరోపించారు. కమిషన్లు, నివేదికలు తప్ప 20 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం చేసింది ఏమీ లేదని అన్నారు. మరో మూడున్నరేళ్లు రేవంత్ రెడ్డే ముఖ్యమంత్రి అని, ఆ తర్వాత ఎవరన్నది అప్పుడు చూడొచ్చునన్నారు. అందరం కలిస్తేనే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. సోషల్ మీడియా విషయంలో ఓడ దాటాక బోడ మల్లన్న అన్నట్లు వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. మంత్రి పదవే కావాలి అనుకుంటే తనకు కేసీఆర్ ఎప్పుడో ఇచ్చేవారని తెలిపారు. కాంగ్రెస్‌పై ప్రేమతోనే తాను తిరిగి పార్టీలోకి వచ్చానని చెప్పారు. వీలైనంత త్వరగా మంత్రివర్గవిస్తరణ, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాజగోపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

మంత్రి పదవి హామీ ఇచ్చింది ఆ నలుగురే

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత



మంత్రివర్గంలో తనకు చోటు కల్పిస్తామని ఎన్నికలకు ముందు అప్పటి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అధిష్ఠానం తరఫున తనకు హామీ ఇచ్చారని రాజగోపాల్‌రెడ్డి వెల్లడించారు. తనకు మంత్రి పదవి ఇస్తానన్నది ఏఐసీసీ అని, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఇందులో ఏం సంబంధమని ప్రశ్నించారు. కాగా, బీసీ రిజర్వేషన్ల అంశంలో దేశ రాజధాని ఢిల్లీలో తీరిక లేకుండా ఉన్న సీఎం రేవంత్‌కు రాజగోపాల్ వ్యవహారం తలనొప్పిగా మారిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాజగోపాల్ రెడ్డి తీరుపై సీఎం అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే, బీసీ ధర్నా ఏర్పాట్లలో ఉండడం వల్ల రాజగోపాల్ రెడ్డి అంశంపై తాము దృష్టి సారించలేదని కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లురవి న్యూఢిల్లీలోని విలేకరులతో బుధవారం అన్నారు. రాజగోపాల్ రెడ్డితో మాట్లాడి వివరాలు తీసుకుంటామని పేర్కొన్నారు.

డీకేతో రాజగోపాల్ రెడ్డి భేటీ

వ్యక్తిగత పని మీద బుధవారం హైదరాబాద్ వచ్చిన కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను రాజగోపాల్ రెడ్డి స్వయంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో వీరి భేటీ జరిగింది. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా రాజగోపాల్‌రెడ్డి విమర్శలు చేస్తోన్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

కొత్తగా రెడ్లకు చోటు కల్పించేందుకు అధిష్ఠానంససేమిరా

నిజానికి మంత్రివర్గ విస్తరణలో రాజగోపాల్‌రెడ్డికి చోటు కల్పించే విషయంలో పార్టీలో సుదీర్ఘ చర్చే జరిగింది. అయితే, జనాభాలో ఎంతో.. అంత భాగస్వామ్యం అనే నినాదంతో ప్రజల్లోకి వెళుతున్న నేపథ్యంలో క్యాబినెట్లో అగ్రకులానికి చెందిన వారికి కొత్తగా చోటు కల్పించేందుకు అధిష్ఠానం విముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెడ్డి సామాజిక వర్గం నుంచి క్యాబినెట్లో ఇప్పటికే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉండగా మూడో వ్యక్తిగా రాజగోపాల్‌రెడ్డికి చోటు కల్పిస్తే అది బీసీ, ఎస్సీ, ఎస్టీ.. ఇతర సామాజిక వర్గాల్లో అసంతృప్తికి దారి తీస్తుందని అధిష్ఠానం రాష్ట్ర నాయకత్వానికి స్పష్టం చేసినట్లు చెబుతున్నారు. కోమటిరెడ్డి సోదరుల్లో ఎవరో ఒకరికే క్యాబినెట్లో చోటు ఉంటుందని స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. తనకు మంత్రి పదవి ఇస్తామని భట్టి, మాణిక్‌రావ్ ఠాక్రే, సునీల్ కనుగోలు, మహేశ్‌గౌడ్ హామీ ఇచ్చారని రాజగోపాల్ రెడ్డి చెబుతున్నారు. అయితే, ఆ నలుగురు ఇచ్చిన హామీ అధిష్ఠానం పెద్దలకు తెలుసా లేదా అన్నది స్పష్టత లేదు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేతలకు సునీల్ కనుగోలు, ఠాక్రే ఎడా పెడా హామీలు ఇచ్చారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆ హామీలే ఇప్పుడు పార్టీకి, ప్రభుత్వానికి గుదిబండలా మారాయని వాపోతున్నాయి.

తెలంగాణ సర్కారుకు సెల్యూట్

» గద్దర్ సినీ అవార్డు జ్ఞాపికలో ప్రజా యుద్ధనౌక ప్రతిమ ఉండాలి

» గద్దర్ ద్వితీయ వర్ధంతి సభలో ఆర్.నారాయణ మూర్తి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జీవితాంతం పీడిత ప్రజల విముక్తికి పోరాడిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణ మూర్తి పేర్కొన్నారు. లాల్-నీల్ ఏకం కావాలని పరితపించిన వాగ్గేయకారుడని అభివర్ణించారు. తెలుగు సినిమా పరిశ్రమలో 14 ఏళ్లుగా నిలిచిపోయిన నంది అవార్డులను తిరిగి నిర్వహించడంతోపాటు వాటికి గద్దర్ పేరు పెట్టిన తెలంగాణ సర్కారు, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలకు సెల్యూట్ చేశారు. అసోం ప్రభుత్వాఫీసుల్లో అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలతోపాటు ప్రఖ్యాత కవి-గాయకుడు భూపేన్ హజారికా ఫోటో కనిపించినట్లే తెలంగాణలో గద్దర్‌కు ఆ గౌరవం కల్పించడం శ్లాఘనీయమన్నారు. రవీంద్రభారతిలో బుధవారం గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన గద్దర్ ద్వితీయ వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. గద్దర్ సినీ అవార్డుల జ్ఞాపికలో ఆయన ప్రతిమను చిహ్నంగా ఉంచాలని సూచించారు. కవి, రచయిత జిలుకర శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో గద్దర్ స్మృతి గీతాల సంపుటి 'పాలధార', 'నా పల్లె', 'ప్రతి పాటకూ ఒక కథ ఉంది' అనే పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అందెశ్రీ, ఏపూరి సోమన్న, ప్రకృతి కవి జయరాజ్, గద్దర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ శాంతాసిన్హా, సామాజిక కార్యకర్తలు సజయ, పృథ్వీరాజ్, మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి, క్రాంతి కిరణ్ పాల్గొన్నారు. గద్దర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సూర్య కిరణ్ మాట్లాడుతూ ప్రజలే గద్దర్‌కు అసలైన వారసులని, గద్దర్ కళాక్షేత్రం నిర్మించడమే తన లక్ష్యమన్నారు. అధిక సంఖ్యలో హాజరైన జానపద కవులు, కళాకారులు ఆట, పాటలు, ఉద్యమ గీతాలతో గద్దర్‌కు నివాళులర్పించారు.

జాయింట్ ఎయిర్ ఫీల్డ్‌తో

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు



వాయుసేన, ప్రయాణికుల విమానాలకు వేర్వేరు టర్మినళ్లు

» సిద్ధమవుతున్న మాస్టర్ ప్లాన్

» సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి చొరవ

» విమానాశ్రయ ఏర్పాటుకు 950 ఎకరాల భూమి అవసరం

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు కోసం వడివడిగా అడుగులు పడుతున్నాయి. దీని ఏర్పాటుకు గత ఏప్రిల్‌లో భారత వాయుసేన (ఐఏఎఫ్) పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే. ప్రయాణికులు/ఐఏఎఫ్ విమానాలు తిరిగేందుకు వీలుగా విమానాశ్రయం నిర్మాణానికి 950 ఎకరాల భూమి అవసరమని ఇటీవల కేంద్ర రక్షణశాఖ ఆధ్వర్యంలో జరిగిన కీలక సమావేశంలో నిర్ధారించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో ఇండియన్ ఎయిర్ పోర్టు అథారిటీ, భారత వాయుసేన, రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పౌర విమానయాన విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు. ఇప్పటికే ఏరోడ్రోమ్ పరిధిలో సుమారు 350 ఎకరాలుండగా, మరో 600 ఎకరాల భూమిని సేకరించాలని సివిల్ ఏవియేషన్, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చెప్పారు. అదనంగా అవసరమైన 600 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించాల్సి ఉంటుంది. ప్రయాణికుల విమానాలు, ఐఏఎఫ్ విమానాలు తిరిగేందుకు రన్‌వే (ఎయిర్‌స్ట్రిప్)కు ఇరువైపులా టర్మినళ్ల నిర్మాణంతోపాటు మౌలిక వసతులు కల్పించాలని నిర్ణయానికొచ్చినట్లు సమాచారం. ట్యాక్సీ/లింక్డ్ బేస్ విధానంలో రన్‌వే నిర్మిస్తారని చెబుతున్నారు. వాయుసేన, ప్రయాణికుల విమానాల ప్రయాణానికి వీలుగా జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ పటిష్ఠంగా నిర్మించాలని ప్రతిపాదించారు. త్వరితగతిన విమానాశ్రయ పనుల పూర్తికి ఎయిర్ పోర్ట్ అథారిటీ, ఎయిర్ ఫోర్స్ నుంచి ఇద్దరేసి అధికారులతో జాయింట్ కమిటీని ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించినట్లు తెలిసింది. ఎయిర్‌ఫోర్స్, ప్రయాణికుల విమానాల నిర్వహణకు 2 ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్స్ (ఏటీసీ) ఏర్పాటు చేసే అవకాశం ఉంది. దీనివల్ల 2 రకాల విమానాల ప్రయాణాలకు సాంకేతిక సమస్య తలెత్తదని అభిప్రాయాలు వెల్లడయ్యాయని సమాచారం. ప్రతిపాదిత రన్‌వే, టర్మినళ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు అవసరమైన మాస్టర్ ప్లాన్‌ను త్వరలోనే కేంద్రానికి నివేదిస్తారని అధికార వర్గాల కథనం. ఎయిర్ బస్-320 విమానాలు తిరిగేలా విమానాశ్రయాన్ని నిర్మించనున్నారు. వాయుసేన విమానాల పార్కింగ్‌కు వసతులు కల్పిస్తారు. పగలూ రాత్రి (డే అండ్ నైట్) విమానాలు తిరిగేలా ఏర్పాట్లు చేయనున్నారని వినికిడి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి కొత్త విమానాశ్రయాల ఏర్పాటు విషయమై ప్రత్యేక దృష్టి సారించింది. వీటి ఏర్పాటు కోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇందుకు రాష్ట్ర పౌర విమానయాన విభాగంతో చర్చిస్తూ ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

ఫ్యూచర్‌సిటీ దిశగా

వడివడిగా..

వారంలో అందుబాటులోకి డెవలప్‌మెంట్ అథారిటీ సేవలు

నానక్‌రాంగూడ నుంచి కార్యకలాపాలు.. 36మంది అధికారులు, సిబ్బంది కేటాయింపు

హెచ్‌ఎండీఏ నిబంధనలన్నీ ఎఫ్‌సీడీఏకు వర్తింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు అదనంగా అధునాతనమైన హంగులతో నాలుగో నగరాన్ని నిర్మించటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) సేవలు వారం రోజుల్లో అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఎఫ్‌సీడీఏకు సంబంధించిన అధికారులు, సిబ్బంది నియమకాలు దాదాపుగా పూర్తి కావచ్చాయి. నానక్‌రాంగూడలోని హెచ్‌ఎండీఏకు చెందిన హైదరాబాద్ గ్రోథ్ కారిడార్ లిమిటెడ్ కార్యాలయంలోనే ఎఫ్‌సీడీఏ ఆఫీసు ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లాలోని ఆమన్‌గల్, ఇబ్రహీంపట్నం, కడ్తాల్, కందుకూరు, మహేశ్వరం, మంచాల, యాచారం మండలాల్లోని 56 గ్రామాల పరిధిలో ఉన్న 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఎఫ్‌సీడీఏ పని చేయనుంది. ఫ్యూచర్ సిటీలో హెచ్‌ఎండీఏ పరిధిలోని 36 గ్రామాలు, డైరెక్టర్ టౌన్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) పరిధిలోని 20 గ్రామాలు ఉంటాయి. ఎఫ్‌సీడీఏకి ముఖ్యమంత్రి చైర్మన్‌గా, మున్సిపల్ శాఖ మంత్రి వైస్ చైర్మన్‌గా ఉండగా.. పలు శాఖల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను సభ్యులుగా నియమించారు. 36 మంది అధికారులు, సిబ్బంది పోస్టులను కూడా ఎఫ్‌సీడీఏకు మంజూరు చేశారు. ఎఫ్‌సీడీఏ కమిషనర్‌గా ఇప్పటికే ఐఏఎస్ అధికారి శశాంక్‌ను నియమించగా.. ప్లానింగ్ అదనపు డైరెక్టర్‌గా డీటీసీపీ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎఫ్‌సీడీఏలో ప్లానింగ్ విభాగాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశారు. చీఫ్ ఇంజనీర్‌గా, సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా హెచ్‌జీసీఎల్ ఇంజనీర్లను నియమించే అవకాశాలున్నాయి.

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ప్రక్రియ

ఎఫ్‌సీడీఏ పూర్తిస్థాయిలో ఏర్పాటయ్యేంత వరకు ఫ్యూచర్ సిటీలో నిర్మాణ, లేఅవుట్ అనుమతులు ఇచ్చే బాధ్యతను హెచ్‌ఎండీఏ, డీటీసీపీలకు అప్పగించారు. ఎఫ్‌సీడీఏ సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత అనుమతులు ఎఫ్‌సీడీఏ ద్వారానే జారీ కానున్నాయి. ఈ మేరకు ఎఫ్‌సీడీఏ పరిధిలోని గ్రామాల్లో భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులకు బిల్డ్‌నౌలో దరఖాస్తు చేయగానే అథారిటీకి వెళ్ళేవిధంగా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసే ప్రక్రియ నడుస్తోంది. హెచ్‌ఎండీఏలో ప్రస్తుతం ఓఆర్ఆర్ అవతలి ప్రాంతాలకు అనుమతుల కోసం ఏ నిబంధనలు ఉన్నాయో.. వాటినే ఎఫ్‌సీడీఏకు వర్తించే విధంగా ఇటీవల చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

రవాణా శాఖ పేరుతో సైబర్ మోసం

» ప్రమాదకరంగా మారుతున్న ఏపీకే ఫైల్స్

» ఆర్టీవో, ఆర్టీఏ ఈ-చలానా ఆఫీస్ పేరుతో వాట్సాప్ మెసేజ్‌లు

» ఏపీకే ఫైల్స్ పంపించి మొబైల్ హ్యాకింగ్, ఖాతాలు ఖాళీ

» నకిలీ ఫైళ్లను తెరవొద్దు: అధికారులు

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉంటున్నా.. సైబర్ నేరాల కట్టడికి పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. కేటుగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త కోణంలో మోసాలకు పాల్పడుతున్నారు. వన్ టైం పాస్‌వర్డ్(ఓటీపీ)లను అపరిచితులతో పంచుకోవద్దని ప్రజల్లో విస్తృతంగా అవగాహన ఏర్పడ్డ నేపథ్యంలో కేటుగాళ్లు ఏపీకే ఫైల్స్ రూపంలోకి రూటు మార్చారు. స్మార్ట్ ఫోన్లకు హ్యాక్ చేసేందుకు కొత్త ప్లాన్ చేశారు. ముఖ్యంగా ఏపీకే(ఆండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్) ఫైల్స్ లింకులను సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేస్తున్నారు. వీటి ద్వారా మాల్‌వేర్ ఇన్‌స్టాల్ చేసి ఫోన్లపై నియంత్రణ సాధించి, వినియోగదారుల బ్యాంకు వివరాలు దోచుకుంటున్నారు. అలాగే రవాణా శాఖ అంటూ ప్రభుత్వ విభాగాల పేరుతో వాట్సాప్ ద్వారా మెసేజ్‌లు పంపిస్తున్నారు. ఆర్టీవో పేరుతో మెసేజ్ వచ్చిందని తొందరపడి క్లిక్ చేస్తే సైబర్ నేరగాళ్లు మొబైల్ హ్యాక్ చేసి బ్యాంక్ ఖాతా ఖాళీ చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం సికింద్రాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి ఆర్టీఏ చలానా పేరుతో వాట్సాప్ మెసేజ్ పంపించారు. ఆ లింక్ క్లిక్ చేస్తే అతని ప్రమేయం లేకుండానే ఫోన్‌లో ఓ యాప్ ఇన్‌స్టాల్ అయింది. యాప్‌లో అడిగిన వివరాలు నమోదు చేసిన రెండు రోజుల్లో ఖాతాలో రూ. 1.72 లక్షలు కేటుగాళ్లు కొట్టేశారు. విషయం గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఇలా రవాణా శాఖతోపాటు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, పీఎం కిసాన్ యోజన వంటి ప్రభుత్వ పథకాలు, ఎస్‌బీఐ రివార్డుల పేరుతోనూ ఏపీకే ఫైల్స్ పంపించి నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు.



రెండో వ్యక్తి నియంత్రణలోకి..

సాధారణంగా మొబైల్ ఫోన్ హ్యాక్ చేయడం అంత సులువు కాదు. ఆండ్రాయిడ్ ఫోన్లలో కంపెనీ నుంచి వచ్చే అప్లికేషన్లు(యాప్స్) మినహా.. మిగతా సోషల్ మీడియాలో వచ్చే అనధికారిక యాప్స్ ఇన్‌స్టాల్ చేస్తే ఫోన్లు హ్యాక్ అయ్యే అవకాశం ఉంటుంది. దీన్నే అదనుగా తీసుకున్న సైబర్ నేరగాళ్లు.. టెలిగ్రాం, వాట్సాప్‌తో పాటు ఇతర సోషల్ మీడియాల్లో వీటిని సర్క్యులేట్ చేస్తున్నారు. లింకును తెరిచి ఏపీకే ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో అందులో ఉన్న యాప్ ఇన్‌స్టాల్ అవుతుంది. దీంతో వెంటనే ఫోన్లో ఉన్న కాంటాక్ట్స్, గ్యాలరీతో పాటు అన్నిరకాల అనుమతులు సెల్ ఫోన్ యజమాని ప్రమేయం లేకుండానే ఇతరుల నియంత్రణలోకి వెళ్లిపోతుంది. ఈ విషయం అధికారుల దృష్టికి రావడంతో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వాట్సాప్ ద్వారా వచ్చే నకిలీ ఏపీకే ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లో తెరవొద్దని అధికారులు సూచించారు. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా మాత్రమే యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రజలను అప్రమత్తం చేశారు.

పోరుబాట ధర్నాకు 3 వేల మంది హాజరు!

- ఉద్యమానికి అండగా ఉంటామన్న ఇతర పార్టీల నేతలు
- ధర్నాకు అందుకోలేకపోయిన రాహుల్ గాంధీ
- సాయంత్రం దాకా నిర్వహించినా రాని అగ్రనేత

న్యూఢిల్లీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో బుధవారం జంతర్‌మంతర్‌లో జరిగిన బీసీల ధర్నాలో సుమారు మూడు వేల మందికిపైగా పాల్గొన్నారు. ఇండియా కూటమి నేతలు పెద్దసంఖ్యలో హాజరై ధర్నాకు మద్దతు తెలిపారు. సుమారు 50 మంది ఇతర పార్టీల ఎంపీలు బీసీ ఉద్యమానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సీఎం రేవంత్‌పై ప్రశంసలు కురిపించారు. అయితే, ధర్నాకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరు కాలేదు. ఝార్ఖండ్ మాజీ సీఎం శిబు సొరెన్ అంత్యక్రియలకు వెళ్లడంతో ఆయన ధర్నాకు రాలేదు. బీసీ ధర్నా ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకే సాగుతుందని ప్రకటించినప్పటికీ రాహుల్ ఆలస్యంగానైనా వస్తానని సందేశం ఇవ్వడంతో సాయంత్రం 5 గంటల వరకు పొడిగించారు. అయినా, రాహుల్ ధర్నాకు అందుకోలేకపోయారు. ధర్నాకు మద్దతుగా ఆయన ఎక్స్‌లో తన సందేశాన్ని పోస్ట్ చేశారు. ఇక ధర్నాలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జాలె ఆదినారాయణ స్వయంగా పాటలు పాడి అందరినీ ఉత్సాహపరిచారు.

రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కష్టమే?

బీసీల రిజర్వేషన్ల బిల్లుకు సంబంధించి రాష్ట్రపతిని కలిసేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి సహా మంత్రివర్గం, ఎంపీలు అపాయింట్‌మెంట్ కోరారు. బుధవారం రాత్రి వరకు రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఎలాంటి సమాచారం రాలేదని కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలిసింది. గురువారం రాష్ట్రపతిని కలుస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నప్పటికీ, అపాయింట్‌మెంట్ లభించే అవకాశాలు లేవని విశ్వసనీయ వర్గాల సమాచారం.

రేవంత్ బ్యాచ్ ఢిల్లీ డ్రామా అట్టర్ ఫ్లాప్

- బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ది రెండు నాల్కల ధోరణి: హరీశ్



హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అడగాల్సిన చోట అడగకుండా.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన పేరిట రేవంత్‌రెడ్డి బ్యాచ్ ఢిల్లీలో చేసిన డ్రామా అట్టర్ ఫ్లాప్ అయిందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ఒకే రోజు, ఒకే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలకు, రాహుల్‌గాంధీ 'ఎక్స్'లో పోస్టు చేసిన వ్యాఖ్యలకు పొంతనే లేదని 'ఎక్స్' వేదికగా విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. ఢిల్లీలో ప్రధాని మోదీని ఉద్దేశించి రేవంత్ మాట్లాడుతూ తెలంగాణలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచాలని మాత్రమే తాము అడుగుతున్నామని పేర్కొనగా.. ఇది తెలంగాణ కోసం మాత్రమే కాదని, యావత్ దేశం కోసం చేస్తున్న పోరాటమని రాహుల్ 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించడం..వారిలో చిత్తశుద్ధి లేదనడానికి నిదర్శనమని దుయ్యబట్టారు.

బీసీ రిజర్వేషన్లు కోర్టుల ద్వారానే సాధ్యం

- ఏఐసీసీ దృష్టిలో పడేందుకే ఢిల్లీలో ధర్నా : వకుళాభరణం

పంజాగుట్ట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అసలు పోరాటం కోర్టుల ద్వారానే సాధ్యం అని, రాజకీయ నాటకాలతో కాదు అని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. ఢిల్లీలో ధర్నా బీసీల కోసం కాదు, రాజకీయ హంగామా కోసమేనని ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రత్యేకంగా ఒక రిట్ ఆఫ్ మాండమస్ వేసి, సుప్రీంకోర్టు ద్వారా బిల్లులపై త్వరిత నిర్ణయం తీసుకునే మార్గం ఉందన్నారు. న్యాయబద్ధంగా వెళ్లి సమస్య పరిష్కరించుకునే మార్గం ఉన్నప్పటికీ ఎందుకు ఈ రాజకీయ డ్రామాలు? ఎందుకు ఈ హంగామా? అని ప్రశ్నించారు. ఇది బీసీల హక్కుల కోసం పోరాటం కాదు, ఏఐసీసీ దృష్టిలో పడేందుకు ఓ పబ్లిసిటీ స్టంట్ మాత్రమేనని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయడానికి బుసాని కమిషన్ నివేదిక సరిపోతుందని.. అయితే ఆ నివేదికను స్వీకరించడానికి సీఎం, మంత్రులు సమయం కేటాయించలేదని విమర్శించారు. అదే సమయంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వర్కింగ్ గ్రూప్ నివేదిక స్వీకరించడానికి సీఎం, డిప్యూటీ సీఎం, కొందరు మంత్రులు ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీకి వెళ్లారని చెప్పారు. బుసాని కమిషన్, జస్టిస్ రెడ్డి కమిటీ మధ్య చూపిన ఈ తేడా రేవంత్ ప్రభుత్వానికి బీసీల పట్ల ఉన్న ప్రతికూల వైఖరికి నిదర్శనం అని విమర్శించారు.

ఎన్నికలకు ముందే 42% కావాలి: జీ నిరంజన్

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే 42% రిజర్వేషన్లు అమలు కావాలని తెలంగాణలోని బీసీ ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో సర్వే ద్వారా బీసీల సంఖ్య నిర్ధారించి 56.36 శాతం ఉన్నట్టు స్పష్టం కావడంతో 42% రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో బిల్లును పాస్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ బిల్లును గవర్నర్‌కు పంపితే అక్కడి నుంచి ఆమోదం కోసం రాష్ట్రపతికి చేరిందన్నారు. ఒకవైపు.. మూడు నెలల్లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఎన్నికల కమిషన్‌ను, రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించిందని.. మరోవైపు 42% రిజర్వేషన్‌ను ఆమోదించే విషయంలో ఎటు తేలకపోవడంతో బీసీలు తమ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన చెందుతున్నారని నిరంజన్ వివరించారు. 42శాతం రిజర్వేషన్లు ఖరారు కాకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే బీసీ రిజర్వేషన్ల పెంపుదల అంశం పక్కదారి పట్టే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

మహాధర్నాలో బీసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

విద్యా,ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లకు అనుమతించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జరిగిన మహాధర్నాకు తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం మద్దతు పలికింది. సామాజిక న్యాయం కోరుకునేవారంతా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలంగాణ సచివాలయం బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తిరందాసు యాదగిరి, ఉపాధ్యక్షుడు మంగదొడ్డి శ్రీను పేర్కొన్నారు. న్యాయమైన బీసీల డిమాండ్‌ను పరిష్కరించే వరకు జరిపే పోరాటంలో బీసీ ఉద్యోగుల సంఘం క్రియాశీల పాత్రపోషిస్తుందని స్పష్టం చేశారు. రాజకీయాలకుఅతీతంగా బీసీల సమగ్ర అభివృద్ధి లక్ష్యంతో రిజర్వేషన్లను పెంచాలని కోరారు.

బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ ధర్నా వాయిదా

బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల8న కరీంనగర్‌లో చేపట్టదలచిన ధర్నాను వాయిదా వేసినట్లు ఆ పార్టీ ప్రకటించింది. తదుపరి ఎప్పుడు నిర్వహించాలన్న దానిపై గురువారం తెలంగాణ భవన్‌లో మాజీమంత్రులు, పార్టీ ముఖ్యనేతలు సమావేశమై.. నిర్ణయించనున్నట్లు పేర్కొంది. బీసీ బిల్లుల ఆమోదంకోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రపతిని కలిసే అంశంపైనా ఇందులో చర్చించనున్నట్లు తెలుస్తోంది.

బీసీ వ్యతిరేక బీజేపీని భూస్థాపితం చేద్దాం: జాజుల

న్యూఢిల్లీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ.. బీసీలకు వ్యతిరేకం అని, ఆ పార్టీని భూస్థాపితం చేద్దాం అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బీజేపీ కథ ముగియనుంది అని చెప్పడానికి.. ఢిల్లీలోని మహాధర్నానే నిదర్శనమన్నారు. రాష్ట్రపతి కార్యాలయంపై మోదీ ఒత్తిడి తీసుకొచ్చి ఆర్డినెన్స్ రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లు ఇవ్వని బీజేపీ మనకు అవసరమా? అని ప్రశ్నించారు. 'బీజేపీ హటావో బీసీ రిజర్వేషన్ బచావో' నినాదంతో బీసీలు ముందుకెళ్లాలన్నారు. కిషన్ రెడ్డి కిరికిరి రెడ్డి అని.. బండి సంజయ్ తొండి సంజయ్ అని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు న్యాయవాది కాదు అన్యాయవాది అని విమర్శించారు. వీరంతా బీసీ వ్యతిరేక విధానాలు మానుకోవాలన్నారు. ఇంటి దీపం అని ముద్దాడితే మూతి కాలిందన్నట్లుగా ప్రధాని మోదీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

తడాఖా చూపిస్తాం!



పోరుబాట ధర్నాలో పాల్గొన్న సీఎం రేవంత్, భట్టి, మహేశ్‌గౌడ్, పొంగులేటి, పొన్నం, మల్లు రవి, మీనాక్షి తదితరులు

(మొదటిపేజీ తరువాయి)

చేసిన బీసీ రిజర్వేషన్ల బిల్లులను ఆమోదించకుండా కేంద్రం, రాష్ట్రపతి తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. బిల్లులు ఆమోదం పొందే వరకు నిద్రపోయేది లేదన్నారు. బలహీన వర్గాలపై కక్షగట్టిన గత సీఎం కేసీఆర్ 50 శాతం రిజర్వేషన్లు మించకుండా చట్టం చేశారని విమర్శించారు. ఆ చట్టమే ఇప్పుడు రిజర్వేషన్లకు గుదిబండగా మారిందన్నారు. ఆ చట్టాన్ని తొలగించేందుకే ఆర్డినెన్స్ చేశామని చెప్పారు. వెనకబడిన వర్గాల వారికి స్థానిక ఎన్నికల్లో, విద్య, ఉద్యోగ రంగాల్లో 42 % రిజర్వేషన్లు సాధించేందుకు ఢిల్లీలో ధర్నాకు దిగామని, కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా సాధిస్తామని రేవంత్ తెలిపారు. తెలంగాణ ప్రజల శక్తిని మోదీ తక్కువగా అంచనా వేస్తే ఆయనకు తమ తడాఖా చూపిస్తామని చెప్పారు.

అడ్డుపడేదే వారు..

"తెలంగాణలో కేసీఆర్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాంచందర్‌రావు బీసీ రిజర్వేషన్ల పెంపునకు అడ్డుపడుతున్నారు. వారికి తెలంగాణ బీసీల అవసరం లేదా? బీఆర్ఎస్ నాయకులు బీసీ రిజర్వేషన్ల పెంపు ధర్నాకు ఎందుకు రాలేదు? ఆ పార్టీ తెలంగాణతో పేరు బంధంతోపాటు పేగు బంధం కూడా తెంచుకుందా? బీసీ రిజర్వేషన్ల పెంపు ధర్నాను కేటీఆర్ డ్రామా అంటున్నారు. అసలు ఆయన పేరే డ్రామా రావు. కేసీఆర్ కుటుంబమే డ్రామాలతో బతుకుతోంది. అధికారం పోయినా కేటీఆర్ బుద్ధి మారలేదు. ఆ కుటుంబంలోనే ఒకరు రిజర్వేషన్లకు అనుకూలమని, మరొకరు ప్రతికూలమని చెబుతున్నారు. ఇంకొకరు అటూ ఇటూ కాకుండా మాట్లాడుతున్నారు" అని రేవంత్ ఎద్దేవా చేశారు. రిజర్వేషన్ల పెంపు బిల్లులను ఆమోదించకుంటే ఇక ఢిల్లీకి రాబోమని, గల్లీకి వచ్చినప్పుడు బీజేపీ నేతలను పట్టుకుంటామని హెచ్చరించారు. దళితులు, గిరిజనులకు అండగా నిలిచి ఇందిరాగాంధీ దేశ ప్రజల గుండెల్లో ఇందిరమ్మగా నిలిచిపోయారని.. రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన ఐటీ విప్లవంతో అగ్రకులాల్లో చాలా మంది విదేశాల్లో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డారని గుర్తుచేశారు. వారి వారసుడిగా వచ్చిన రాహుల్ బీసీలకు న్యాయం చేసేందుకు కంకణం కట్టుకున్నారని, ఆయన ఆశయాలకు అడ్డుతగిలే వారి చిరునామా గల్లంతవుతుందని చెప్పారు. ప్రధానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రపతి దగ్గరున్న బిల్లులు ఆమోదం పొందేలా చూడాలని.. లేకుంటే తెలంగాణ ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

సీఎంగా ఆ అదృష్టం నాకే దక్కింది..

దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేయలేదని, ఇప్పటి వరకు దేశంలో 300 మంది ముఖ్యమంత్రులు చేయలేని పని చేసే అదృష్టం తనకు దక్కిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బీసీల రిజర్వేషన్లు పెంచే అవకాశం తనకు రావడం సంతోషంగా ఉందన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకు తెలంగాణలోనైనా ధర్నా చేయొచ్చని, కానీ అక్కడ చేస్తే స్థానిక పార్టీలు మాత్రమే వస్తాయని.. అందుకే ఢిల్లీలో ధర్నా చేస్తున్నామని చెప్పారు. ఢిల్లీలో ధర్నా చేయడంతోనే ఇండి కూటమిలోని సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, ఎన్సీపీ, వామపక్షాలకు చెందిన 100 మంది ఎంపీలు ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారని రేవంత్ అన్నారు. ఈ ధర్నాలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, తుమ్మల, దామోదర, శ్రీధర్ బాబు, జూపల్లి, సురేఖ, కోమటిరెడ్డి, పొన్నం, పొంగులేటి, సీతక్క, వివేక్, లక్ష్మణ్ కుమార్, శ్రీహరి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రపతిపై మోదీ ఒత్తిడి చేస్తున్నారేమో..?

తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలపొద్దని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై ప్రధాని మోదీ ఒత్తిడి చేస్తున్నారేమో? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ధర్నా సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. "రాష్ట్రపతిని అపాయింట్ మెంట్ అడిగి చాలా రోజులు అవుతోంది. ఇప్పటి వరకు రాష్ట్రపతి భవన్ నుంచి సమాధానం రాలేదు. రేపటిలోగా (గురువారం వరకు) రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ ఇస్తారని, సమస్య విని ఆమోదం తెలుపుతారని ఆశిస్తున్నాం. అపాయింట్‌మెంట్ ఇవ్వొద్దని మోదీ రాష్ట్రపతిపై ఒత్తిడి తెచ్చారేమో? బలహీన వర్గాలు ఆలోచించాలి. ఢిల్లీలో ఇంత పెద్దఎత్తున మంత్రివర్గం, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ పరివారమంతా ధర్నా చేస్తున్నా బీజేపీకి మాత్రం కనువిప్పు కలగడం లేదు. పార్లమెంట్‌లో మా ఎంపీలు పోరాటం చేస్తూనే ఉన్నారు. రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం ఆగదు. మోదీ ఇచ్చిండా సరేసరి.. లేదంటే బీజేపీ, మోదీ మెడలు వంచుతాం. మోదీ పార్లమెంట్ వేదికగా జవాబు చెప్పకపోతే ఊరుకునేది లేదు. ఇక మళ్లీ ఢిల్లీకి వచ్చేది లేదు. తెలంగాణకు వచ్చినప్పుడు సరైన సమాధానం చెబుతాం. బీజేపీని తెలంగాణలో తుడిచి పెట్టేస్తాం. దేశంలో చేపట్టబోయే జనగణన విషయంలో మోదీని నమ్మలేం. దీనిపై పార్లమెంటులో చర్చ జరగాలి. తెలంగాణలో 8 పేజీలు, 53 ప్రశ్నలు ఉంచి అమలు చేశాం. తెలంగాణ సర్వే దేశానికే రోల్ మోడల్. కేంద్రం అన్ని రాష్ట్రాల్లోనూ అమలు చేయాలి" అని రేవంత్‌రెడ్డి చెప్పారు.



ఢిల్లీ పోరుబాట ధర్నాలో పాల్గొన్న బీసీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు

చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే ధర్నా: భట్టి



తెలంగాణలో చేసిన కుల సర్వే దేశ దశ, దిశను మార్చే సర్వే అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. దేశానికి తాము మార్గం చూపామని, దాన్ని అనుసరించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని అన్నారు. జంతర్‌మంతర్ ధర్నా భారత దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదని తెలిపారు. బీజేపీ అసెంబ్లీలో మద్దతు తెలిపిందని, అలాగే పార్లమెంట్ లోనూ మద్దతుగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీ ధర్నాలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు గురువారమే ఆమోదం తెలుపుతారని ఆశిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన పనిని పూర్తి చేసిందని, కేంద్రమే ఆమోదముద్ర వేయాల్సి ఉందని చెప్పారు. దశాబ్దాల ఓబీసీల కల నెరవేరాలంటే అన్ని పక్షాలు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల రిజర్వేషన్ అంశం కాంగ్రెస్, బీజేపీకి సంబంధించింది కాదని.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిందని స్పష్టం చేశారు. దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందన్నారు. 1.05 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగుల సేవలు వినియోగించుకుని ఏ రాజకీయ పార్టీ ప్రశ్నించలేని రీతిలో సర్వేను విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు.

ఐక్యంగా పోరాడి.. రిజర్వేషన్లు సాధిస్తాం!

- రాష్ట్రపతి సమయం ఇస్తారని ఆశిస్తున్నాం
- కేంద్రం ఇకనైనా కళ్లు తెరవాలి
- జంతర్‌మంతర్ ధర్నాలో రాష్ట్ర మంత్రులు

న్యూఢిల్లీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఐక్యంగా పోరాడి సాధించుకుందామని తెలంగాణ రాష్ట్ర మంత్రులు పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోందని మండిపడ్డారు. మహా ధర్నాలో వారు మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు బీసీల రిజర్వేషన్లకు అడ్డుతగులుతున్నాయని ఆరోపించారు. "రాష్ట్రపతిని సమయం అడిగి చాలారోజులవుతోంది. ఆమె సమయం ఇస్తారని ఆశిస్తున్నాం. బీసీలకు రిజర్వేషన్లు దక్కాలంటే రాజ్యాంగ సవరణ కావాలి. బీసీలపై బీజేపీకి ఎందుకింత అక్కసో అర్థం కావడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ బీసీల కోసం మొసలి కన్నీరు కార్చింది. ఇప్పుడు రిజర్వేషన్ల కోసం చట్టాన్ని చేస్తే మాతో కలిసి రావట్లేదు" అని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. "బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాం. కానీ, నాలుగు నెలలుగా ఈ ఫైల్ రాష్ట్రపతి వద్దే ఉంది. ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మెడలు వంచైనా రిజర్వేషన్లు సాధిస్తాం" అని మంత్రి ఉత్తమ్ చెప్పారు.

ఐక్య పోరాటాలు చేద్దాం: పొన్నం

"బీసీ రిజర్వేషన్లు తెలంగాణకే పరిమితం కాదు. ఇది దేశవ్యాప్తంగా ఎన్నో కోట్లమంది కల. బీసీలకు రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదు. 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఐక్యంగా పోరాటాలు చేద్దాం" అని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. "బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీ నడిబొడ్డున ఇంత పెద్ద ధర్నా జరుగుతుంటే.. కేంద్రం మాత్రం తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఇది ముమ్మాటికీ బీసీలపై చిన్నచూపే. రాజకీయాలకు అతీతంగా అసెంబ్లీలో మద్దతు లభించింది. బీసీల ఆవేదనను అర్థం చేసుకొని, కేంద్రం కళ్లు తెరవాలి" అని మంత్రి దామోదర అన్నారు.

మోదీ డీఎన్‌ఏలోనే బీసీ వ్యతిరేకత: సీతక్క

"తాను బీసీనని చెప్పుకొంటున్న మోదీ.. బీసీలకు బద్ధ శత్రువులా వ్యవరిస్తున్నారు. మోదీ డీఎన్‌ఏలోనే బీసీ వ్యతిరేకత ఉంది. తెలంగాణ బీజేపీ నేతలకు దమ్ముంటే ఢిల్లీలో ధర్నా చేయాలి. బీసీలను వ్యతిరేకించే బీజేపీని ఊర్లలోకి రాకుండా తరిమి కొట్టాలి" అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. "బీఆర్ఎస్ పదేళ్లలో బీసీ మహిళలకు మంత్రి పదవి ఇవ్వలేదు. అప్పుడు కవిత ఎందుకు మాట్లాడలేదు? ఇప్పుడేమో బీసీ గొంతుక తానే అన్నట్లు డ్రామాలు చేస్తోంది. బీసీ బిల్లుకు అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు మద్దతు పలికారు. బిల్లు ఢిల్లీకి వచ్చాక బీజేపీ బీసీ నేతల గొంతు మూగబోయింది. ఎంపీ పదవి రాగానే కృష్ణయ్య గొంతు బీసీలకు వ్యతిరేకంగా మారిపోయింది" అని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు.

నిబద్ధతతో పనిచేసిన రాష్ట్ర ప్రభుత్వం: కోమటిరెడ్డి


"బీసీల కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగమంతా నిబద్ధతతో పనిచేసింది. అసెంబ్లీ అంతా ఏకమై బిల్లుకు ఆమోదం తెలిపింది. బీజేపీ ద్వంద్వ నీతిని తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు" అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. "బీసీలపై కక్షసాధింపు ధోరణిని కేంద్రం విడనాడాలి. బీసీలకు మద్దతుగా ఢిల్లీలో ధర్నా జరుగుతుంటే తెలంగాణ బీజేపీ నేతలు ఎందుకు పాల్గొనడం లేదు?" అని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశ్నించారు. "బీసీ రిజర్వేషన్లు వందేళ్ల కల. ఆ కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తోంది. దీనికి బీజేపీ నేతలు అడ్డుపడడం సరికాదు. బీసీలు మంచి చేస్తే జీవితకాలం గుర్తుంచుకుంటారు. కీడు చేస్తే.. ఎప్పటికీ క్షమించరు" అని మంత్రి వాకిటి శ్రీహరి హెచ్చరించారు.

బీసీ రిజర్వేషన్లు ఇచ్చేదాకా వదలం: విజయశాంతి

బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించం. కేంద్రం దిగివచ్చేదాకా వదలం. బీజేపీ అధికారంలో కూర్చున్న కుర్చీ బీసీలు తయారు చేసిందేనని గుర్తు చేసుకోవాలి.

బీజేపీ నేతలు చేతగాని దద్దమ్మలు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొనగాడు
- రిజర్వేషన్ల కోసం ఎక్కడదాకైనా వెళతాం
- ఎస్సీ, ఎస్టీ, బీసీల మద్దతు లేకుండా కిషన్‌రెడ్డి నామినేషన్ వేయగలరా?
- బీసీ ధర్నాలో టీపీసీసీ చీఫ్ మహేశ్



న్యూఢిల్లీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతలు చేతగాని దద్దమ్మలంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. బీజేపీ నేతలు పగలంతా ముస్లింలను తిడతారని, సాయంత్రమైతే వాళ్ల జపం చేస్తారని ఆరోపించారు. ఈ మేరకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన బీసీ ధర్నాలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. బీసీల వేదన కేంద్రానికి తెలియజేయాలనే 'వన్ వాయిస్.. వన్ విజన్.. యునైటెడ్ బీసీ' నినాదంతో ఈ మహా ధర్నా నిర్వహించామని తెలిపారు. ఎస్సీలు, ఎస్టీలు, బీసీల మద్దతు లేకుండా సికింద్రాబాద్‌లో నామినేషన్ వేయగలవా? అంటూ కిషన్ రెడ్డిని ప్రశ్నించారు. బీసీల పేరు చెప్పుకుని ఎన్నికల్లో గెలిచిన బండి సంజయ్ ఇప్పుడు కిషన్ రెడ్డికి వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. మతాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో గెలవడం బీజేపీ నేతలకు అలవాటేనని, వారిది ద్వంద్వ నీతి అని ఆరోపించారు. గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తున్నామని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యల వీడియోను కిషన్ రెడ్డి చూడాలని, ఉత్తరప్రదేశ్‌లో ముస్లింలకు ఉన్న రిజర్వేషన్లపై అధ్యయనం చేయాలని సూచించారు. తెలంగాణ అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతుగా ఓటు వేసిన బీజేపీ ఎమ్మెల్యేలు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఎంత దూరమైనా వెళతామని, వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల కంటే బీసీ రిజర్వేషన్లే ముఖ్యమని చెప్పారు. 'ఒక్క మాటలో చెప్పాలంటే రేవంత్ రెడ్డి మొనగాడు. రాజకీయంగా సంచలన నిర్ణయం తీసుకోవాలంటే దమ్ము, ధైర్యం అవసరం' అని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశంసించారు. సీఎం రేవంత్ నిర్ణయం పట్ల ప్రధాని మోదీ పరేషాన్‌లో పడ్డారని తెలిపారు. కుల సర్వే దేశానికి దిక్సూచని, తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని తెలిపారు.

బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులను ఆమోదించాలి

రేవంత్ ప్రయత్నాలకు అండగా నిలుస్తాం: కనిమొళి.. అంబేడ్కర్, కరుణానిధి సరసన రేవంత్‌రెడ్డి: సుప్రియ



డీఎంకే ఎంపీ కనిమొళి, ఎన్సీపీ(ఎస్పీ) ఎంపీ సుప్రియాలతో రేవంత్ మాటామంతీ

న్యూఢిల్లీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన బీసీ రిజర్వేషన్ల బిల్లులను స్వాగతిస్తున్నట్లు ఇండియా కూటమి నేతలు తెలిపారు. తెలంగాణలో బీసీ ఉద్యమానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులను తక్షణమే ఆమోదించాలని డీఎంకే ఎంపీ కనిమొళి డిమాండ్ చేశారు. తరతరాలుగా వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని గుర్తు చేస్తూ.. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం సీఎం రేవంత్ చేస్తున్న ప్రయత్నాలకు డీఎంకే అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఒక కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి స్థాయి దాకా ఎదిగిన రేవంత్ రెడ్డి.. పీడితులు, తాడితుల తరఫున పోరాడుతున్నారని ఎన్సీపీ(ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే కొనియాడారు. దేశంలో రిజర్వేషన్లు కల్పించిన అంబేడ్కర్, తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లకు కారణమైన కరుణానిధి పేర్ల పక్కన రేవంత్‌రెడ్డి పేరును సువర్ణాక్షరాలతో లిఖించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రేవంత్‌రెడ్డి కీర్తి చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఎవరు ఎంతో.. వారికి అంత దక్కాల్సిందే... అనేది కాంగ్రెస్ సంకల్పమని కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ పేర్కొన్నారు. బీజేపీ మినహా అన్ని పార్టీలు ఓబీసీల రిజర్వేషన్లకు మద్దతు ఇస్తున్నాయని గుర్తు చేశారు. రిజర్వేషన్ల సాధన కోసం యుద్ధానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ఇంత సాహసం చేస్తారని ఊహించలేదని, రెడ్డి వర్గానికి చెందిన వారైనా బీసీల కోసం గళమెత్తారని కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. ఈ తత్వం కాంగ్రెస్ డీఎన్‌ఏలోనే ఉందని, ఒక వరుసలోని చివరి వ్యక్తికి కూడా అన్నీ అందించాలన్నదే తమ పార్టీ ధర్మమని చెప్పారు. తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి సాహసోపేతమైన అడుగు వేశారని, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కులగణన చేపట్టారని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ చేపట్టిన సర్వే, బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం బిల్లులు తీసుకురావడం దేశానికే ఆదర్శమని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో తెలంగాణ మోడల్‌ను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని ఎస్పీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ పేర్కొన్నారు. బీజేపీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా బీసీ బిల్లులను ఆమోదించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు.. ఏ కులానికో, వర్గానికో వ్యతిరేకం కాదని బిహార్ స్వతంత్ర ఎంపీ పప్పు యాదవ్ పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం రాహుల్‌గాంధీ నిరంతరం తపిస్తుంటారని తెలిపారు.

బీసీల పోరు తెలంగాణకే పరిమితం కాదు

- ఇది భారతీయుల సమష్టి యుద్ధం
- బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలి
- ఎక్స్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్
- ఇది జాతీయ పోరాటం: ప్రియాంక




న్యూఢిల్లీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఓబీసీలకు విద్య, ఉపాధి, స్థానిక పాలనలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం కోరుతూ దేశ రాజధాని ఢిల్లీలో పెద్ద ఎత్తున నిర్వహించిన ధర్నా కేవలం తెలంగాణకే పరిమితం కాదని రాహుల్ గాంధీ అన్నారు. ఈ పోరు అణగారిన భారతీయ ప్రజలకు అధికారంలోనూ, అభివృద్ధిలోనూ వాటా కల్పించేందుకు జరుగుతున్న సమష్టి యుద్ధమని ఆయన బుధవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. తెలంగాణ ప్రభుత్వం బిల్లును కులగణన డేటా ఆధారంగా రూపొందించిందని, ఇది రాజ్యాంగంలో పేర్కొన్న సామాజిక న్యాయం దిశగా ఒక ప్రధాన ముందడుగు అని రాహుల్ అభివర్ణించారు. ఈ ధర్నాకు ఇండియా కూటమి నేతలు మద్దతునిచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ బీసీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర వేయాలని ఆయన కోరారు. కాగా, ఓబీసీలకు సామాజిక న్యాయం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలు చేసిన ధర్నా కేవలం తెలంగాణ పోరు మాత్రమే కాదని, అణగారిన వర్గాలకు సరైన ప్రాతినిధ్యం, సమానత్వం, న్యాయం కోసం చేస్తున్న జాతీయ పోరాటమని ప్రియాంకా గాంధీ వాద్రా అన్నారు. ఈ న్యాయం ఆలస్యమైతే వారికి న్యాయాన్ని నిరాకరించినట్లే అని ఆమె ఎక్స్‌లో పేర్కొన్నారు. విద్య, ఉపాధి, స్థానిక పాలనలో 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదించిన బిల్లు చరిత్రాత్మకమైనదని, కులగణన ఆధారంగా రూపొందించిన సాహసోపేత చర్యగా దీన్ని భావించాలని ప్రియాంక అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు దేశ రాజధానిలో నిరసన తెలిపారని, ఈ బిల్లు రాష్ట్రపతి వద్ద నిలిచిపోవడం సరైంది కాదని అన్నారు.

నేడు గోవాలో ఓబీసీ జాతీయ మహాసభ: జాజుల

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీల సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు గురువారం గోవాలో 10వ ఓబీసీ జాతీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గోవాలోని డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆడిటోరియంలో మహాసభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ఈ మహాసభలో సీఎంలు ప్రమోద్ సావంత్ (గోవా), దేవేంద్ర ఫడణవీస్ (మహారాష్ట్ర), మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు నానా పటేల్, ఎంపీ ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తదితరులు పాల్గొంటారని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మహాసభకు వెయి మందికి పైగా ఓబీసీ ప్రతినిధులు హాజరవుతున్నారని జాజుల తెలిపారు.

వ్యవస్థలను భ్రష్టు పట్టించింది కాంగ్రెస్సే

» శాసనమండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు వ్యవస్థలపై నమ్మకం లేదంటూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, వ్యవస్థల గురించి మాట్లాడే నైతిక అర్హత కాంగ్రెస్‌కు లేదని శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి పేర్కొన్నారు. దేశంలో అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించిందే కాంగ్రెస్ అని విమర్శించారు. బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్‌తో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో వ్యవస్థలపై సంపూర్ణ విశ్వాసం ఉన్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని, కేసీఆర్ పాలనలో వ్యవస్థల గౌరవాన్ని ఎంతో పెంచారన్నారు. కాళేశ్వరం కమిషన్‌ను ప్రభావితం చేసేవిధంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని, 665 పేజీల నివేదికలో తమకు నచ్చిన అంశాలను మాత్రమే లీక్‌చేసి బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

కాంగ్రెస్ నిర్ణయాలతో పలు వర్గాలకు నష్టం

» ప్రమాదంలో పడ్డ ప్రమాద బీమా: కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల బతుకుదెరువు ప్రశ్నార్థకంగా మారిందని, కాంగ్రెస్ సర్కార్ అనాలోచిత నిర్ణయాలతో పలువర్గాలకు నష్టం కలుగుతోందని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కార్మికుల ప్రమాద బీమా సౌకర్యానికి సంబంధించిన డబ్బులు కట్టకపోవడంతో ఆ పథకం ప్రమాదంలో పడిందన్నారు. దీంతో 13.51 లక్షల మంది బీమా సౌకర్యం కోల్పోయే పరిస్థితి నెలకొందని, గిగ్ వర్కర్లు, జర్నలిస్టులపైనా ఈ ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. ప్రమాద బీమా డబ్బుల కోసం దాదాపు 1,090 మంది ఎదురు చూస్తున్నారని, దీనిపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టిపెట్టాలని ఆయన సూచించారు.

మైనర్ 28 వారాల గర్భాన్ని తొలగించేందుకు నిరాకరించిన హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఓ బాలిక 28 వారాల గర్భాన్ని తొలగించాలని ఆదేశాలు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ సవరణ చట్టం-2021 ప్రకారం మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి తన కుమార్తె కడుపులోని గర్భాన్ని తొలగించేలా నిలోఫర్ ఆస్పత్రి మెడికల్ సూపరిటెండెంట్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ కొద్దిరోజుల క్రితం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం.. మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి నివేదిక ఇవ్వాలని నిలోఫర్ ఆస్పత్రి మెడికల్ సూపరిటెండెంట్‌ను గతంలోనే ఆదేశించింది. తాజాగా సదరు నివేదికను పరిశీలించిన ధర్మాసనం.. బాలిక 28 వారాల గర్భాన్ని తొలగించడం క్షేమకరం కాదన్న వైద్యనిపుణుల అభిప్రాయంతో ధర్మాసనం ఏకీభవించింది. గర్భాన్ని తొలగించేలా ఆదేశాలిచ్చేందుకు నిరాకరించింది.

విద్యార్థులకు హాజరు 65% ఉండాల్సిందే: హైకోర్టు

» సింగిల్ జడ్జి ఆదేశాలను కొట్టేసిన డివిజన్ బెంచ్

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కనీస హాజరు 65% ఉండాల్సిందేనని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. ప్రభుత్వ, యూనివర్సిటీ నిబంధనల ప్రకారం సాధారణంగా 75% హాజరుశాతం ఉండాలని, అనారోగ్య సమస్యలు, క్రీడల్లో పాల్గొనడం వంటి కారణాలతో 10% మినహాయింపు పొందవచ్చని తెలిపింది. అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకునే నిబంధనలు రూపొందించారని, వాటిని మార్చి కోర్టులు తీర్పులు ఇవ్వలేవని స్పష్టం చేసింది. హాజరు శాతం తక్కువగా ఉందని గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజీ ఓ విద్యార్థినిని పరీక్షలకు అనుమతించలేదు. దీంతో ఆ విద్యార్థిని హైకోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి బెంచ్.. అనారోగ్య కారణంగా విద్యార్థిని హాజరు శాతం తగ్గడాన్ని తీవ్రంగా పరిగణించొద్దని, పరీక్షలకు అనుమతించాలని ఆదేశాలు జారీచేసింది. దీనిపై కాలేజీ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. ఈ అప్పీల్‌పై చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ప్రస్తుత కేసులో విద్యార్థికి అనుమతిస్తే.. హాజరుశాతం తక్కువ ఉన్న విద్యార్థులంతా న్యాయస్థానాలను ఆశ్రయించేందుకు అవకాశం ఇచ్చినట్లవుతుందని వ్యాఖ్యానించింది. యూనివర్సిటీ నిబంధనల్లో జోక్యం చేసుకోలేం అంటూ సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేసింది.

శతాధిక డిగ్రీల ఆచార్య సుధాకర్ కన్నుమూత

» 110 డిగ్రీలతో గిన్నిస్ రికార్డు



ఆచార్య పీజే సుధాకర్ (ఫైల్)

పెందుర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వందకుపైగా డిగ్రీలతో గిన్నిస్ రికార్డు నెలకొల్పిన ఆచార్య డాక్టర్ పీజే సుధాకర్ (68) అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఏపీలోని విశాఖపట్నం జిల్లా చినముషిడివాడలోని తన సోదరుడి ఇంటి వద్ద తుదిశ్వాస విడిచారు. పెందుర్తి మండలం పెదగాడిలో నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన సుధాకర్ విద్యావేత్తగా, పరిశోధకుడిగా వినుతికెక్కారు. కేంద్ర సమాచార ప్రసారాల అదనపు డైరెక్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. తన జీవితంలో సుధాకర్ 110 డిగ్రీలు, పదుల సంఖ్యలో పీజీలు పూర్తిచేశారు. పీహెచ్‌డీ కూడా చేశారు. శతాధిక డిగ్రీలు పూర్తిచేసి గిన్నిస్ వరల్డ్ రికార్డు కూడా సాధించారు.

ఆరోగ్యశ్రీ పేరుతో ఖాతాలు ఖాళీ చేసే.. అంతర్రాష్ట్ర సైబర్ నేరగాడి అరెస్టు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ పేరుతో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర సైబర్ నేరగాడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. ఏపీలోని కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన ముల్లంటి సలీం మాలిక్ ఢిల్లీకి చెందిన సత్యంతో కలిసి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. తమ ఖాతాలో ఆరోగ్యశ్రీ పేరుతో డబ్బులు జమ అయ్యాయని సలీం మాలిక్ బాధితులకు ఫోన్ చేసి తెలిపేవాడు. ఢిల్లీలో ఉన్న సత్యం ద్వారా బాధితుల ఫోన్‌కు కొన్ని లింక్‌లు పంపేవాడు. ఆ లింకును క్లిక్ చేయగానే బాధితుల ఖాతాలో ఉన్న డబ్బులు కట్ అయ్యేవి. దీనికి సహాయపడిన సత్యంకు సలీం మాలిక్ కొంత డబ్బులు పంపించేవాడు. ఇదేవిధంగా మోసపోయిన జిల్లాలోని ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన రాజిరెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జిల్లా సైబర్ బృందంతో కలిసి పోలీసులు ప్రత్యేక టీమ్‌గా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలతో నిందితుడు సలీం మాలిక్‌ను హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి బుధవారం అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడిని కూడా త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ వెల్లడించారు. నిందితులపై తెలుగు రాష్ట్రాల్లో 79 ఫిర్యాదులు ఉన్నాయని, వారు సుమారు 60 లక్షల రూపాయలకు పైగా ఆన్‌లైన్ మోసాలకు పాల్పడ్డారని తెలిపారు.

మెడికల్ కాలేజీలపై జరిమానా విధించే అధికారం మీకుందా?

» కాళోజీ హెల్త్ వర్సిటీకి హైకోర్టు ప్రశ్న

» ఇటీవల చల్మెడ కాలేజీలో హెల్త్ వర్సిటీ అధికారుల తనిఖీలు.. భారీగా లోపాలు

» కాలేజీపై రూ.కోటి జరిమానా

» అభ్యర్థనతో రూ.20 లక్షలకు తగ్గింపు

» వర్సిటీ నోటీసు చెల్లదంటూ హైకోర్టుకు చల్మెడ ఆనందరావు కాలేజీ

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): "తన పరిధిలోకి వచ్చే మెడికల్ కాలేజీలపై జరిమానా విధించే అధికారం కాళోజీ హెల్త్ యూనివర్సిటీకి ఉంటుందా" అని హైకోర్టు ప్రశ్నించింది. ఈ అంశంపై స్పష్టత వచ్చే వరకు రూ.20 లక్షల జరిమానా కట్టాలని చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీపై ఒత్తిడి తేవొద్దని వర్సిటీని ఆదేశించింది. ఇటీవల చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీలో కాళోజీ వర్సిటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు లోపాలను గుర్తించారు. ఇందుకు గాను రూ.కోటి జరిమానా విధించారు. జరిమానాను తగ్గించాలని కాలేజీ యాజమాన్యం కోరడంతో రూ.20 లక్షలకు తగ్గిస్తూ, ఈ మొత్తాన్ని 7రోజుల్లోగా చెల్లించాలని జూలై 30న నోటీసు ఇచ్చారు. అయితే, ఈ నోటీసు చెల్లదని చల్మెడ మెడికల్ కాలేజీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. చిన్న చిన్న లోపాలను కారణాలుగా చూపిస్తూ జరిమానా విధించే అధికారం హెల్త్ యూనివర్సిటీకి లేదని అన్నారు. ఎలాంటి అధికార పరిధి లేకపోయినా జరిమానాలు విధించడం ప్రాథమిక హక్కులకు, సహజన్యాయసూత్రాలకు వ్యతిరేకమన్నారు. హెల్త్ వర్సిటీ తరఫు న్యాయవాది వాదిస్తూ.. మెడికల్ కాలేజీలో యూనివర్సిటీ అధికారులు భారీ లోపాలు గుర్తించారని, కాలేజీ గుర్తింపును రద్దు చేయాల్సి ఉన్నప్పటికీ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా రూ.కోటి జరిమానా విధించారని చెప్పారు. జరిమానా తగ్గించాలని కాలేజీ విజ్ఞప్తి చేయడంతో దాన్ని రూ.20 లక్షలకు తగ్గించారన్నారు. జరిమానా తగ్గించాలని ఒక వైపు విజ్ఞప్తి చేసి, జరిమానా తగ్గించిన తర్వాత పిటిషనర్ కోర్టుకు వచ్చారని పేర్కొన్నారు. జరిమానా విధించే అధికారం హెల్త్ యూనివర్సిటీకి ఉందని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. జరిమానా విధించే అధికార పరిధి హెల్త్ యూనివర్సిటీకి ఉం దా. .లేదా? అనేది ఇక్కడ ప్రధాన అంశమని పేర్కొంది. ఈ విషయం తేలేవరకు రూ.20 లక్షల జరిమానా విధించడంపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జరిమానా తప్ప మెడికల్ కాలేజీకి హెల్త్ యూనివర్సిటీ ఇచ్చిన నోటీసు యథావిధిగా కొనసాగుతుందని పేర్కొంది. తదుపరి విచారణ సెప్టెంబరు 3వ తేదీకి వాయిదా వేసింది.



కేంద్ర మంత్రి జితన్‌రామ్ మాంఝీని కలిసిన ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి, ఎంపీ మల్లు రవి



కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్‌ను కలిసిన మంత్రి తుమ్మల, చిత్రంలో ఎంపీ చామల

ఎంఎస్ఎంఈ పార్కులకు నిధులు ఇవ్వండి

» నియోజకవర్గానికో పార్కు ఏర్పాటుకు నిర్ణయించాం

» ముందుగా ఖమ్మం జిల్లాలో యెండపల్లి, రెమిడిచర్లలో..

» వీటి ద్వారా 20 వేల మందికి ఉపాధి అవకాశాలు

» కేంద్ర మంత్రి మాంఝీకి భట్టి విక్రమార్క విజ్ఞప్తి

» యూరియా కోటాను వెంటనే సరఫరా చేయండి

» కేంద్ర మంత్రులు నడ్డా, నిర్మలకు తుమ్మల విజ్ఞప్తి

» వరంగల్‌లో చారిత్రక ఆలయాలకు నిధులు ఇవ్వండి

» కేంద్ర మంత్రి షెఖావత్‌ను కోరిన ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు

ఢిల్లీ/హైదరాబాద్/ఖమ్మం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిశారు. ఎంఎస్ఎంఈ పార్కులు, యూరియా, ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకం తదితర అంశాలపై వినతి పత్రాలు అందజేశారు. రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల) పార్కు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, వీటికి ఆర్థిక సాయం అందించాలని ఆ శాఖ కేంద్ర మంత్రి జితన్‌రామ్ మాంఝీని భట్టి కోరారు. ఖమ్మం జిల్లా యెండపల్లి, రెమిడిచర్ల గ్రామాల్లో ఏర్పాటు చేయతలపెట్టిన రెండు పార్కుల ప్రతిపాదనలు పంపడానికి ముందస్తు అనుమతి ఇవ్వాలని అభ్యర్థించారు. వీటి ద్వారా కనీసం 5 వేల మందికి ప్రత్యక్షంగా, 15 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని చెప్పారు. భట్టితో పాటు రాష్ట్ర పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ మల్లు రవి ఉన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాను కలిశారు. తెలంగాణకు ఆగస్టు నెలలో రావాల్సిన యూరియా కోటా (1.7 లక్షల మెట్రిక్ టన్నుల)తో పాటు ఏప్రిల్ నుంచి జూలై వరకు కోత పెట్టిన యూరియా (2.1 లక్షల మెట్రిక్ టన్నుల)ను కూడా వెంటనే భర్తీ చేయాలని కోరారు. తుమ్మల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలిసి క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని తిరిగి 44 శాతానికి పెంచాలని కోరారు. తుమ్మలతో పాటు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఉన్నారు. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చారిత్రక ఆలయాలు, కాకతీయ వారసత్వ సంపదను పునరుద్ధరించాలని ఎంపీ కడియం కావ్య కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్‌ను కోరారు. వేయి స్తంభాల గుడికి 75 కోట్లు, భద్రకాళి ఆలయంలో మహా మండప నిర్మాణానికి రూ.100 కోట్లు, వరంగల్ కోటలో ఉన్న 14 ఆలయాల పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని కోరారు. ఎంపీతో పాటు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కేఆర్ నాగరాజ్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య కూడా ఉన్నారు.

నాలుగో అంతస్తు కిటికీలోంచి దూకి..

» కన్నవారి ఇంట్లోంచి బయటపడేందుకు వివాహిత విఫలయత్నం.. తీవ్రగాయాలతో బ్రెయిన్‌డెడ్

» ప్రేమ పెళ్లి.. భర్త వేధింపులతో గతంలోనే ఆత్మహత్యాయత్నం

» ఇంటికి తెచ్చుకొని గదిలో పెట్టిన తల్లిదండ్రులు.. ఎస్సార్‌నగర్‌లో ఘటన



రజిత

అమీర్‌పేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల ఇంట్లోంచి బయటపడేందుకు ఓ వివాహిత విఫలయత్నం చేసింది. నాలుగో అంతస్తు గదిలోని కిటికీలోంచి చీరను ఆసరాగా చేసుకొని దిగేందుకు ప్రయత్నించి తీవ్రంగా గాయపడి.. బ్రెయిన్ డెడ్ అయింది. మృతురాలు 33 ఏళ్ల రజిత. సనత్‌నగర్‌లో ఉంటున్న ఓ ఎస్సై కుమార్తె! ఎస్ఆర్‌నగర్ పోలీసుల వివరాల ప్రకారం.. రజిత సైకాలజీతో డిగ్రీ పూర్తిచేసింది. సైకాలజీ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా బంజారాహిల్స్‌లోని ఓ ఆస్పత్రిలో పనిచేస్తున్న రోజుల్లో ఆమెకు అక్కడ కేపీహెచ్‌బీకి చెందిన రోహిత్ (33)తో పరిచయమైంది. తాను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అంటూ అబద్ధం చెప్పి ఆమెకు రోహిత్ దగ్గరయ్యాడు. ఇద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. పెళ్లయ్యాక.. రోహిత్ ఏ పనీ చేయకుండా జల్సాలకు అలవాటు పడ్డాడు. నగరంలోని ప్రముఖ ఇంటర్నేషనల్ పాఠశాలలో రజిత పనిచేస్తోంది. ఆమె జీతం డబ్బులను కూడా రోహిత్ తీసుకొని ఖర్చు చేసేవాడు. చెడు అలవాట్లు మానుకోవాలని రజిత ఎన్నోసార్లు చెప్పినా కూడా అతడిలో మార్పు రాలేదు. రోహిత్ తల్లిదండ్రులు, సోదరుడు మోహిత్ అతడికే మద్దతు పలుకుతూ రజితను వేధించేవారు. రోహిత్ వేధింపులు భరించలేక రజిత గత నెల 16న నిద్రమాత్రలు మింగింది. ఆమెను ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం కోలుకున్న ఆమెను తల్లిదండ్రులు తమ ఇంటికి తీసుకెళ్లారు. అయితే ఆమెను బయటకు వెళ్లకుండా నాలుగో అంతస్తులో ఉన్న తమ ఇంట్లోని గదిలో ఉంచారు.. గత నెల 28న ఆమె ఇంట్లోంచి బయటపడేందుకు గదిలోని బాత్రూం కిటికీలోంచి చీరను తాడుగా చేసుకొని.. దాని ఆసరాగా కిందకు దిగేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో పట్టు తప్పడంతో నేరుగా కిందపడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను తల్లిదండ్రులు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదైంది.

ఫాంహౌస్ కేసులో అభాండాలు మోపారు

» హతమారుస్తామని వేలాదిగా ఫోన్లు వచ్చాయి

» బీఆర్ఎస్‌లో నన్నెవ్వరూ పట్టించుకోలేదు

» మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



అచ్చంపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): "ఫాంహౌస్ కేసులో వంద కోట్లకు అమ్ముడుపోయానంటూ నాపై అభాండాలు మోపారు. నన్ను హతమారుస్తామంటూ వేలాది ఫోన్లు వచ్చాయి. ఇంత జరిగినా బీఆర్ఎస్‌లో నా గురించి ఎవరూ పట్టించుకోలేదు" అని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల ప్రకారమే తనకు ఇచ్చిన రోల్‌ను ఫాంహౌస్‌లో పోషించానని, ఆ విషయం పార్టీ పెద్దలకు తెలుసని చెప్పారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన తర్వాత మొదటిసారి బుధవారం నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేటకు వచ్చిన ఆయన తన నివాసంలో ముఖ్యకార్యకర్తలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను అచ్చంపేటలో అడుగుపెట్టినప్పుడు బీఆర్ఎస్‌కు క్యాడరే లేదని, కష్టపడే తత్వం ఉన్నందున రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఈ ప్రాంత ప్రజలకు సేవ చేశానని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కనీస అంతర్మథనం కూడా జరగలేదని, ఎంపీ స్థానంలో నిలబడి పార్టీని గెలుపించుకుందామనుకుంటే తనను సంప్రదించకుండానే మరొకరికి సీటు కేటాయించారన్నారు. రెండు జాతీయ పార్టీల నుంచి తనకు ఆహ్వానం ఉన్నా.. పేదల కోసం పనిచేసే వైపే ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌ను వీడవద్దని, రాజీనామాను వెనక్కి తీసుకోవాలని కోరుతూ కొందరు కార్యకర్తలు కన్నీరుపెట్టారు.

బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా ఈ నెల 9,10 తేదీల్లో ధర్నాలు

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42% రిజర్వేషన్ల బిల్లును కేంద్రం వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 9, 10 తేదీల్లో ఆందోళనలు చేపట్టనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఎస్. వీరయ్య అధ్యక్షతన బుధవారం జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తూ.. తెలంగాణలో మాత్రం ఆ పార్టీ నేతలు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి.. కలిసి వచ్చే శక్తులందరితో కలిసి ఐక్యంగా ఉద్యమించాలని, దానికి సీపీఎం మద్దతు ఉంటుందని తెలిపారు. కాగా, మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని జాన్ వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆందోళనకు దిగిన కార్మికులను అరెస్టు చేయడాన్ని సీపీఎం ఖండిస్తోందన్నారు.

ఆహ్వానిస్తే.. బీఆర్ఎస్ బీసీ సభకు వెళ్తా

ఇప్పటివరకైతే నాకు ఎలాంటి పిలుపు రాలేదు.. ఢిల్లీలో కాంగ్రెస్ నిజ స్వరూపం బట్టబయలైంది

» ధర్నాకు రాహుల్ మొహం చాటేశారు

» సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యంగా జాగృతి కృషి: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్/హైదరాబాద్‌సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టే బీసీ సభకు రమ్మని పిలిస్తే.. వెళ్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ చేపట్టదలచిన బీసీ సభ వాయిదా పడినట్లు తెలిసిందని, ఇందులో పాల్గొనాలని ఇప్పటివరకైతే తనకు ఆహ్వానం అందలేదని తెలిపారు. బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో బుధవారం తెలంగాణ జాగృతి ఆవిర్భావ దినోత్సవం, జాగృతి శ్రేణులతో సమావేశం, ప్రొఫెసర్ జయశంకర్ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీ నడివీధుల్లో కాంగ్రెస్ నిజస్వరూపం మరోసారి బట్టబయలైందని, తెలంగాణ బీసీ బిడ్డలను వరుసగా రెండు సార్లు ఢిల్లీకి పిలిపించి రాహుల్ గాంధీ అవమానించారని దుయ్యబట్టారు. గతంలో జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు గైర్హాజరైన ఆయన.. ఇప్పుడు మరోసారి మొహం చాటేశారని విమర్శించారు. 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టి చేతులు దులుపుకొన్నారని ధ్వజమెత్తారు. రాహుల్‌ను ఉద్దేశించి.. మిస్టర్ ఎలక్షన్ గాంధీ బీసీలంటే మీకు అంత చులకనా? అని నిలదీశారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి బీసీలను మోసం చేస్తున్నాయని, 42% బీసీ రిజర్వేషన్లలో ముస్లింల అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకముందే కేంద్రమంత్రి బండి సంజయ్ ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. నాటకాలాడుతున్న బీజేపీ, కాంగ్రెస్‌కు తెలంగాణ బీసీలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఢిల్లీలో కాంగ్రెస్ దొంగ ధర్నాలతో ఒరిగేదేమీ లేదని, బీసీ బిల్లుల ఆమోదం కోసం సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రపతిని కలవాలని డిమాండ్ చేశారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని, ఈ మేరకు అన్ని పార్టీల అధ్యక్షులకు లేఖలు రాయాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ అమలుకు తీసుకొచ్చిన ఆర్డినెన్సును గవర్నర్ ఆమోదించకపోతే.. సుప్రీంకోర్టును ఆశ్రయించాలని సూచించారు. ఢిల్లీలో బీసీ ధర్నా కోసమే తన దీక్షను ప్రభుత్వం భగ్నం చేసిందని దుయ్యబట్టారు. కాగా, సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యంగా అన్ని అంశాలపై పోరాడతామని, రాష్ట్రంలో సామాజిక, సాంస్కృతిక విప్లవోద్యమాలకు జాగృతి సంస్థ నాయకత్వం వహిస్తుందని కవిత తెలిపారు. రాష్ట్రం ఏర్పడ్డాక సామాజిక తెలంగాణ కోసం, బీసీల కోసం ఉద్యమిస్తానని జయశంకర్ చెప్పేవారని, ఆయన స్ఫూర్తితో జాగృతి పని చేస్తుందని తెలిపారు. తెలంగాణ జాగృతిని మరింత బలోపేతం చేసేందుకు జిల్లా, మండల స్థాయిలో కమిటీలను వేస్తామని, ఈనెల 15లోపు మరిన్ని కమిటీలను ప్రకటిస్తామని కవిత వెల్లడించారు.

ఇప్పుడేం చేద్దాం?

(మొదటి పేజీ తరువాయి)

వివరిస్తూ.. హరీశ్‌రావు ఇటీవల ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ప్రజల్లోకి ఎంత మేరకు వెళ్లింది అనే అంశంపై ఇరువురు చర్చించుకున్నారని సమాచారం. అలాగే, కాళేశ్వరం కమిషన్ నివేదిక పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆరోపణలను ప్రజల్లో బలంగా తిప్పి కొట్టేందుకు ఏం చేయాలనే విషయంలో కేసీఆర్ ఈ సందర్భంగా హరీశ్‌కు పలు సూచనలు చేసినట్టు తెలిసింది. అలాగే, కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తదుపరి ఏం చేయనుంది? ప్రభుత్వ చర్యను అధిగమించేందుకు ఎలా స్పందించాలి ? అనే అంశాలపై కూడా కేసీఆర్‌తో హరీశ్ సమాలోచన చేసినట్టు సమాచారం. అయితే, కమిషన్ నివేదిక అంశంలో భయపడాల్సిన పని లేదని, ప్రభుత్వ నిర్ణయం ప్రకారం న్యాయనిపుణుల సలహాలు, సూచనలతో ముందుకు వెళ్లాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిసింది. కాగా, బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలో చేపట్టిన ధర్నా అంశాన్ని హరీశ్‌తో భేటీ సందర్భంగా కేసీఆర్ ప్రస్తావించినట్టు సమాచారం. కాంగ్రెస్ ధర్నా ప్రభావం ప్రజల్లో ఎంత మేరకు ఉంది, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్లాలి, బీసీల అంశంలో బీఆర్ఎస్ ఏవిధంగా ముందుకు వెళ్లాలన్న విషయాలపై కూడా కేసీఆర్ చర్చించినట్లు తెలుస్తోంది.

హైకోర్టు సీజేతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం!

తెలంగాణలో సివిల్ జడ్జిల నియామకంపై సుప్రీంకోర్టుకు తెలిపిన అదనపు సొలిసిటర్ జనరల్

తదుపరి విచారణ ఈ నెల 13కు వాయిదా

న్యూఢిల్లీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సివిల్ జడ్జిల నియామకంపై రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజన్ సుప్రీంకోర్టుకు తెలిపారు. సివిల్ జడ్జి నియామకాలకు దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా హైకోర్టు లేదా దాని అధీనంలోని కోర్టుల్లో కనీసం ఏడేళ్లపాటు న్యాయవాదిగా పనిచేసి ఉండాలని హైకోర్టు రూపొందించిన నియమావళిలో ఉంది. కానీ, 2023 ఏప్రిల్ 12న నోటిఫికేషన్ జారీ కాగా, ఆ నియమావళి జూన్ 10న అమల్లోకి వచ్చింది. దీంతో 2017 నియమావళి ప్రకారమే అర్హత నిర్ణయించాలంటూ అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సివిల్ జడ్జిగా ఎంపిక కావాలంటే.. ఆ అభ్యర్థి తప్పనిసరిగా తెలంగాణలోనే న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసి ఉండాలన్న నిబంధనను కూడా సవాల్ చేశారు. ఆ పిటిషన్‌ను బుధవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్ ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొందరు అభ్యర్థులు కూడా నియామక ప్రక్రియలో పాల్గొనగా వారికి అవకాశం దక్కలేదని తెలిపారు. 11 పోస్టుల కోసం నోటిఫికేషన్ ఇచ్చి, మూడింటినే భర్తీ చేశారని, మిగిలిన ఎనిమిది పోస్టులను 2024 నోటిఫికేషన్‌కు మళ్లించారని తెలిపారు. అలాగే, మెరిట్‌లో ఉన్న అభ్యర్థులను పక్కనబెట్టి, తక్కువ మార్కులు సాధించిన వారికి (వారు తెలంగాణలోనే న్యాయవాదిగా పనిచేస్తున్నారనే కారణంతో) ఉద్యోగాలు ఇచ్చారని వివరించారు. స్పందించిన ధర్మాసనం.. ఇంకా ఖాళీలు ఉన్నప్పటికీ అర్హులైన అభ్యర్థులను ఎందుకు నియమించలేదని ప్రశ్నించింది. తెలంగాణ హైకోర్టు జారీ చేసిన నూతన నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలన్నది చీఫ్ జస్టిస్ అభిమతమా? లేదా దీనిపై పునఃసమీక్షకు అవకాశం ఉందా? అని అదనపు సొలిసిటర్ జనరల్‌ను అడిగింది. "పిటిషనర్లు మధ్యంతర ఉత్తర్వుల మేరకు పరీక్షలు రాసి, మెరిట్‌లో నిలిచారు. కొత్త నిబంధనల వల్ల మాత్రమే వారు నియామకానికి అర్హులుగా పరిగణించబడడం లేదు. చీఫ్ జస్టిస్ ఈ విషయంపై పునర్విచారణకు సిద్ధంగా ఉంటే, నియామకాలపై పునరాలోచన చేయవచ్చు కదా?" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. స్పందించిన నటరాజన్.. తెలంగాణ హైకోర్టుకు చీఫ్ జస్టిస్ కొత్తగా బాధ్యతలు చేపట్టారని, ఆయనతో మాట్లాడిన తర్వాత అభిప్రాయం తెలియజేస్తామని చెప్పారు. దీంతో తదుపరి విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.